


ESTD: 1999

www.voodayam.com

# వుదయం

హైదరాబాద్ 07-03-2026 శనివారం సంపుటి : 26 | సంచిక : 356 SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY రూ. 3.00 | పేజీలు : 12 VOODAYAM Telugu DAily

Simultaneously Published from Hyderabad, Adilabad, Karimnagar, Khammam, Guntur & Warangal

Follow us on

రంజాన్ వేళలు

| ఇఫ్తార్ (సాయంత్రం) | సహార్ (ఉదయం) |
|---|---|
| 6 :30 | 5 :08 |

## గల్ఫ్ మంటలు



# యుద్ధ ఉద్ధృతి

- టెహ్రాన్ భూగర్భ బంకర్ పై ఇజ్రాయెల్ ఫైటర్ జెట్ల భారీ దాడులు
- ఇరాన్ క్షిపణి స్థావరాల వద్ద భారీ పేలుళ్లు
- కువైట్, కతార్, సౌదీ అరేబియా, బహ్రెయిన్‌లపై క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించినా ఇరాన్
- లెబనాన్‌లో ఇజ్రాయెల్ వైమానిక దాడులు
- ఇరాన్ దాడులతో దెబ్బతిన్న చమురు సరఫరాలు, విమాన ప్రయాణాలు
- పరిమితంగా విమానాలు నడుపుతున్న వైమానిక సంస్థలు
- 281 విమానాలను రద్దు చేసినట్టు ఇండియా ప్రకటన




**వుదయం డెస్క్, మార్చి 6 :** తెహ్రాన్ నడిబొడ్డున గల ఇరాన్ సుప్రీం నాయకుడు ఖమేనీ అధికారిక నివాస ఆవరణ కింద నిర్మించిన భూగర్భ బంకర్‌పై శుక్రవారం నాడు ఇజ్రాయెలీ ఫైటర్ జెట్లు భారీ దాడులు నిర్వహించాయి. ఈ ఆపరేషన్‌లో దాదాపు 50 జెట్లు పాలుపంచుకున్నాయి. మొస్సాద్ సమన్వయంతో ఇజ్రాయెల్ మిలటరీ ఇంటెలిజెన్స్ నుంచి వచ్చిన ఖచ్చితమైన నిఘా మార్గదర్శనంలో ఈ దాడులు జరిపినట్టు ఇజ్రాయెల్ వైమానిక దళం పేర్కొంది.

మిగతా 2లో

# సివిల్స్ విజేతలు

- మొదటి ర్యాంకు అనూజ్ అగ్నిహోత్రి
- రెండవ స్థానం రాజేశ్వరి సువే
- మూడో ర్యాంకు అకాంక్ష్ ధుల్

### తెలుగు తేజాలు

సివిల్స్ ఫలితాల్లో పలువురు తెలుగు విద్యార్థులు సత్తా చాటారు. జశ్వంత్ చంద్ర 23వ ర్యాంకుతో మెరవగా.. సృజన 55వ ర్యాంకు, భానోత్ లక్ష్మి రచన 178, డీఎస్‌కే ప్రచేత్ 193, ఎస్ వర్షిత్ రెడ్డి 259, ఎం.పవన్‌కుమార్ రెడ్డి 297, వెలిమినేటి విక్రమసింహారెడ్డి 541, గుమ్మల శ్వేత 573, పల్లి ప్రమోద్ విష్ణు 640, గుమ్మల విజయసింహారెడ్డి 682, పోతుపురెడ్డి భార్గవ్ 738, పుడారి రాహుల్ 748, కుమ్మరి శ్రవణ్‌కుమార్ 768, అనిరుధ్ కత్తిమాని 786, కోరపోతుల శ్రీకర్‌రాజు 806, ఇస్లావత్ శ్రీరామ్ హర్ష 823, కట్టా ప్రత్యూష 908, గోగుల రాజశేఖర్ 920, గుగులోతు జితేందర్ నాయక్ 939వ ర్యాంకులతో తమ విశేష ప్రతిభను చాటారు.

**హైదరాబాద్, మార్చి 6 (వుదయం ప్రతినిధి) :** అఖిల భారత సర్వీసుల్లో నియామకాల కోసం యూపీఎస్సీ నిర్వహించిన సివిల్స్ (మెయిన్) – 2025 తుది ఫలితాలు విడుదలయ్యాయి. యూపీఎస్సీ అధికారులు శుక్రవారం మధ్యాహ్నం ఈ ఫలితాలను విడుదల చేశారు. ఈ పరీక్షలో మొత్తం 958 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. వీరిలో జనరల్ కేటగిరీ నుంచి 317 మంది ఉండగా.. ఈడబ్ల్యూఎస్ నుంచి 104, ఓబీసీ నుంచి 306, ఎస్సీ కేటగిరీ నుంచి 158, ఎస్టీ కేటగిరీ నుంచి 73 మంది చొప్పున ఉన్నట్లు యూపీఎస్సీ ప్రకటించింది. ఈ ఫలితాల్లో అనూజ్ అగ్నిహోత్రి, రాజేశ్వరి సువే, ఆకాన్ష్ ధుల్ తొలి మూడు ర్యాంకులతో సత్తా చాటగా.. పలువురు తెలుగు విద్యార్థులు సివిల్స్‌లో మెరిశారు.

మిగతా 2లో

# మాదిగలకు అండగా..

## ప్రజా సేవకే సీఎం అయ్యాను, నన్ను ఎవరు ఎలా పిలిచినా పట్టించుకోను

- మిత్రధర్మానికి కట్టుబడి మాదిగల వెంట నిలబడ్డ
- రాజకీయ ఒత్తిళ్లు వచ్చినా మాదిగల పక్కన నిలబడిన
- నాపై జరుగుతోన్న దాడులకు మీ జాతి అండగా ఉండాలి
- మాదిగ ఎంప్లాయిస్ కో ఆర్డినేషన్ కమిటీ సన్మాన కార్యక్రమంలో సీఎం రేవంత్



**హైదరాబాద్, మార్చి 6 (వుదయం ప్రతినిధి):** రాష్ట్రానికి సీఎంగా అన్ని వర్గాలకు తాను అందరి వాడినని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఎవరు ఏ పేరుతో పిలిచినా నాకు వచ్చిన ఇబ్బందేమీ లేదన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసినప్పుడు రేవంత్ మాదిగ, బీసీలు రేవంత్ యాదవ్, వాకిటి శ్రీహరి కి మంత్రి పదవి ఇస్తే రేవంత్ ముదిరాజ్ అని, సిక్కులు సర్దార్ రేవంత్ అని అసదుద్దీన్ కు సాయం చేశానని రేవంతుద్దీన్ అని ప్రతిపక్షాలు నాపై సెటర్లు వేసి పైశాచికానందం పొందారన్నారు. అయినా వారి ఆరోపణలు, విమర్శలను తాను పట్టించుకోలేదని తేల్చి చెప్పారు. సీఎంగా వచ్చిన అవకాశాన్ని పది మంది కి సహాయం చేయడానికే అని భావిస్తున్నట్లు వెల్లడించారు. వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుని మీ జాతికి చేయూత ఇచ్చినప్పుడే నాకు నిజమైన సంతోషం కల్గుతుందని చెప్పారు. మాదిగ ఎంప్లాయిస్ కో ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ లోని శిల్పకళావేదికలో సీఎం రేవం త్ రెడ్డికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంపై రేవంత్ రెడ్డికి మాదిగ సామాజికవర్గ ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 2023 ఎన్నికల్లో కష్టపడి ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారని అన్నారు. చిత్తశుద్ధితో ప్రజల ముందుకు వచ్చాం కాబట్టే ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగజాతి ఎంతో పోరాటం చేసిందని కొనియాడారు. ఈ పోరాటంలో అనేకమంది ప్రాణాలు కూడా కోల్పోయారని గుర్తుచేశారు. స్వయంగా తాను ఎన్నో ఏళ్లుగా వర్గీకరణ సమస్యను ప్రత్యక్ష్యంగా చూస్తూ వచ్చానని తెలిపారు. ఈ న్యాయమైన హక్కుపై మొదటినుంచి కూడా అనుకూలంగా ఉన్నట్లు చెప్పారు. ఈ సమస్యపై పోరాటం చేసినందుకు గతంలో తనను అసెంబ్లీ నుంచి గెంటేశారని

### కర్ణుడు, బర్బరీకుడు నా ఇష్ట పాత్రలు

తెలిపారు. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా మీవైపే నిలబడ్డానని చెప్పారు. తనతో పాటు అనేకమంది వర్గీకరణ కోసం పోరాటం చేశారని చెప్పారు. సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత వర్గీకరణ కోసం ప్రకటన చేసిన తొలిరాష్ట్రం తెలంగాణేనని సీఎం వెల్లడించారు. వర్గీకరణ అంశంలో మాదిగల వైపు న్యాయం ఉందన్న సీఎం..ఇందులో నాకు ఎటువంటి అనుమానం లేదన్నారు. అందుకే చివరి వరకు మీకోసం స్టాండ్ తీసుకున్నానని వెల్లడించారు. ఇది ప్రజలు అందరూ కోరుకుంటే వచ్చిన ప్రభుత్వమని అన్నారు. అంతా సమిష్టిగా కష్టపడి బీఆర్ఎస్‌ను గద్దె దింపినట్లు చెప్పుకొచ్చారు. ముఖ్యంగా తాము మాటలతో కాదు.. కమిట్‌మెంట్‌తో గెలిచాము



మని స్పష్టం చేశారు. ప్రగతి ప్రణాళికలో నిర్లక్ష్యంగా ఉండొద్దని సీఎం సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సంక్షేమ ఫలాలు అందించాలనేదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మీరు పన్నులు సక్రమంగా వసూలు చేసి ఖజానా నింపితే పేదలకు మేలు జరుగుతుందని చెప్పారు. . ప్రభుత్వ ప్రణాళికలను అమలు చేసేది మీరేనన్నారు. భవిష్యత్‌లో మీ హక్కులకు చట్టబద్ధత కల్పిస్తామని సీఎం హామీ ఇచ్చారు.

### విద్య కోసం ప్రత్యేక ప్రణాళికలు

పంచడానికి ప్రభుత్వం వద్ద భూములు లేవన్న సీఎం రేవంత్ రెడ్డి చదువు ఒక్కటే ప్రజలకు ఇవ్వగలిగే ఆస్తి అన్నారు. విద్య కోసం ప్రత్యేక ప్రణాళికలు రచిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని ప్రతీ పేదవాడికి విద్యను దగ్గరచేయడానికే స్వయంగా తానే విద్యాశాఖ తీసుకున్నానని రేవంత్ రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యాశాఖను ప్రక్షాళన చేశాం. బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ తీసుకొచ్చాం.. బ్యాగులతో కూడిన కిట్ ఇవ్వబోతున్నాం.. హెల్తీ ఫుడ్ ఇస్తున్నాం. రాష్ట్రంలో పేదరికమనే కారణం చేత ఎవరూ విద్యకు దూరం కాకుండా చూడటమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం చెప్పుకొచ్చారు. మహాభారతంలో తనకు ఇష్టమైన పాత్ర కర్ణుడు, బర్బరీకుడిది అని సీఎం చెప్పారు. కర్ణుడి మాదిరిగా మాదిగల విషయంలో మిత్రధర్మం పాటిస్తున్నట్లు వివరించారు. బర్బరీకుడు బలహీన పక్షాల వైపు నిలబడ్డ వ్యక్తి అనీ అందుకే మాదిగల విషయంలో వర్గీకరణ కోసం బర్బరీకుడిలా పనిచేశానని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో మంత్రులు దామోదర్ రాజనర్సింహా, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.

# నిధుల పంచాయతీ

- మూడేళ్ల తర్వాత 15వ ఆర్థిక సంఘం కింద రూ. 1,034 కోట్లు విడుదల
- ఇప్పటికే రూ.12వేల కోట్లకు పైగా బిల్లులు పెండింగ్
- కేంద్ర, రాష్ట్ర నిధులన్నీ మాకే అందాలంటోన్న మాజీ సర్పంచ్ లు
- గ్రామీణాభివృద్ధి నిధులు ఇచ్చేది లేదంటోన్న కొత్త సర్పంచ్ లు



**హైదరాబాద్, మార్చి 6 (ఎఎంఎస్) :** రాష్ట్ర గ్రామ పంచాయతీల్లో కొత్త పంచాయితీలు నెలకొంటున్నాయి. పెండింగ్ బిల్లుల చెల్లింపులకు సంబంధించి పాత సర్పంచ్‌లు, కొత్త సర్పంచ్‌ల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంటోంది. తాము అప్పులు తెచ్చి డబ్బులు ఖర్చు పెట్టి గ్రామాల్లో అభివృద్ధి పను లు చేశామని.. కేంద్ర, రాష్ట్రాల నుంచి వచ్చిన నిధులను పెండింగ్ బిల్లులు చెల్లింపుల కింద ఇవ్వాలని పాత సర్పంచ్‌లు డిమాండ్ చేస్తున్నారు. పెండింగ్ బిల్లుల చెల్లింపులకే నిధులన్నీ అయితే అభివృద్ధి ఏం చేయాలంటూ కొత్త సర్పంచ్‌లు తలలు పట్టుకుంటున్నారు. కాగా దాదాపు రెండేళ్ల ఆలస్యంగా రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగాయి. జనవరిలోనే గ్రామాల్లో కొత్త పాలక వర్గాలు ఏర్పడి.. సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లతో పాలన సాగుతోంది. తెలంగాణలో గ్రామ పంచా యతీ ఎన్నికలు ఆలస్యం చేయడంతో.. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయకుండా పెండింగ్‌లో ఉంచింది. ఎన్నికలు పూర్తి అయిన తర్వాత మాత్రమే వాటిని రిలీజ్ చేస్తామని తేల్చి చెప్పింది. దీంతో ఇటీవల ఎన్నికలు పూర్తై గ్రామాల్లో కొత్త సర్పంచ్‌లు వచ్చిన తర్వాత.. దశల వారీగా 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్రం విడుదల చేస్తోంది.

మిగతా 2లో

# రాఘవ కన్‌స్ట్రక్షన్స్ పై నిరాధార ఆరోపణలు

- మంత్రి పొంగులేటి ఇమేజ్‌ను దెబ్బతీసే కుట్ర
- మానస హిల్స్‌లో ఎలాంటి బ్లాస్టింగ్‌లు జరగలేదు
- బిఆర్ఎస్ ఆరోపణలపై వివరణ



**హైదరాబాద్, మార్చి 6 (వుదయం ప్రతినిధి) :** హైదరాబాద్ జిల్లా రాజేంద్రనగర్ మండలంలోని మానస హిల్స్ లో శ్రీ పొంగులేటి ప్రసాద్ రెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ఎలాంటి అనుమతులు లేకుండా క్వారీలు నిర్వహిస్తుందని మాజీ మంత్రి హరీష్ రావు, ఇతర బిఆర్ఎస్ నాయకుల చేసిన ఆరోపణలను రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ఖండించింది. ఇందులో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాఘవ కన్స్ట్రక్షన్స్ కు ప్రత్యక్షంగా లేక పరోక్షంగా ఎలాంటి సంబంధం లేదని తేల్చి చెప్పింది. ఇది కేవలం మంత్రి వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేందుకు బిఆర్ఎస్ చేస్తున్న కుట్ర అని ఆరోపించింది. శుక్రవారం మానస హిల్స్ లోని కంపెనీ సైట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హెచ్. ఆర్ .డి. సి .ఎల్. రోడ్స్ రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ప్రాజెక్ట్ మేనేజర్ డి. గోపాల కృష్ణ, తిరుమల మెటల్ ఇండస్ట్రీస్ యజమాని కుమార రాజా మాట్లాడారు. 2022–23 లో బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే, బుద్వేల్‌లో వం ద ఎకరాల భూమిని హెచ్ఎండీఏ వేలం వేసిందన్నారు. ఈ వంద ఎకరాల భూమిలో లేఔట్ డెవలప్మెంట్ పనుల కాంట్రాక్టును హెచ్ఎండీఏ, ఎన్ సీసీ లిమిటెడ్ కంపెనీ కి అప్పగించినట్లు తెలిపారు.

మిగతా 2లో

# పన్ను బకాయిలపై కన్ను

- వసూళ్లకు ముందుగా రెడ్ నోటీసులు
- పన్ను ఎగవేతదారులపై జీహెచ్ఎంసీ కొరడా
- మొండిబకాయిల వసూళ్లపై కఠిన చర్యలు
- స్పందించకపోతే ఆస్తులు సీజ్
- జాబితా సిద్ధం చేసిన అధికారులు
- రూ. 3 కోట్లలో రూ. వెయ్యి కోట్లు బకాయిలు




**హైదరాబాద్, మార్చి 6 (ఎఎంఎస్) :** జీహెచ్ఎంసీలో పన్నులు ఎగవేతదారుల భరతం పట్టేందుకు అధికారులు సిద్ధం అయ్యారు. గత కొన్నేళ్లుగా ఆస్తి పన్ను కట్టకుండా ఉన్నవారి జాబితాను సిద్ధం చేశారు. పెండింగ్ బకాయిలను వసూలు చేసేందుకు అధికారులు నిర్దేశించుకున్న టార్గెట్ చేరుకోలేక పోవడంతో.. వాటిని పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే ఏళ్ల తరబడి ప్రాపర్టీ ట్యాక్స్‌లు చెల్లించకుండా ఉన్నవారిని గుర్తించి.. వారి ఆస్తులను సీజ్ చేయాలని నిర్ణయించుకున్న అధికారులు.. వారి వివరాలను ఉన్నతాధికారులకు వివరించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఇటీవల జీహెచ్ఎంసీతో పాటు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎన్‌సీ), సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎన్‌సీ) కార్పొరేషన్లుగా విడిపోయింది. అయితే ఈ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో నగరవాసులకు అభివృద్ధి, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు.. జీహెచ్ఎంసీ విభజన నేపథ్యంలో మూడు కార్పొరేషన్లపై రుణభారం పడకుండా రూ.4780 కోట్ల అప్పులను రాష్ట్ర ప్రభుత్వమే టేకోవర్ చేయనుంది. ఈ క్రమంలోనే జీహెచ్ఎంసీ పరిధిలో ప్రాపర్టీ ట్యాక్స్ బకాయిలు గత కొన్నేళ్లుగా భారీగా పేరుకుపోతుండటంతో.. ఖజానాకు ఆశించిన మేర వసూళ్లు రావడం లేదు.

మిగతా 2లో

### కేరళలో ప్రకటనలకు భారీగా నిధులు

## మళ్లిస్తున్న రేవంత్ ప్రభుత్వం

- పక్క రాష్ట్రాలకు రాష్ట్ర సంపద
- మలయాళ పత్రికల్లో రూ. వందల కోట్ల ప్రకటనలు
- సీఎం, డిప్యూటీ సీఎం ఫోటోలతో ఫుల్ పేజీ యాడ్స్
- మాజీ మంత్రి హరీశ్ రావు అభ్యంతరం




**హైదరాబాద్, మార్చి 6 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణలో ఉన్న సంపదను కాంగ్రెస్ ప్రభుత్వం పక్క రాష్ట్రాల ఎన్నికల ప్రచారానికి విచ్చలవిడిగా మళ్లిస్తోందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. కేరళలో జరుగుతున్న ఎన్నికల కోసం అక్కడి మలయాళ పత్రికల్లో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎంల ఫోటోలతో రూ. వందల కోట్లు ఖర్చు చేసి ఫుల్ పేజీ ప్రకటనలు ఇవ్వడాన్ని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఆరోగ్య తెలంగాణే లక్ష్యం

ఇన్ ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్

లైబ్రరీ, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్, ఈ - వ్యర్థాల సేకరణ కేంద్రం ప్రారంభం



2

## ప్రగతి ప్రణాళికతో మార్పు రావాలి




- 99 రోజుల కార్యాచరణతో సత్ఫలితాలు సాధించాలి
- రెవెన్యూ - అటవీ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- ఉమ్మడి ఖమ్మం జిల్లా సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2

# యుద్ధ ఉధృతి

**మొదటి పేజీ తరువాయి..**

వారి లక్ష్యం అయతొల్లా ఖమేనీ కోసం నిర్మించిన భూగర్భ బంకరే. ఈ బంకర్‌ను సురక్షితమైన అత్యవసర ఆస్తిగా ఇజ్రాయెల్ సైన్యం అభివర్ణించింది. ఘర్షణ సమయంలో పోరాటాన్ని ఖమేనీ ఇక్కడి నుంచి నిర్వహించడానికి ఉద్దేశించింది. ఆపరేషన్ రోరింగ్ లయన్ దాడులలో ఖమేనీ ఇప్పటికే మరణించినందున, దీనిని ఖమేనీ ఎప్పుడూ ఉపయోగించలేదు. ఆయన మరణానంతరం, ఈ ఆవరణను ఇరాన్ ప్రభుత్వంలోని ఇతర సీనియర్ అధికారులు ఉపయోగించడాన్ని కొనసాగించారు. ఇజ్రాయెలీ వైమానిక దళం ప్రకారం, ఇజ్రాయెల్, పాశ్చాత్య ప్రపంచానికి వ్యతిరేకంగా తన తీవ్రవాద, క్రూరమైన భావజాలాన్ని ప్రోత్సహించడానికి, దాని సైనిక ప్రణాళికలను ముందుకు తీసుకెళ్లడానికి ఒక స్థావరాన్ని సృష్టించే లక్ష్యంతో ప్రభుత్వం భూగర్భ స్థలాన్ని అభివృద్ధి చేయడానికి సంవత్సరాలు గడిపింది. తెహ్రాన్ నడిబొడ్డున ఉన్న మొత్తం వీధుల్లో భూగర్భ బంకర్ విస్తరించి ఉంది. సీనియర్ అధికారుల సమావేశాలకు బహుళ ప్రవేశ కేంద్రాలు, గదులు ఇందులో ఉన్నాయి, అని ఇజ్రాయెల్ వైమానిక దళం ఒక ప్రకటనలో తెలిపింది. విస్తృతమైన నిఘా సమాచారం సేకరణ, ఇజ్రాయెల్ మిలిటరీ ఇంటెలిజెన్స్ సుదీర్ఘ పరిశోధనల తర్వాత ఈ దాడి జరిగింది. ఇది ఇరాన్ పాలనకు కేంద్ర, అతి ముఖ్య ప్రధాన కార్యాలయంగా పనిచేసింది. బంకర్ విధ్వంసం, పాలన కమాండ్ , నియంత్రణ సామర్థ్యాలను మరింత దెబ్బతీసిందని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది.

ఇరాన్ సుప్రీం నాయకుడిగా మూడు దశాబ్దాలకు పైగా అధికారాన్ని చెలాయించిన అయతుల్లా అలీ ఖమేనీ యుఎస్, ఇజ్రాయెల్ దాడులలో మరణించిన విషయం తెలిసిందే. ఆయన వయసు 86. ఆయన మరణాన్ని గత ఆదివారం ఉదయం ఇరాన్ ప్రభుత్వ మీడియా ప్రకటించింది. కాగా, తమ ఉమ్మడి ఆపరేషన్‌లో ఖమేనీ మరణించాడని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. షాను పడగొట్టి షియా ముస్లిం మతాధికారుల పాలనను స్థాపించిన నాయకుడు ఆయతుల్లా రుహోల్లా ఖోమేనీ మరణం తర్వాత 1989లో ఇస్లామిక్ రిపబ్లిక్‌ను ఖమేనీ తన ఆధీనంలోకి తీసుకున్నాడు. ఖొమేనీ 1979 విప్లవానికి నాయకత్వం వహించిన ఆకర్షణీయమైన వ్యక్తి. దీనికి విరుద్ధంగా, ఖమేనీ తక్కువ ప్రాముఖ్యత కలిగిన మతపరమైన అర్హతలు కలిగిన వ్యక్తి . ఆయన విప్లవ వ్యవస్థను పనిచేసే రాష్ట్ర ఉపకరణంగా మార్చి, తన ముందు నాయకుడి కంటే ఎక్కువ కాలం పాలించాడు. అధికారంలో ఉన్న సమయంలో, అతను షియా మతాధికారుల వ్యవస్థను విస్తరించి, రెవల్యూషనరీ గార్డ్‌ను బలోపేతం చేసి, దానిని దేశంలోనే అత్యంత శక్తివంతమైన సంస్థగా మార్చారు. ఈ గార్డ్ ఒక ఉన్నత సైనిక దళంగా పనిచేసింది, బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమాన్ని నియంత్రించింది. ఇరాన్ ఆర్థిక వ్యవస్థలోని భారీ స్థాయిలో కార్యకలాపాలు నిర్వహించింది. శనివారం జరిగిన దాడిలో ఖమేనీ కుమార్తె, ఆయన అల్లుడు, మనవడు, కోడలు కూడా మరణించారని ఇరాన్ రాష్ట్ర మీడియా నివేదించింది. ప్రభుత్వం దేశవ్యాప్తంగా 40 రోజుల సంతాప దినాలు, ఏడు రోజుల ప్రభుత్వ సెలవుగా ప్రకటించింది.



**తాజా దాడులు..**

శుక్రవారం ఉదయం, ఇజ్రాయెల్ సైన్యం విస్తృత స్థాయిలో దాడులు ప్రారంభమైనట్లు ప్రకటించింది. తెహ్రాన్‌లో, కెర్మాన్‌షా సమీపంలోని క్షిపణి స్థావరాల చుట్టూ తీవ్రమైన పేలుళ్లు సంభవించాయని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు, క్షిపణి లాంచర్‌లను నాశనం చేసినట్లు ఇజ్రాయెల్ తెలిపింది. ఇందుకు ప్రతిగా ఇరాన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా, బహ్రెయిన్‌లపై క్షిపణులు, డ్రోన్‌లను ప్రయోగించింది, ఇవన్నీ అమెరికా దళాలకు ఆతిథ్యం ఇస్తున్న దేశాలు. ఆ దాడుల్లో తక్షణ ప్రాణనష్టం జరగలేదు. లెబనాన్‌లో, బీరూట్‌లోని దక్షిణ శివారు ప్రాంతాలు, ఇతర ప్రాంతాలలో ఇజ్రాయెల్ అనేక వైమానిక దాడులు నిర్వహించింది, దీని ఫలితంగా పెద్ద సంఖ్యలో ప్రజలు పారిపోయారు.

అమెరికా, ఇజ్రాయెల్ ఉమ్మడిగా దేశ వ్యాప్తంగా గల ఇరానియన్ సైనిక స్థావరాలు, నాయకత్వ లక్ష్యాలు, అణు సౌకర్యాలపై దాడులు నిర్వహించాయి. ఇరాన్ ప్రతిదాడులు అరబ్ దేశాలను ప్రభావితం చేశాయి, చమురు సరఫరాలు, ప్రపంచ విమాన ప్రయాణాన్ని దెబ్బతీశాయి. ఇరాన్‌లో కనీసం 1,230 మంది మరణించారని, లెబనాన్‌లో 120 మందికి పైగా మరణించారని, ఇజ్రాయెల్‌లో దాదాపు డజను మంది మరణించారని, ఆరుగురు యుఎస్ సైనికులు మరణించారని అధికారులు నివేదించారు. ఇరానియన్ డ్రోన్ క్యారియర్ ఐఆర్ఐఎస్ షాహిద్ బాఘేరిపై దాడి చేసినట్టు అమెరికా సైన్యం పేర్కొంది. ఆ నౌక మంటల్లో చిక్కుకుంది. ఈ నౌక డ్రోన్ల కోసం 180 మీటర్ల రన్‌వే, ఇంధనం తిరిగి నింపకుండా 22,000 నాటికల్ మైళ్ల ప్రయాణించగల కంటైనర్ షిప్.

అంతకుముందు, భారతదేశం నిర్వహించిన నావికా విన్యాసాల నుండి తిరిగి వస్తున్నప్పుడు శ్రీలంక సమీపంలో ఒక యుఎస్ జలాంతర్గామి ఒక ఇరానియన్ యుద్ధనౌకను ముంచివేసింది, దీనిలో అమెరికా కూడా పాల్గొంది. శ్రీలంక నావికాదళం 32 మంది సిబ్బందిని రక్షించింది, 87 మంది మృతదేహాలను స్వాధీనం చేసుకుంది. ఇరాన్ లోపల లోతుగా పాతిపెట్టిన బాలిస్టిక్ క్షిపణి లాంచర్లపై యుఎస్ బి–2 స్టెల్త్ బాంబర్లు డజన్ల కొద్దీ 2,000 పౌండ్ల పెనెట్రేటర్ బాంబులను జారవిడిచాయి. అల్ ఉదీద్ వైమానిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని వస్తున్న డ్రోన్‌ను ఖతార్ అడ్డుకుంది.

# సివిల్స్ విజేతలు

**మొదటి పేజీ తరువాయి..**

**సత్తా చాటిన టాప్ 20 ర్యాంకర్లు..**

అనూజ్ అగ్నిహోత్రి జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించగా రాజేశ్వరి సువే, ఆకాన్ష్ ధూల్, రాఘవ్ ఝుంఝున్వాలా, ఇషాన్ భట్నగర్, జిన్నియా అరోరా, ఏ ఆర్ రాజా మొహైదీన్, పక్షాల్ సెక్రటరీ, ఆస్తా జైన్, ఉజ్వల్ ప్రియాంక్, యశస్వి రాజ్ వర్ధన్, అక్షిత్ భరద్వాజ, అనన్య శర్మ, సురభి యాదవ్, సిమ్రన్‌దీప్ కౌర్, మోనికా శ్రీవాస్తవ, చిత్వాన్ జైన్, శృతి ఆర్, నిసార్ దిశంత్ అమృతాల్, రవి రాజ్, రాజేశ్వరి సువే, అకాన్ష్ ధుల్, రాఘవ్ ఝున్‌ఝున్‌వాలా, ఇషాన్ భట్నాగర్, జినియా అరోడా, ఏఆర్ రజా మొహియిద్దీన్, పక్షల్ సెక్రటరీ అస్థా జైన్, ఉజ్వల్ ప్రియాంక్ వరుసగా 20 ర్యాంకులు సాధించారు.

**15 రోజుల్లోగా మార్కుల జాబితా...**

కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్), ఇండియన్ ఫారిన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్), ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్) సహా పలు సర్వీసుల్లో పోస్టుల భర్తీకి యూపీఎస్సీ ఏటా సివిల్స్ పరీక్ష నిర్వహిస్తున్నది. ఈ ఎంపిక ప్రక్రియ ప్రిలిమినరీ, మెయిన్, ఇంటర్వ్యూ అనే మూడు దశల్లో జరుగుతుంది. గతేడాది సివిల్స్ నోటిఫికేషన్ విడుదల చేయగా.. మే 25న జరిగిన ప్రిలిమ్స్‌లో సత్తా చాటిన వారికి 2025 ఆగస్టు 22 నుంచి 31 వరకు మెయిన్ పరీక్ష నిర్వహించారు. మెయిన్ పరీక్షలో అసాధారణ ప్రతిభను కనబరిచిన వారికి డిసెంబర్ నుంచి 2026 ఫిబ్రవరి వరకు దశల వారీగా ఇంటర్వ్యూలను నిర్వహించి తాజాగా తుది ఫలితాలను ప్రకటించారు. ఈ పరీక్ష/నియామకాలకు సంబంధించి ఏదైనా సమాచారం లేదా స్పష్టత కోసం ఫెసిలిటేషన్ కౌంటర్ ఏర్పాటు చేశారు. పని దినాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్వయంగా వెళ్లి గానీ లేదా 23385271/23381125/23098543 నంబర్ల ద్వారా సంప్రదించవచ్చని యూపీఎస్సీ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ పరీక్షల్లో అభ్యర్థులు సాధించిన మార్కులను 15 రోజుల్లోపు తమ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని పేర్కొంది.

# కేరళలో ప్రకటనలకు భారీగా నిధులు మళ్లిస్తున్న రేవంత్ ప్రభుత్వం

**మొదటి పేజీ తరువాయి..**

"ఇంట్లో ఈగల మోత.. వీధిలో పల్లకి మోత" అన్నట్లుగా రాష్ట్రంలో ఖజానా ఖాళీ అయిందని కల్లబొల్లి మాటలు చెబుతున్న ప్రభుత్వం, పొరుగు రాష్ట్రాల్లో మాత్రం తెలంగాణ ప్రజాధనాన్ని మంచినీళ్లలా పారబోస్తోందని ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన మీడియాకు ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని మహిళలు, యువతను కాంగ్రెస్ సర్కార్ ఘోరంగా వంచించిందని విమర్శించారు. మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ. 2500, తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు వంటి హామీలు అమలు చేయకుండా ఇక్కడి ఆడబిడ్డల కంట్లో మట్టి కొట్టారని ఆరోపించారు. కానీ కేరళలో మాత్రం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేశామంటూ పచ్చి అబద్ధాలతో దొంగ ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. నిరుద్యోగులకు ఇస్తామన్న ఉద్యోగాల ఊసే లేదని, నోటిఫికేషన్ల కోసం రోడ్డెక్కిన విద్యార్థులపై అర్ధరాత్రులు లాఠీలతో విరుచుకుపడుతున్నారని ఈ సందర్భంగా హరీష్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగం, సామాజిక పింఛన్ల విషయంలోనూ ప్రభుత్వం మాట తప్పిందని హరీశ్ రావు దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో పండుగలా సాగిన రైతుబంధును ఆపేసి, రుణమాఫీ పేరుతో సగానికి పైగా రైతులను నట్టేట ముంచారని మండిపడ్డారు. రైతు భరోసా, వరికి రూ. 500 బోనస్ వంటి హామీలు గాలికొదిలేశారని విమర్శించారు. ఎన్నికల ముందు రూ. 4వేల పెన్షన్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు వృద్ధులను, వికలాంగులను విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ సంక్షేమ పథకాలకు నిధులు లేవని చెప్పే రేవంత్ రెడ్డికి, కేరళలో అబద్ధపు ప్రకటనలు ఇవ్వడానికి చేతులెలా వచ్చాయని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రజాధనం దోపిడీ కేవలం కేరళకే పరిమితం కాలేదన్నారు. మహారాష్ట్ర, ఢిల్లీ వంటి ఇతర రాష్ట్రాల ఎన్నికలకు తెలంగాణ ఖజానాను కాంగ్రెస్ పార్టీ అక్షయ పాత్రలా వాడుకుంటోందని హరీశ్ రావు ఆరోపించారు. ఇతర రాష్ట్రాల ప్రజలు కాంగ్రెస్ 'ఫేక్ పబ్లిసిటీ' ట్రాప్‌లో పడొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. తక్షణమే ఈ దొంగ ప్రచారాలను ఆపాలని, ప్రకటనల కోసం ఖర్చు చేసిన వందల కోట్ల రూపాయలను కాంగ్రెస్ పార్టీ ఖాతా నుంచే ప్రభుత్వానికి తిరిగి చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

# నిధుల పంచాయతీ

**మొదటి పేజీ తరువాయి..**

అదే సమయంలో గ్రామాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులను కేటాయిస్తోంది. ఇక్కడే ఇప్పుడు అసలు సమస్య మొదలైంది. పలు విడతల్లో కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు సుమారు రూ. 1,034 కోట్ల నిధులను ఇటీవల విడుదల చేసింది. దీంతో ఈ నిధుల వినియోగంపై కొత్త సర్పంచ్‌లు, పాత సర్పంచ్‌లకు మధ్య తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. తాము గతంలో సర్పంచ్ హోదాలో గ్రామాల్లో చేపట్టిన మౌలిక సదుపాయాలు కల్పించామని.. వైకుంఠధామాలు, డ్రైనేజీలు, క్రీడా ప్రాంగణాలు వంటి అభివృద్ధి పనులు చేసినట్లు పాత సర్పంచులు చెబుతున్నారు. ఆ పనులకు అప్పట్లో బిల్లులు రాక పోవడంతో తీసుకొచ్చిన అప్పులకు వడ్డీలు పెరుగుపోతున్నాయని పాత సర్పంచ్‌లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

**రూ.12వేల కోట్ల పెండింగ్ బిల్లులు...**

పెండింగ్‌లో ఉన్న దాదాపు రూ.1200 కోట్ల పాత బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం విడుదలైన నిధులపై తమకే హక్కు ఉంటుందని తేల్చి చెబుతున్నారు. ఇక.. కొత్త సర్పంచ్‌లు మాత్రం వాటికి ససేమిరా అనడంతో అసలు వివాదం మొదలైంది. తాము పంచాయతీ ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇచ్చి, గ్రామాలను డెవలప్ చేస్తామని ప్రజలకు మాట ఇచ్చామని.. ఇప్పటివరకు వచ్చిన నిధులు మొత్తాన్ని పాత బకాయిలకే చెల్లిస్తే.. ఇక గ్రామాల్లో అభివృద్ధి ఎలా చేయాలంటూ ప్రశ్నిస్తున్నారు. తాము అధికారంలోకి వచ్చి రాగానే.. కేంద్రం నుంచి విడుదలైన నిధులను ఇవ్వకపోతే.. ఇక గ్రామ పంచాయతీలను ఎలా నడపాలంటూ ప్రశ్నిస్తున్నారు. గ్రామాలను అభివృద్ధి చేయడం కోసం కొత్త పనులు ప్రారంభించకుండా కేవలం పెండింగ్ బకాయిలు తీర్చడానికే తాము కొత్తగా పదవుల్లోకి వచ్చామా అంటూ కొత్త సర్పంచ్‌లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**బిల్లులు మీకిస్తే పల్లె అభివృద్ధి ఎలా..?**

పెండింగ్ నిధుల్లో కేంద్రం కొంత మాత్రమే విడుదల చేయడం.. అందులో చాలా వరకు పాత బకాయిలు చెల్లించడానికే ఉపయోగించడంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, స్ట్రీట్ లైట్స్ వంటి అత్యవసర పనులు చేసేందుకు కూడా నిధులు లేకుండా పోతున్నాయని కొత్త సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని.. కేంద్రం నుంచి పెండింగ్‌లో ఉన్న మిగతా నిధులను కూడా త్వరగా విడుదల య్యేలా చూడాలని తెలంగాణ గ్రామ సర్పంచుల సంఘం విజ్ఞప్తి చేస్తోంది. నిధుల విషయంలో కొత్త, పాత సర్పంచ్‌ల విషయంలో ఈ ఉద్రిక్తత తలెత్తడంతో తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క స్పందించారు. గతంలో గ్రామాల్లో చేపట్టిన తాగునీరు, పారిశుద్ధ్య పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను.. తాజాగా విడుదలైన నిధుల నుంచి చెల్లించాలని మంత్రి సీతక్క స్పష్టం చేసింది. అదే సమయంలో పంచాయతీల్లో అందుబాటులో ఉన్న నిధుల్లో నుంచి గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు ఇవ్వాలని సూచించారు.




# పన్ను బకాయిలపై కన్ను

**మొదటి పేజీ తరువాయి..**

**లక్ష్యానికి దూరంగా వసూళ్లు..**

పాత జీహెచ్ఎంసీ పరిధిలో ఆస్తి పన్ను వసూళ్లకు అధికారులు ఏటా టార్గెట్ పెట్టుకుని మరీ వసూళ్లు చేస్తున్నా.. లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. దీంతో రూ.వందల కోట్ల బకాయిలు కొండల్లా పేరుకుపోయాయి. జీహెచ్ఎంసీకి డబ్బు తీసుకొచ్చే ప్రధాన ఆర్థిక వనరు అయిన ఆస్తి పన్ను రాకపోవడంతో.. అది అభివృద్ధిపై ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలోనే త్వరలోనే 2025–2026 ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకుంటున్న వేళ.. వీలైనన్ని ఎక్కువ బకాయిలను వసూలు చేయడంపై అధికారులు దృష్టి సారించారు. ఇందులో భాగంగానే ఏళ్లుగా ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లించకుండా భారీగా బకాయిలు పేరుకుపోయిన వారి జాబితాను రెడీ చేసి.. వారి ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు అధికారులు సిద్ధం అయ్యారు.సాధారణంగా వసూలు చేస్తున్న ఈ ఆస్తి పన్ను బకాయిల వసూళ్లతో ఈ ఆర్థిక ఏడాదిలో 3 కార్పొరేషన్లపై కలిపి ఇప్పటివరకు మొత్తంగా రూ.2 వేల కోట్లకు పైగా వసూలు అయ్యాయి. అయితే ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.3 వేల కోట్లు వసూలు చేయాలని అధికారులు పెట్టుకున్న లక్ష్యానికి ఇంకో రూ. 1000 కోట్లు మిగిలి ఉండగా.. ఆ మొత్తాన్ని మార్చి 31వ తేదీ లోపు వసూలు చేయాలని అధికారులు వ్యూహాలు సిద్ధం చేశారు. ఈ క్రమంలోనే సంవత్సరాల తరబడి ఆస్తి పన్ను ఎగవేస్తూ.. రూ.కోట్లల్లో పేరుకుపోయిన బడా వ్యాపారులు, బడా సంస్థలపై ఉక్కుపాదం మోపేందుకు జీహెచ్ఎంసీ అధికారులు సిద్ధం అయ్యారు.

**మొండి బకాయిదారుల జాబితా రెడీ...**

ఎన్నో ఏళ్లుగా ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లించకుండా తప్పించుకుంటున్న కార్పొరేట్ సంస్థలు, హోటళ్లు, రియల్ ఎస్టేట్ బిజినెస్‌మెన్‌ల లిస్ట్ రెడీ చేశారు. ఇప్పటికే నగరంలో పలు ప్రాంతాల్లో ఆస్తి పన్ను అధికంగా ఉన్న ఆస్తులను సీజ్ చేస్తున్నారు. జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ వంటి నగరంలోని అత్యంత ఖరీదైన ప్రాంతాల్లో ఉన్న ప్రముఖ కమర్షియల్ ప్రాపర్టీల ఓనర్లే ఈ ఎగవేతదారుల లిస్ట్‌లో టాప్‌లో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. హైదరాబాద్ నగరవ్యాప్తంగా కేవలం కమర్షియల్ ఆస్తుల నుంచే జీహెచ్ఎంసీకి దాదాపు రూ.1000 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయినట్లు తెలుస్తోంది.

**పన్ను ఎగవేతదారులకు రెడ్ నోటీసులు...**

ఇక ఆస్తులు సీజ్ చేసే ముందు చివరి హెచ్చరికలో భాగంగా ఆస్తి పన్ను ఎగవేతదారులకు ప్రత్యేకంగా రెడ్ నోటీసులు జారీ చేసేందుకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. ఆ నోటీసులు ఇచ్చినప్పటికీ పన్ను చెల్లించకపోతే.. జీహెచ్ఎంసీ యాక్ట్‌లోని సెక్షన్ 269 కింద వారిపై డిస్ట్రెస్ వారెంట్లు జారీ చేసి.. వారి ఆస్తులను, షాపులను సీజ్ చేయడంతో పాటు.. వాహనాలను కూడా జప్తు చేసేందుకు అధికారులు రెడీ అయ్యారు. మరోవైపు.. గత కొన్నేళ్లుగా పేరుకుపోయిన మొండి బకాయిలు చెల్లిస్తే.. వాటిని ప్రస్తుతం అమలు చేస్తున్న వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పథకం కింద చెల్లిస్తే.. వడ్డీలో సుమారు 90 శాతం మినహాయింపు కల్పించనున్నారు. ఈ వన్‌టైమ్ సెటిల్‌మెంట్ గడువు ఈ నెలాఖరుతో ముగియనుండటంతో అధికారులు దాన్ని మరింత ప్రచారం చేస్తున్నారు. ఈ నెల 31వ తేదీ లోపు బకాయిలు చేసుకోని వారికి ఏప్రిల్ 1వ తేదీ నుంచి ముందుగా పన్ను చెల్లించే వారికి ఎర్లీ బర్డ్ స్కీమ్ ద్వారా 5 శాతం రాయితీని ఇవ్వనున్నారు. అదే సమయంలో మొండి బకాయిల వసూళ్ల కోసం ఆస్తులు జప్తు చేసుకునే ప్రక్రియను కూడా కొనసాగిస్తామని జీహెచ్ఎంసీ అధికారులు హెచ్చరించారు.

## రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌పై
# నిరాధార ఆరోపణలు

**మొదటి పేజీ తరువాయి..**




ఈ లేఅవుట్ చేస్తున్నప్పుడు బయటపడ్డ రాళ్లను, కోత్వాల్‌గూడలో ఆ కంపెనీ డంప్ చేశారని చెప్పారు. అదే డంప్ మెటీరియల్‌ను ఇప్పుడు క్రషింగ్ చేస్తుంటే, కొత్తగా క్వారీలు తవ్వుతున్నారని అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ డంప్ చేసిన రాళ్లను ఎన్ సీసీ లిమిటెడ్ వారు కూడా, డీకేఆర్ అనే కంపెనీ ద్వారా క్రషింగ్ చేసి హెచ్ఎండీఏ బుద్వేల్ ప్రాజెక్ట్ లో రోడ్ పనులకు వినియోగిస్తున్నారని చెప్పారు. అదే విధానంలో అదే డంప్ చేసిన రాళ్లను తిరుమల మెటల్ ఇండస్ట్రీ క్రష్ చేయగా ఆ మెటీరియల్ ను రాఘవ కన్‌స్ట్రక్షన్స్ తమ రోడ్డు పనుల కోసం కొనుగోలు చేసిందన్నారు. గత కొన్నేళ్ల నుంచి న్ని సంవత్సరాల నుండి ఈ ప్రదేశం లో ఎటువంటి బ్లాస్టింగ్ జరగలేదనీ, అలాగే ఎటువంటి మైనింగ్ జరగలేదని వివరణ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత, ఈ ప్రాంతంలో ఒక్క కొత్త క్వారీకి అనుమతి ఇవ్వలేదన్నారు. వృధాగా పడి ఉన్న రాళ్లను మాత్రమే క్రషింగ్ చేస్తున్నట్లు చెప్పారు. అది కూడా తిరుమల మెటల్ ఇండస్ట్రీస్ ద్వారానే చేస్తున్నామన్నారు. అంతే తప్ప ఇందులో రాఘవ కన్స్ట్రక్షన్ కి ఎలాంటి సంబంధం లేదన్నారు. రోడ్డు పనులకు సంబంధించి రాఘవ కన్స్ట్రక్షన్ కు హెదరాబాద్ రోడ్డు డెవలప్ మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చెల్లించే బిల్లుల్లో, అన్ని ప్రభుత్వ విధి విధానాలను అనుసరిస్తూ ప్రభుత్వం నిర్ణయించిన రాయల్టీని రికవరీ చేస్తామన్నారు. అన్నీ పారదర్శకంగా జరుగుతుంటే 'దొంగతనం' అనడం విడ్డూరంగా ఉందన్నారు. వట్టినాగులపల్లి, కోకాపేట, అనేక ప్రాంతాల్లో ఇదే విధానం లో అనేక క్రషర్లు బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నుండి చుట్టూ పక్కల సెల్లారు తవ్వకాలలో వచ్చిన రాళ్లను వినియోగించుకుంటున్నారని వివరించారు. ఆధారాలు లేకుండా తమ కంపెనీ యొక్క ఇమేజ్‌ను దెబ్బతీసేలా మాట్లాడితే, న్యాయపరమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# ప్రగతి ప్రణాళికతో మార్పు రావాలి

## రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ఖమ్మం, మార్చి 6 (వుదయం ప్రతినిధి) :** ప్రజలకు మేలైన పాలన అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల ప్రత్యేక కార్యాచరణను విజయవంతం చేయాలని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా ఇన్–ఛార్జ్ మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.... క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని దిశా నిర్దేశం చేశారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో గతంలో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణాల్లో చోటుచేసుకున్న లోపాలపై మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. కొన్ని ప్రాంతాల్లో సరైన లెవల్స్ లేకపోవడంతో మురుగునీరు నిలిచిపోయి ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ విభాగం అధికారులు ప్రత్యేకంగా సమావేశమై, ఎక్కడైతే నీరు ఆగుతుందో ఆ ప్రాంతాలను గుర్తించి తక్షణమే సరిచేయాలని ఆదేశించారు. అవసరమైతే లోపభూయిష్టమైన నిర్మాణాలను తొలగించి, కొత్తగా నిర్మించాలని సూచించారు. ఏ అధికారి హయాంలో ఈ పొరపాట్లు జరిగాయో రికార్డుల్లో నమోదు చేసి, వారిని బాధ్యులను చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్లకు స్పష్టం చేశారు.

**అటవీ - రెవెన్యూ సరిహద్దు వివాదాలకు ముగింపు..**

ఉమ్మడి జిల్లాలో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న అటవీ, రెవెన్యూ భూముల వివాదాలను పరిష్కరించేందుకు ఈ 99 రోజుల ప్రణాళికను వేదికగా చేసుకోవాలని మంత్రి సూచించారు. కొత్తగూడెం, సత్తుపల్లి, ఇల్లెందు, వైరా వంటి నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉందని, దీనివల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. కలెక్టర్లు, డి.ఎఫ్.ఓలు మరియు రెవెన్యూ యంత్రాంగం ఉమ్మడిగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, సరిహద్దులను ఖరారు చేయాలన్నారు. ఈ ప్రక్రియలో ఎక్కడా జాప్యం జరగకుండా నూటికి నూరు శాతం పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు.

**ప్రజాప్రతినిధులకు ప్రత్యేక శిక్షణ.. నిధుల వినియోగం..**

కొత్తగా ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లు, మేయర్లు మరియు చైర్మన్లకు పాలనాపరమైన అంశాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు ఈ నెల 12న ఉమ్మడి జిల్లా స్థాయిలో ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మంత్రి ప్రకటించారు. అనుభవజ్ఞులైన అధికారులతో ఈ శిక్షణ ఇప్పించడం ద్వారా, గ్రామాల్లో నిధుల వినియోగంపై వారికి స్పష్టత వస్తుందన్నారు. ముఖ్యంగా గత రెండేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న పంచాయతీ నిధులు ఇప్పుడు విడుదలవుతున్నాయని, వాటిని గ్రామాభివృద్ధికి పారదర్శక పద్ధతిలో ఖర్చు చేసేలా విలేజ్ సెక్రటరీలతో కలిసి పని చేయాలని సూచించారు.

**సాగు పద్ధతుల్లో మార్పు.. రైతుల్లో చైతన్యం..**

వ్యవసాయ రంగంలో రైతులు విచక్షణారహితంగా వాడుతున్న ఎరువులు, పురుగుమందుల ప్రభావం భూసారంపై పడుతోందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతి రైతుకూ భూసార పరీక్షలు, పంట మార్పిడి విధానంపై అవగాహన కల్పించాలన్నారు. అధికారులే నేరుగా రైతుల వద్దకు వెళ్లి ఆధునిక సాంకేతికతను వివరించాలని, అవసరమైతే ఇతర ప్రాంతాల్లోని ఆదర్శ సాగు పద్ధతులను పరిశీలించేందుకు ప్రభుత్వ ఖర్చుతో రైతులకు క్షేత్ర పర్యటనలు ఏర్పాటు చేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు.

**పార్టీలకు అతీతంగా ప్రజా సేవ..**

ఎన్నికల సమయంలో రాజకీయాలు ఉన్నా, గెలిచిన తర్వాత ప్రజాప్రతినిధులందరూ ప్రజల కోసమే పని చేయాలని మంత్రి ఉద్బోధించారు. ఈ అభివృద్ధి ప్రణాళికలో అధికార, ప్రతిపక్ష పార్టీలనే భేదం లేకుండా అందరినీ భాగస్వాములను చేయాలన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో అధికారులు మరింత శ్రద్ధ వహించి ప్రభుత్వ ఆలోచనలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్లు, చైర్మన్లు పాల్గొన్నారు.

## ప్రజలకు భరోసా కల్పించడమే
# ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- విశ్వాసం నమ్మకానికి కేరాఫ్ రేవంత్ రెడ్డి సర్కార్
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**కరీంనగర్ మార్చి 6 (వుదయం ప్రతినిధి) :** ప్రభుత్వం ఒకవైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమ కార్యక్రమాలు అందించడం ద్వారా ప్రజలకు భరోసా కల్పిస్తున్నదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రజలకు నమ్మకాన్ని విశ్వాసాన్ని కల్పించడంలో ప్రభుత్వం సక్సెస్ సాధిస్తున్నదని తెలిపారు. రాష్ట్రంలో ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరాటంకం గా కొనసాగిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం ద్వారా ప్రభుత్వం ప్రజల మెప్పు పొందుతున్నదని చెప్పారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకం ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం చేపడుతున్నదని ఇందులో అందరూ పాల్గొనాలని కోరారు. రెండున్నర సంవత్సరాల కాలంలోనే ప్రభుత్వ అనేక విజయాల సొంతం చేసుకున్నదని పేర్కొన్నారు. విద్యా విధానంలో వి నూతన మార్పులు సంక్షేమ రంగంలో సత్ఫలితాలు సాధించడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. 99 రోజులపాటు ప్రజల వద్దకే పాలన చేపట్టడం వల్ల ప్రజలకు నమ్మకము విశ్వాసము భరోసా మరింత పెరుగుతుందని ఇందుకోసమే ప్రభుత్వం కష్టపడి పని చేస్తున్నదని ప్రభుత్వ విప్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రజలంతా స్వచ్ఛందంగా ఈ కార్యక్రమాన్ని అద్భుతంగా విజయవంతం చేసే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు.

# రూ.20 కోట్లు విడుదల చేయండి

## చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మంత్రులకు విజ్ఞప్తి

**కరీంనగర్ మార్చి 6 (వుదయం ప్రతినిధి) :**

నారాయణపూర్ రిజర్వాయర్ ప్రాజెక్టు పనులు పూర్తి చేసేందుకు మంత్రులు ప్రత్యేక చొరవ చూపాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం విజ్ఞప్తి చేశారు. నారాయణపూర్ రిజర్వాయర్ కుడి ఎడమ కాలువ పనులు పూర్తి చేయాలని ఇందుకోసం రూ.20 కోట్లు విడుదల చేయాలని కోరారు. గతంలో 23 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. మెట్ట ప్రాంత రైతంగం సాగునీటి బాధలు తీర్చేందుకు ఈ పనులు పూర్తి చేయాలన్నారు. ఈ ప్రాంత రైతాంగానికి ఎంతో మేలు కలుగుతుందన్నారు. అదేవిధంగా కరీంనగర్ టు జగిత్యాల నేషనల్ హైవే రోడ్డు పనులు త్వరగా ప్రారంభించాలని కోరారు. అందుకు సంబంధించిన భూసేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు.

చొప్పదండిలో సెంట్రల్ లైటింగ్ వర్క్ పనులు నడకన సాగుతున్నాయని వేగవంతం చేయాలని కోరారు. అదేవిధంగా కొండగట్టు అభివృద్ధికి నిధులు బడ్జెట్లో కేటాయించాలని సాగునీటి ఇబ్బందులు తీర్చేందుకు కృషి చేయాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి కి ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు.

# ఆరోగ్య తెలంగాణే లక్ష్యం

## రాష్ట్ర రవాణా, హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, మార్చి 6 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోగ్య తెలంగాణ, ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని రాష్ట్ర రవాణా, హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శుక్రవారం హైదరాబాద్ జిల్లా మసాబ్ ట్యాంక్ లోని చాచా నెహ్రూ పార్క్ లో పలు అభివృద్ధి కార్యక్రమాలను రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బలమూరి వెంకట్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్ లతో కలసి నూతన లైబ్రరీ, ఇందిరా అమ్మాయిల శక్తి క్యాంటీన్, అలాగే ఈ వ్యర్థాల సేకరణ కేంద్రాలను మంత్రి ప్రారంభించారు. ఇందులో భాగంగా మహిళా సంఘాలకు రూ. 35 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కును అందించారు. మహిళా సంఘాల సభ్యులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 12 వేల గ్రామాల్లో, వార్డుల్లో ,మున్సిపాలిటీల్లో ప్రజా పాలన..ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో కొనసాగుతుందని అన్నారు. మన ఇళ్లలో ఉండే పాత టీవీ లు ,పాత ఫ్రిడ్జిలు , కంప్యూటర్ ,ల్యాప్ టాప్ లు పాడైపోయిన వాటిని అక్కడే ఉంచడంతో ఎలాంటి ఉపయోగం ఉండదన్న పొన్నం.. ఆ వస్తువులను ఈ .. వ్యర్థాల సేకరణ సెంటర్ కి తెచ్చి రీసైక్లింగ్ అందించాలని సూచించారు. ఇక్కడ 15 వందల చదరపు గజాల స్థలంలో ఏర్పాటు చేసుకున్న లైబ్రరీ స్థానిక ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందనీ పుస్తకాలు డొనేట్ చేయడానికి ప్రత్యేక సెంటర్ ఏర్పాటు పొలాల్లో చేయటం అభినందనీయం అన్నారు. పట్టణంలో మహిళా సంఘాల సభ్యుల సంఖ్య తక్కువ ఉందని.. ప్రతి మహిళలు ఎక్కువగా సంఘంలో చేరాలని సూచించారు. మహిళల సంక్షేమానికి ఎన్ని కార్యక్రమాలు చేపట్టిందని, ఉచిత బస్సు ప్రయాణం ఒక చరిత్ర సృష్టించిందన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్,సన్న బియ్యం,రేషన్ కార్డులు మహిళల పేరు మీద ఇస్తున్నామనీ మంత్రి సందర్భంగా గుర్తు చేశారు. ఐకేపీ,మహిళా సంఘాల తరుపున బస్సులు ఆర్టీసీ లో నడుస్తున్నాయన్నారు. బస్సులకు మహిళలను యజమానులను చేశామన్నారు. ప్రభుత్వం ఇస్తున్న వడ్డీ లేని రుణాలు పొంది ఉపాధి అవకాశాలు పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో మహిళలు కీలక పాత్ర పోషిస్తూ చురుకుగా పాల్గొనాలని అన్నారు. విద్యా ,వైద్యం ,పర్యావరణ పరిరక్షణ , పరిసరాల పరి శుభ్రత ఇలా అన్ని స్థానిక ప్రజలు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు చేపట్టనున్న కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు.





# జాతీయం-అంతర్జాతీయం



## యుద్ధ మేఘాల నడుమ పరిమితంగా విమానాలు

**న్యూఢిల్లీ, మార్చి 6 (ఉదయం) :**



ఇజ్రాయెల్, అమెరికా ఇరాన్‌ల మధ్య నడుస్తున్న సంఘర్షణ కారణంగా పశ్చిమాసియాకు వేలాది విమానాల రాకపోకలను వారం రోజుల నుంచి నిలిపివేసిన విషయం తెలిసిందే. ఇరాన్‌పై దాడి, దాని ప్రతిదాడుల కారణంగా పశ్చిమాసియాలో పలుదేశాలు తమ గగనతలాలు మూసివేసే పరిస్థితి ఏర్పడింది. దీనితో విమాన షెడ్యూళ్లను, ఎత్తిహాద్ ఎయిర్, ఇమిరేట్స్ తదితర సంస్థలకు చెందిన పలు విమానాల కదలికలను ప్రభావితం చేసింది. అనేక విమానాలను రద్దు చేయగా, తమ గమ్యాలను చేరుకునేందుకు ఇతరులు సుదీర్ఘమార్గాలను తీసుకోవలసి వచ్చింది. అనేక విమానాల రద్దు, మార్గాల మళ్లింపుల కారణంగా విమానాశ్రయంలో గందరగోళాలకు దారితీయడమే కాకుండా, వేలాది ప్రయాణికులను నిలిచిపోయేలా చేసింది.

సంక్షోభం ప్రారంభమైన ఫిబ్రవరి 28 నుంచి, పశ్చిమాసియా దేశాలకు వచ్చి, వెళ్లే మొత్తం 28వేల విమానాలు రద్దు అయ్యాయి. ఇక్కడి నుంచి దాదాపు 51,600 విమానాలు ఇక్కడ నుంచి కార్యకలాపాలు సాగించవలసి ఉందని బ్లూమ్‌బెర్గ్ పేర్కొంది. మార్చి 6 నాటికి ఇందులో సగం రద్దు అయిపోయాయి. వేలాదిమంది గల్ఫ్ దేశాలలో నిలిచిపోయారు. వారు పరిస్థితి యధాతథ పరిస్థితికి తిరిగివచ్చే వరకూ వేచి ఉండటం లేదా సుదీర్ఘ, ఖరీదైన మార్గాలను ఎంచుకోవలసి వస్తోంది. ఇప్పుడు మంచి వార్త వినిపిస్తోంది, ఎందుకంటే గల్ఫ్ విమానాలు పరిమిత సేవలను పునరుద్ధరిస్తున్నాయి. ఈ ప్రాంతంలో గగనతల పరిమితులను పాక్షికంగా సడలించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. మార్చి 6వ తేదీన ఎత్తిహాద్ ఎయిర్‌వేస్ అబూధాబీ నుంచి పరిమిత విమానాన్ని ప్రారంభించినట్టు పత్రికలు తెలిపాయి. ఎంపిక చేసిన మార్గాలలో ఈ వైమానిక సంస్థ మార్చి 19వరకు కొన్ని విమానాలను నిర్వహిస్తోంది.

ఎత్తిహాద్ ఎయిర్‌వేస్ విమానాలు అబూధాబి నుంచి బయలుదేరి, ఆసియా, నార్త్ అమెరికా, యూరోప్‌కు వెడతాయి. ఢిల్లీ, ముంబై, బెంగళూరు, లండన్, పారిస్, ఫ్రాంక్‌ఫర్ట్, న్యూయార్క్ టొరంటో, బాంగ్‌కాక్ ల నుంచి వచ్చే విమానాలు దీనికి కనెక్ట్ అవుతాయి.

ఈ సంక్షోభం ప్రారంభం అయినప్పటి నుంచీ ఎమిరేట్స్ దాదాపు 2000 విమానాను రద్దు చేసింది. అది కూడా గగనతల పరిమితులు స్వల్పంగా సరళం కావడంతో ఎంపిక చేసిన గమ్యాలకు పరిమిత సేవలను ప్రారంభించనుంది. ఫ్లై దుబాయ్ మార్చి 6 నుంచి పరిమిత సేవలను ప్రారంభించారు.

గగనతల మూసివేతల నడుమ మరొక ముఖ్యమైన గమ్యం ఒమన్. మస్కట్, సలాహ్, సొలార్ ఇంకా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. తమ విమానాల మార్గాన్ని మళ్లించేందుకు వైమానిక సంస్థలు ఈ విమానాశ్రయాలను ఉపయోగిస్తున్నాయి.

**ఈ సంక్షభంలో భారత్ విమానాల పరిస్థితి ఏమిటి?**

భారత విమానయాన పరిశ్రమ కూడా పశ్చిమాసియా సంక్షోభానికి గురికాకుండా లేదు. దాదాపు 281విమానాలు రద్దు అయినట్టు పౌర విమానాయాన మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

అయితే, భారతీయ వైమానిక సంస్థలు అనేక అదనపు విమానాలను ప్రారంభించింది. ఈ సంక్లిష్ట సమయంలో ప్రయాణీకుల కదలికను నిర్వహించేందుకు ఈ చర్య చేపట్టింది. ఇండిగో సంస్థ ఏథెన్స్, మస్కట్, జెద్దా, మదీనాకు విమానాలు ప్రారంభించింది. వారు యుఎఇలో నిలిచిపోయిన ప్రయాణీకులను వెనక్కి తీసుకువచ్చేందుకు సహాయక విమానాలను నడుపుతున్నారు. మార్చి 5 నుంచి మార్చి 7 మధ్యలో యుఎఇ నుంచి 20 ప్రత్యేక విమానాలను స్పైస్‌జెట్ షెడ్యూల్ చేసింది. ఈ విమానాలు ఫుజైరా, దుబాయ్ నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తూ, ఢిల్లీ లేదా ముంబైకి రానున్నాయి. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ఎయిర్ ఇండియా అదనపు విమానాలను నడుపనుంది. మార్చి 5 నుంచి మార్చి 11 మధ్యలో వారు ఢిల్లీ, టొరొంటో మధ్యలో మూడు అదనపు విమానాలను నడుపనుంది. అలాగే, మార్చి 7 నుంచి మార్చి 10 మధ్యన ఢిల్లీ ఫ్రాంక్‌ఫర్ట్ మధ్య మూడు విమానాలు, ఢిల్లీ పారిస్ మధ్య ఒక విమానాన్ని నడుపనుంది.

## షిప్పింగ్ కంపెనీలతో ప్రభుత్వ చర్చలు



**న్యూఢిల్లీ, మార్చి 6 (ఉదయం):**

పశ్చిమాసియా ప్రాంతంలో ఇరాన్‌పై యుఎస్ ఇజ్రాయెల్ దాడి చేయడంతో చెలరేగిన యుద్ధం నేపథ్యంలో ఆ ప్రాంతంలో చిక్కుకుపోయిన సరుకులను విడిపించేందుకు ప్రభుత్వం షిప్పింగ్ కంపెనీలతో చర్చలు జరుపుతోందని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ శుక్రవారం తెలిపారు. మేం షిప్పింగ్ మంత్రిత్వ శాఖతో, అన్ని షిప్పింగ్ కంపెనీలతో కూడా చర్చలు జరుపుతున్నామని, ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని నేను ఆశిస్తున్నానని మంత్రి అన్నారు. పశ్చిమ ఆసియాలో భారత జాతీయ జెండా ఉన్న నౌకలను తిరిగి తీసుకురావడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల గురించి ఇది తొలి ప్రకటన. ముడి చమురు, ఎల్ఎన్‌జిని మోసుకెళ్తున్నదాదాపు 38 భారత్ విగా గుర్తించిన నౌకలు పెర్షియన్ గల్ఫ్‌లో దాపు 1,100 మంది నావికులతో సహా చిక్కుకున్నాయని సమాచారం. ఒమన్ పోర్ట్‌పై చేసిన దాడి సందర్భంగా ముగ్గురు భారతీయ నావికులు మరణించారు. శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో వాణిజ్య మంత్రి మాట్లాడుతూ, ఈ విషయంపై షిప్పింగ్ మంత్రిత్వ శాఖ, ప్రభావిత కంపెనీలతో చర్చలు జరుపుతున్నట్లు చెప్పారు.

ఎగుమతిదారులపై బీమా ఖర్చు, కార్గో షిప్‌మెంట్‌ల వంటి భారాన్ని తగ్గించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన అన్నారు.

ఎగమతిదారులతో అంతర్‌మంత్రిత్వ బృందంతో ప్రతిరోజూ మాట్లాడుతుంది. ఈ ఉదయం కూడా, వారితో చర్చ జరిగి ఉండాలి. వారు అభిప్రాయాన్ని తీసుకుంటారు. మా ఎగుమతిదారులకు ఏ విధంగానూ మద్దతు ఇవ్వడంలో మేం విఫలం కాము. వస్తువులు లేదా సేవలలో అయినా, మా కొనుగోలుదారులకు మేము చేసిన అన్ని హామీలను నెరవేర్చాలి, అని గోయల్ అన్నారు. భారతీయ ఎగుమతిదారులు ఎదుర్కొంటున్న భారాన్ని తగ్గించడానికి కొన్ని అధికారిక చర్యలను మంత్రి సూచించారు. యుద్ధం ప్రారంభమైన తర్వాత వ్యూహాత్మక హొర్మూజ్ జలసంధి ఓడలు ప్రయాణించడానికి లేకుండా స్తంభించింది. దాని ద్వారా వెళ్లే షిప్‌మెంట్లను విధ్వంసం చేస్తామని ఇరాన్ హెచ్చరించింది. ఆసియా ప్రాంతంలోని దేశాలు ఇంధన సరఫరాలను పొందే మార్గాలను అన్వేషిస్తున్నాయి. చైనా తన నౌకలను తరలించడానికి ఇరాన్‌తో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం, అయితే అమెరికా 30 రోజుల మారటోరియం మంజూరు చేసిన తర్వాత భారతదేశం రష్యా చమురు సరఫరాలకు తిరిగి వెళ్లనుంది.

## స్పీకర్ తొలగింపు పై చర్చ
## ఎంపీలకు విప్ జారీ

**న్యూఢిల్లీ, మార్చి 6 (ఉదయం):**



త్వరలో జరుగనున్న బడ్జెట్ రెండవ విడత సమావేశాల సందర్భంగా మార్చి 9, 10వ తేదీలలో పార్లమెంటులోనే ఉండాలని ఆదేశిస్తూ, లోక్‌సభ ఎంపీలందరికీ అధికార భారతీయ జనతా పార్టీ విప్ జారీ చేసింది. లోక్‌సభ స్పీకర్‌గా ఓం బిర్లాను తొలగించాలన్న నోటీసును సభలో చర్చ కోసం చేపట్టవచ్చన్న సూచనల నడుమ ఈ ఆదేశాలు జారీ అయ్యాయి. ఎంపీలకు చేసిన సూచనలలో, అనేక "చాలా ముఖ్యమైన శాసనసభ వ్యవహారాలు" చేపడతారని భావిస్తున్నట్లు బిజెపి తెలిపింది. లోక్‌సభలోని బిజెపి సభ్యులందరూ రెండు రోజులూ సభలో తప్పనిసరిగా హాజరు కావాలని, ప్రభుత్వ వైఖరికి మద్దతు ఇవ్వాలని కోరుతున్నామని పార్టీ తన ఆదేశంలో పేర్కొంది. ఇలా ఉండగా, ప్రతిపక్ష ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ కూడా తన లోక్‌సభ ఎంపీలకు మార్చి 9 నుండి మార్చి 11 వరకు సభలోనే ఉండాలని కోరుతూ మూడు లైన్ల విప్ జారీ చేసింది.

**రెండవ విడత బడ్జెట్ సమావేశాల ప్రారంభం**

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల రెండవ విడత మార్చి 9న ప్రారంభమై ఏప్రిల్ 2 వరకు కొనసాగనుంది. రాజకీయ పార్టీలు తమ ఎంపీల గరిష్ట హాజరును నిర్ధారించడానికి ముఖ్యమైన చర్చలు లేదా ఓటింగ్ ముందు విప్‌లను తరచుగా జారీ చేస్తాయి. కీలకమైన శాసనసభ చర్చలు, ముఖ్యమైన బిల్లుల ఆమోదం సమయంలో ఎంపీలు హాజరయ్యేలా నిర్ధారించడానికి ఇటువంటి సూచనలు నిత్యం ఉపయోగిస్తారు.

**ఓం బిర్లాపై తీర్మానం ఎందుకు ప్రవేశపెట్టారు?**

స్పీకర్ పదవి నుంచి ఓం బిర్లాను తొలగించాలని కోరుతూ ప్రతిపక్షాలు గత నెలలో సమర్పించిన అవిశ్వాస నోటీసు తర్వాత ఈ పరిణామాలు చోటు చేసుకున్నాయి. 118 మంది ఎంపీలు సంతకం చేసిన ఈ నోటీసులో, సభకు అధ్యక్షత వహిస్తున్నప్పుడు ఆయన పక్షపాత వైఖరితో వ్యవహరించారని ఆరోపించారు. బడ్జెట్ సమావేశాల రెండవ విడత కోసం పార్లమెంటు తిరిగి సమావేశమైన తర్వాత ఇది చర్చకు వస్తుందని భావిస్తున్నారు. పార్లమెంటరీ నిబంధనల ప్రకారం, తీర్మానంపై చర్చ జరిగి నిర్ణయం తీసుకునే వరకు బిర్లా లోక్‌సభ కార్యకలాపాలకు అధ్యక్షత వహించే అవకాశం కనిపంచడం లేదు. వాస్తవానికి, ఫిబ్రవరిలో నోటీసు సమర్పించిన రోజు నుంచి ఆయన సభ కార్యకలాపాలకు అధ్యక్షత వహించడం మానేశారు.

సమావేశాలు తిరిగి ప్రారంభమైనప్పుడు ఆయన సభలో ఇతర ఎంపీలతో పాటు కూర్చుంటారని వార్తలు చెబుతున్నాయి. స్థిరపడిన విధానాల ప్రకారం, తీర్మానంపై చర్చ జరిగినప్పుడు బిర్లాకు తనను తాను సమర్థించుకునే అవకాశం కూడా ఇస్తారు.

**తుపాను వంటి మొదటి విడత తర్వాత ఉద్రిక్తతలు**

బడ్జెట్ సమావేశాల మొదటి దశలో లోక్‌సభలో పదే పదే అంతరాయం ఏర్పడింది. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని సభలో మాట్లాడకుండా స్పీకర్ అడ్డుకున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలను సస్పెండ్ చేసిన తర్వాత పరిస్థితి మరింత దిగజారి, ప్రభుత్వానికి, ప్రతిపక్షానికి మధ్య ప్రతిష్టంభన తీవ్రమైంది.

ప్రతిపక్షం ఈ తీర్మానాన్ని తీసుకురావాలనే నిర్ణయాన్ని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైరాం రమేష్ సమర్థించారు, అది ప్రజాస్వామ్య నిబంధనలకు లోబడి ఉందని అన్నారు. ఇవి ప్రజాస్వామ్య సాధనాలు, పార్లమెంటరీ ప్రజాస్వామ్య సాధనాలు. ప్రతిపక్షానికి అన్ని హక్కులు ఉన్నాయి. మనం చర్చ నిర్వహిస్తాం, ఆ తర్వాత ఏమి జరుగుతుందో చూద్దాం" అని ఆయన అన్నారు.

## లెబనాన్, బీరూట్‌పై ఇజ్రాయెల్ దాడులు

**ఉదయం డెస్క్, మార్చి 6 :**



నగర దక్షిణ శివారు ప్రాంతాల నుంచి లక్షలాది మంది ప్రజలను ఖాళీ చేయమని ఆదేశించిన అనంతరం బీరూట్, లెబనాన్‌లపై ఇజ్రాయెల్ దాడులు చేసింది. అయితే, ఈ ఘటనలో ఎవరూ మరణించినట్టు తక్షణ వార్తలు లేవు. లెబనాన్ వ్యాప్తంగా హిజ్బుల్లాను లక్ష్యంగా చేసుకున్నట్లు ఇజ్రాయెల్ సైన్యం చెబుతోంది. బీరుట్ దక్షిణ ప్రాంతం ఇరాన్ మద్దతు గల సాయుధ దళాలకి పెట్టని కోట.

బీరూట్ దక్షిణ శివారు ప్రాంతాలలో హిజ్బుల్లా ఉగ్రవాద మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని డిఫెన్స్ ఆర్మీ వైమానిక దాడులను ప్రారంభించిందని ఇజ్రాయెల్ రక్షణ దళాల (ఐడిఎఫ్) ప్రతినిధి ఎక్స్‌లో తెలిపారు. ఆ ప్రాంతాలను ఖాళీ చేయాలన్న ఆదేశాలను అనుసరించి, ఉత్తరం, దక్షిణం వైపు వెళ్లే ప్రధాన రహదారులపై ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడ్డాయి. భయాందోళనకు గురైన నివాసితులు ముందెన్నడూ లేనివిధంగా ఆ ప్రాంతాన్ని మూకుమ్మడిగా ఖాళీ చేసి వచ్చేశారు. తాజా దాడులకు ముందు, సోమవారం నుంచి జరిగిన వైమానిక దాడుల్లో 120 మందికి పైగా మరణించారని, దాదాపు 700 మంది గాయపడ్డారని లెబనాన్ తెలిపింది. కనీసం 90,000 మంది నిరాశ్రయులయ్యారు. ఇజ్రాయెల్ సరిహద్దుకు సమీపంలో ఉన్న దక్షిణ లెబనాన్‌లోని విస్తారమైన ప్రాంతంలోని నివాసితులందరూ బుధవారం నాడు ఖాళీ చేయాలని సైన్యం చెప్పిన తర్వాత ఇజ్రాయెల్ ఈ ఆదేశం జారీ చేసింది. ఈ నేపథ్యంలో అక్కడి భూమిని ఆక్రమించుకునే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా, లెబనాన్ సరిహద్దుకు 5 కి.మీ. దూరంలో నివసిస్తున్న ఇజ్రాయెల్ ప్రజలు తమ ఇళ్లను వదిలి వెళ్లిపోవాలని హిజ్బుల్లా హెచ్చరించింది. కాగా, రాజధానిలోని ఆహారశాలలు, ఆశ్రయాలు నిర్వాసిత వ్యక్తుల సంఖ్యను భరించలేమని హెచ్చరించాయి. దక్షిణ శివారు ప్రాంతాల నుండి కొన్ని నిర్వాసితులైన కుటుంబాలు సెంట్రల్ బీరుట్‌లోని మార్టియర్స్ స్క్వేర్‌కు బయలుదేరాయి. గత నాలుగు రోజులుగా ఇజ్రాయెల్ దాడుల్లో కనీసం 102 మంది మరణించారని లెబనీస్ అధికారులు తెలిపారు. ఇజ్రాయెల్ అధికారుల నుండి ఎటువంటి మరణాలు సంభవించలేదని నివేదికలు ఉన్నాయి.

ఇరాన్ సుప్రీం నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ హత్యకు ప్రతీకారంగా సోమవారం సరిహద్దు మీదుగా రాకెట్లు, డ్రోన్లను ప్రయోగించినప్పటి నుండి, బీరుట్ దక్షిణ శివారు ప్రాంతాలు, దక్షిణ లెబనాన్, తూర్పు బెకా లోయలోని హిజ్బుల్లాను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ విమానాలు వరుస దాడులు చేశాయి. ఇజ్రాయెల్, హిజ్బుల్లా మధ్య ఒక సంవత్సరం కంటే ఎక్కువ కాలంగా జరిగిన పూర్తి స్థాయి పోరాటం కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిన 15 నెలల తర్వాత, ఇది లెబనాన్‌ను ఇజ్రాయెల్, యుఎస్, ఇరాన్ మధ్య యుద్ధంలోకి లాగింది. బుధవారం, హిజ్బుల్లా నాయకుడు నయీమ్ ఖాసిమ్ షియా మిలీషియా, రాజకీయ పార్టీ ఇజ్రాయెల్ ఎదుర్కొంటామే తప్ప, లొంగిపోయే ప్రసక్తిలేదని స్పష్టం చేశాడు. హిజ్బుల్లా ముప్పును నిర్మూలించడానికి తాము దృఢంగా కట్టుబడి ఉన్నామని, ఉగ్రవాద సంస్థను నిరాయుధీకరించే వరకు ఆగబోమని ఇజ్రాయెల్ సైనిక చీఫ్ ఆఫ్ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఇయాల్ జమీర్ ప్రకటించిన ఒక రోజు తర్వాత ఈ పోరాటం చోటు చేసుకుంది.

## బేషరతుగా లొంగిపోవాల్సిందే

### ఇరాన్‌పై ట్రంప్



**ఉదయం డెస్క్, మార్చి 6:**

ఇరాన్‌తో చర్చల ప్రసక్తే లేదని, టెహ్రాన్ లొంగిపోవడానికి తక్కువగా దేనినీ యునైటెడ్ స్టేట్స్ అంగీకరించదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పష్టంగా ప్రకటించారు. ఫిబ్రవరి 28న దాడుల ప్రారంభించిన తర్వాత, అమెరికా యుద్ధ లక్ష్యాలతో రాజీపడని బహిరంగ ప్రకటన ఇది. దీనితో ఇటీవలి కాలంలో అనేక దేశాలు నిశబ్దంగా ప్రయత్నిస్తున్న దౌత్యపరమైన చర్యలకు ఈ ప్రకటన ద్వారాలను మూసివేసింది.

అనేక దేశాలు మధ్యవర్తిత్వ చర్యలను ప్రారంభించాయని శుక్రవారం ఉదయం ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ అంగీకరించారు. ఇందులోటెహ్రాన్ ప్రతిస్పందన స్పష్టంగా ఉందని అన్నారు. ఇరానియన్ ప్రజలను తక్కువగా అంచనా వేసి దాడులు ప్రారంభించిన వారే ఈ మధ్యవర్తిత్వానికి లక్ష్యంగా ఉండాలని అన్నారు. బేషరతుగా లొంగిపోవాలన్న ట్రంప్ డిమాండ్ వల్ల ఆ మధ్యవర్తిత్వ ప్రయత్నాలు కొనసాగడం చాలా క్లిష్టం కానుంది.

## మమత మూడు రోజుల ధర్నా



**కోల్‌కత, మార్చి 6 (ఉదయం):**

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శుక్రవారం కోల్‌కతాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐఆర్) వ్యాయామంలో ఓటర్ల జాబితా నుండి ఓటర్లను తొలగించారని ఆరోపిస్తూ మూడు రోజుల ధర్నా నిరసనను ప్రారంభించారు. నిజమైన ఓటర్లను జాబితా నుంచి తొలిగించేందుకు భారతీయ జనతా పార్టీ, ఎన్నికల కమిషన్ కలిసి పని చేశాయని ఆమె ఆరోపించారు.

శుక్రవారం మధ్యాహ్నం సెంట్రల్ కోల్‌కతలో మమత తన నిరసనను ప్రారంభించారు. గత ఏడాది సవరణ ప్రక్రియ ప్రారంభమైన తర్వాత వోటర్ల తొలగింపును సవాలు చేయడమే ఈ నిరసన లక్ష్యం. బెంగాలీ ఓటర్లకు ఓటు హక్కు లేకుండా చేయడానికి బిజెపిఇసి పన్నిన కుట్రను తాను బయటపెడతానని ఆమె నిరసన ప్రారంభంలో అన్నారు.

ఓటర్ల జాబితా నుంచి తప్పుగా పేర్లు తొలిగించినవారిని నిరసనకు తీసుకువస్తానని ఆమె అన్నారు. మరణించారని ఎన్నికల కమిషన్ చెబుతున్న ఆ ఓటర్లను ఇక్కడ హాజరుపరుస్తానని ఆమె అన్నారు.

**సర్ అనంతరం జాబితా నుంచి వోటర్ల తొలగింపు**

ఫిబ్రవరి 28న ప్రకటించిన అధికారిక లెక్కల ప్రకారం, గత ఏడాది సర్ ప్రారంభమైనప్పటి నుంచి దాదాపు 63.66 లక్షల పేర్లను వోటర్ల జాబితా నుంచి తొలిగించారు. ఇది మొత్తం వోటర్లలో 8.3 శాతం. రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 7.66 కోట్ల నుంచి 7.04కు పడిపోయినట్టు డాటా చూపుతోంది. దాదాపు 60.06 లక్షల ఓటర్లను విచారణలో ఉన్నట్టుగా అధికారులు పేర్కొన్నారు. అంటే, రానున్నవారాల్లో చట్ట ప్రక్రియ ద్వారా వారి అర్హతను అధికారులు సమీక్షిస్తారు. రాష్ట్రంలో వివిధ నియోజకవర్గాల వ్యాప్తంగా ఓటర్ల సంఖ్యలను దీని అంతిమ ఫలితం మార్చనుంది.

**రాజకీయ దురుద్దేశంతోనే ఈ చర్య- టిఎంసి ఆరోపణ**

ఈ నిరసన కార్యక్రమాన్ని తృణమూల్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ ఇంతకు ముందే ప్రకటించారు. ఎన్నికల కమిషన్ రాజకీయంగా నడిచే కసరత్తును నిర్వహిస్తోందని, దీని ద్వారా లక్షలాది మంది చట్టబద్ధమైన ఓటర్లను జాబితా నుండి తొలగించవచ్చని ఆయన ఆరోపించారు.

సవరణ ప్రక్రియ ఓటర్లలో ఆందోళనలను రేకెత్తించిందని, భవిష్యత్ ఎన్నికలకు ముందు తమ పేర్లు ఓటర్ల జాబితా నుండి అదృశ్యమవుతాయని వారు భయపడుతున్నారని పార్టీ ఆరోపించింది.

**నిరుద్యోగంపై మమతపై దాడి చేసిన బీజేపీ**

ఆమె కీలకమైన పాలనా సమస్యలను తప్పించుకుంటున్నారని ఆరోపిస్తూ, మమతా బెనర్జీ నిరసనను బిజెపి విమర్శించింది. ముఖ్యమంత్రి నిరసనలు నిర్వహించడం కంటే నిరుద్యోగాన్ని పరిష్కరించడంపై దృష్టి పెట్టాలని బిజెపి నాయకుడు అమిత్ మాలవీయ అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో 18-40 ఏళ్ల మధ్య వయసు వారిలో దాదాపు 85 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వంలోని అధికారుల సమాచారం. అంటే, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పాలనలో నిరుద్యోగం 13%గా ఉంది, ఇది జాతీయ సగటు కంటే చాలా ఎక్కువ. దీనికి పూర్తిగా మమతా బెనర్జీ కారణం. గత 15 సంవత్సరాలుగా పశ్చిమ బెంగాల్ ఎదుర్కొంటున్న దుష్పరిపాలన ఫలితం. ముఖ్యమంత్రి ధర్నాలకు కూర్చోవడానికి బదులుగా, తనను ఎందుకు ఎన్నిక చేసుకున్నారో, ఆ హామీలను సాకారం చేయడంపై దృష్టి సారించి ఉంటే, పరిస్థితులు ఇంత దారుణంగా ఉండేవి కావు. కానీ ఇప్పుడు చాలా ఆలస్యం అయింది, అని ఆయన ఎక్స్‌పై చేసిన పోస్ట్‌లో పేర్కొన్నారు.

## భారత్ చైనా సరిహద్దుల్లో దావానలం

**డెహ్రాడూన్, మార్చి 6 (ఉదయం):**



భారత్ చైనా సరిహద్దులకుసమీపంలో ముఖ్యమైన సరిహద్దు గ్రామమైన మలారీలో అడవులలో అగ్ని రాజుకుంది. భుజ్‌గఢ్ డ్రెయిన్‌ఎగువన ఉన్న పౌర ప్రాంతంలో రాజుకున్న అగ్ని త్వరత్వరగా బీడు భూముల వ్యాప్తంగా వ్యాపించింది. సమీపంలో గల సైనిక స్థావరం సమీపానికి అగ్ని కీలలు చేరకుండా దానిని ఆర్పివేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. నందా దేవి నేషనల్ పార్క్ రేంజర్ గౌరవ్ నేగీ మాట్లాడుతూ, మలారీ గ్రామం ఎగువ ప్రాంతంలో అగ్ని ప్రమాదం జరిగినట్టు వార్తలు వచ్చాయని తెలిపారు. అగ్ని మరింతగా వ్యాపించకుండా తక్షణ చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. అటవీ ఇనస్పెక్టర్ కుల్దీప్ నేగీ నేతృత్వంలో ఐదుగురు సభ్యుల బృందం మంటలను ఆర్పడంలో చురుగ్గా పాల్గొంటున్నారని ఆమె తెలిపారు.

**ఒకవైపు అగ్నిని నియంత్రించడంలో బృందం సఫలమైంది**

ఒకవైపు అగ్నిని నియంత్రించడంలో బృందం సఫలమైంది. అయితే, దీనివల్ల పాక్షిక ఊరట మాత్రమే లభిస్తోంది. పూర్తి రక్షణను కల్పించేందుకు మిగిలిన మంటలను కూడా ఆర్పివేయడంపై దృష్టి పెట్టారు. సమీపంలో గల సైనిక శిబిరంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. వారికి ముప్పు కలుగకుండా నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారు.

**సున్నితమైన సరిహద్దు ప్రాంతంలో ఉన్నగ్రామం**

సున్నితమైన సరిహద్దు ప్రాంతంలో ఉన్న మలారీ గ్రామానికి వ్యూహాత్మక ప్రాముఖ్యత ఉన్నది. ఈ ఘటన స్థానికులు, అధికారులలో కూడా ఆందోళనలను లేవనెత్తింది. కాగా, అటవీ శాఖ, స్థానిక పాలన అధికారులు సమన్వయంతో పని చేసి పరిస్థితిని నియంత్రణలోకి తేవడంలో సఫలమయ్యారు.

భుజ్‌గఢ్ డ్రెయిన్ ఎగువ ప్రాంతంలోని పౌర మైదానాలలో అగ్ని ప్రమాదం సంభవించిందని అధికారులు ఖరారు చేశారు. స్థానిక బృందాలతో కలిసి అటవీ శాఖ, మంటలను అర్పేందుకు నిరంతరం ప్రయత్నం చేస్తోంది. పౌరులను, సైనిక శిబిరాన్ని రెండింటినీ కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు పాలనాధికారులు తెలిపారు. నందాదేవి నేషనల్ పార్క్ అధికారులు పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తోంది. మంటలు మరింతగా వ్యాపించకుండా నిరంతర పర్యవేక్షణ, అగ్నిమాపక యత్నాలు కొనసాగుతున్నాయి.

**సరిహద్దు ప్రాంతాల్లో దావానలలు సవాళ్లతో కూడుకున్నవి**

సరిహద్దు ప్రాంతాల్లో దావానలాలను అడ్డుకోవడం సవాళ్లతో కూడుకున్నది. ముఖ్యంగా క్లిష్టమైన భూభాగం, సున్నితమైన సంస్థాపనలను పరిరక్షించడం క్లిష్టమైన పని. స్థానిక బృందాలు, భద్రతా దళాల మధ్య సమన్వయం, తక్షణ ప్రతిస్పందన ప్రాముఖ్యతను ఈ ఘటన పట్టి చూపుతుంది. కాగా, మలారీ భూముల్లోని కొన్ని భాగాల్లో అగ్నిని నియంత్రించగా, మొత్తాన్ని ఆర్పివేసేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. పరిస్థితి నియంత్రణలోనే ఉందని, ప్రజలు ప్రశాంతంగా ఉండాలని పాలనాధికారులు తెలిపారు.

## ఇరాన్ నిఘా సంస్థకు తోడ్పడుతున్నారనే అనుమానంతో లండన్‌లో నలుగురి అరెస్టు

**ఉదయం డెస్క్, మార్చి 6 :**



ఇరాన్‌కు సంబంధించి తీవ్రవాద వ్యతిరేక దర్యాప్తులో భాగంగా నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఒక విదేశీ నిఘా సంస్థకు సహాయమందిస్తున్నారన్న అనుమానంతో, ఒక ఇరానియన్‌ను, బ్రిటన్, ఇరాన్ ద్వంద్వ పౌరసత్వం గల ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. లండన్‌లో ప్రదేశాలు, యూదు సమాజానికి చెందిన వ్యక్తులపై నిఘా వేస్తున్నారన్న అనుమానాలతో చేస్తున్న దర్యాప్తులో భాగంగా ఈ అరెస్టులు చేశారు. సుదీర్ఘకాలంగా సాగుతున్న దర్యాప్తులో భాగంగా ఈ అరెస్టులు జరిగాయని లండన్‌లోని ఉగ్రవాద వ్యతిరేక పోలీసింగ్ అధిపతి అయిన కమాండర్ హెలెన్ ఫ్లానగన్ తెలిపారు. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో యూదు సమాజానికి చెందినవారు ఆందోళన చెందుతుండవచ్చని, వారిని అప్రమత్తంగా ఉండాలని ఎప్పటిలానేకోరుతున్నానని, తమకు సంబంధించి ఏమైనా వార్తలు వింటే మమ్మల్ని సంప్రదించమని చెప్పామని ఆమె అన్నారు. ఈ వార్త వెలువడిన అనంతరం, ప్రపంచవ్యాప్తంగా తీవ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న అతి పెద్ద దేశం ఇరాన్ అని, మన సమాజంలో కూడా అది ఉండడం విచారకరమని డిప్యూటీ ప్రధాన మంత్రి డేవిడ్ లామీ అన్నారు. మా నిఘా వర్గాలు, ఉగ్రవాద నిరోధక పోలీసులు గత కొన్ని సంవత్సరాలుగా చాలా చర్యలను తిప్పికొట్టారని ఆయన అన్నారు. భద్రతా దళాలు, పోలీసుల పనిని కూడా ఆయన ప్రశంసించారు.

బ్రిటన్ లోని యూదు సమాజాన్ని రక్షించడానికి, యూదు వ్యతిరేకత నివేదికలను పర్యవేక్షించే స్వచ్ఛంద సంస్థ కమ్యూనిటీ సెక్యూరిటీ ట్రస్ట్ ఒక ప్రకటనలో పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది. యూదు సమాజం వ్యాప్తంగా భద్రత బలంగా ఉంది అని ఆయన వివరించారు.

నలుగురు వ్యక్తులను అరెస్టు చేసిన అనంతరం, వాటఫోర్డ్, బార్నెట్, వెంబ్లేలో సోదాలు జరుగుతున్నాయి. నలుగురు వ్యక్తులను జాతీయ భద్రతా చట్టం కింద నిర్బంధంలోకి తీసుకున్నారు. ఈ చట్టాన్ని 2023లో నిఘా చట్టాలను తిప్పికొట్టే పద్ధతులను ఆధునికం చేయడమే కాక, విదేశీ జోక్యాన్ని నివారించేందుకు ప్రవేశపెట్టారు. ఇరాన్‌పై యుఎస్ఇజ్రాయెల్ దాడులు చేపట్టిన తర్వాత, ఆ ప్రాంతంలోని తమ భాగస్వాములపై ఇరాన్ ప్రతిదాడులను ప్రధాని సర్ కీర్ స్టార్మర్ ఖండించారు. కేవలం గత ఏడాదిలోనే, వారు యుకె భూభాగంపై 20 దాడులు చేపట్టారు.

కాగా, ఒక నేరగాడికి తోడ్పడుతున్నారన్న అనుమానంతో హారోలో మరో ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. మొత్తం పదిమంది కూడా పోలీసు కస్టడీలో ఉన్నారు.






“ రెండు దశాబ్దాల పాటు ముఖ్యమంత్రిగా బీహార్ కు సారధ్యం వహించిన తరువాత నేను రాజ్యసభకు వెళ్లబోతున్నాను. పార్లమెంట్ ఉభయ సభల సభ్యుడిగా పనిచేయాలని అలాగే బీహార్ రాష్ట్ర ఉభయ శాసన సభలలోను సభ్యుడిగా ఉండాలని కోరుకున్నాను. ఇప్పుడ నేను రాజ్యసభ సభ్యత్వాన్ని స్వీకరించగానే ఆ కల పూర్తిగా నెరవేరబోతుంది. గత రెండు దశాబ్దాలుగా మీరు నాకు పటిష్టమైన మద్దతును ఇచ్చారు. నన్ను విశ్వసించారు. ఆ బలంతోనే నేను బీహార్ రాష్ట్రానికి, మీకు పూర్తి అంకితభావంతో సేవ చేశాను. నా యెడల మీరు ఉంచిన విశ్వాసం, మీ మద్దతు కారణంగానే బీహార్ ఈ రోజునా అభివృద్ధిని, గౌరవాన్ని చూరగొంటున్నది. ఇందుకు గతంలో చాలాసార్లు నా కృతజ్ఞలను మీకు తెలియజేసుకున్నాను. మీతో నాకుగల గాఢమైన బంధం కొనసాగుతుంది. అభివృద్ధి చెందిన బీహార్ ను నిర్మించడంలో మీతోపాటు పనిచేయాలన్న నా నిర్ణయం ఎటువంటి అవరోధం లేకుండా కొనసాగుతుంది. బీహార్ లో కొత్త ప్రభుత్వానికి నా పూర్తి మద్దతు మార్గదర్శకత్వం ఉంటాయి. ”

* నితీశ్ కుమార్

## వే'మన'పద్యం

చిత్తశుద్ధి గలిగి చేసిన పుణ్యంబు
కొంచెమైన నదియు కొదువకాదు
విత్తనంబు మర్రివృక్షంబునకు నెంత
విశ్వదాభిరామ! వినురవేమ



## సంపాదకీయం

# విలక్షణ నితీష్ కుమార్

నితీష్ కుమార్ ను బీహార్ ను విడదీసి చూడలేనంతగా ఆయన రెండు దశాబ్దాలపాటు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పదవిని నిర్వహించారు. అందులో ఎన్నో మెరుపులు, మలుపులు.ఒకవైపు రాజకీయాల్లో సామాజిక విప్లవకారుడుగా రాణించడం , మరోవైపు బీహార్ లో బిజెపి స్వారీకి అనువైన అశ్వంగా ఉపయోగపడడం నితీష్ కుమార్ అనే నాణేనికి రెండు పార్శ్వాలు.బి సి ల అభ్యున్నతి, సామాజిక న్యాయం లక్ష్యాల సాధన కోసం లాలూ ప్రసాద్ యాదవ్ తో కొంతకాలం కలిసి నడిచిన నితీష్ కుమార్ ఆయన నుంచి విడిపోయిన తర్వాత ప్రజా క్షేత్రంలో తనకొక ప్రత్యేక స్థానాన్ని, బలమైన అనుచర వర్గాన్ని ఏర్పాటు చేసుకోవడానికి చేపట్టిన ప్రయోగం విజయవంతమై బీహార్ లో ఆయనను తీసి పక్కన పెట్టలేని అనుల్లంఘనీయ నాయకుడుగా చేసింది.వెనుకబడిన వర్గాలనుంచి అత్యంత వెనుకబడిన తరగతులను వేరుచేసి అలాగే మహాదళితులు, పాస్మాండ ముస్లింలను కలుపుకొని తనకొక పటిష్ఠమైన ఓటు బ్యాంక్ ను సృష్టించుకోగలిగారు.అయితే సిద్ధాంతపరమైన నిబద్ధత లేకుండా కొంతకాలం ఆర్ జె డి తో, మరికొంతకాలం బిజెపి తో కలిసి అధికారాన్ని కాపాడుకోగలగడం నితీష్ చాకచక్యానికి నిదర్శనం.నరేంద్ర మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనకు నితిషకుమార్ కు మధ్య పచ్చి గడ్డి భగ్గుమనేది.తన అనుమతి లేకుండా మోడితో కలిపి తన ఫోటో వేసిన బిజెపి ప్రచార ప్రకటన పట్ల తీవ్ర ఆగ్రహం చెందిన నితీష్ కుమార్ గుజరాత్ నుంచి అందిన రూ 5 కోట్ల వరద సహాయాన్ని తిప్పి పంపించి వేశారు. మోడీ ని ఎన్ డి ఎ ప్రధాని అభ్యర్ధి గా ఎంచుకున్నందుకు నిరసన వ్యక్తం చేశారు. బిజెపి తో తెగతెంపులు చేసుకున్నారు. ఆ తర్వాత బిజెపి తో కలిసి ప్రభుత్వాలను నెలకొల్పి బీహార్ లో అది అనూహ్యంగా పెరగడానికి తోడ్పాడ్డారు. మండల్ రాజకీయాల ప్రభావంతో బీహార్ లో స్వతంత్రంగా ఎదిగే అవకాశాలను కోల్పోయిన బిజెపి నితీష్ భుజం మీద కూర్చొని ఆయనకు చెందిన జె డి యు ని మించి బలాన్ని సంపాదించుకోగలిగింది.ఇప్పుడు ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకొని నితీష్ రాజ్యసభ బాట పట్టడానికి శాసనసభలో ఆయన పార్టీ మైనారిటీకి పడిపోవడమూ ఒక కారణమని అంగీకరించక తప్పదు.ముఖ్యమంత్రి గా నితీష్ మహిళల అభ్యున్నతికి గణనీయమైన కృషి చేశారు.2016 లో మద్యనిషేధాన్ని విధించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 36 శాతం కోటా కల్పించారు.బాలికలకు ఉచిత సైకిల్ పథకం విద్యారంగం లో మహిళల పురోగతికి తోడ్పడింది. ముఖ్యమంత్రి పీఠం నుంచి వైదొలగుతున్న నితీష్ దేశ చరిత్రలో విలక్షణమైన బి సి ముఖ్యమంత్రిగా నిలిచిపోతారు.


## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020


# నిప్పుల కొలిమిలో ప్రపంచ శాంతి!

ప్రపంచ చరిత్ర గమనాన్ని మార్చేసే సంఘటనలు కొన్ని దశాబ్దాలకోసారి జరుగుతుంటాయి. కానీ, 2026 ఫిబ్రవరి 28న చోటు చేసుకున్న పరిణామాలు కేవలం చరిత్రను మార్చడమే కాదు, రేపటి ప్రపంచం ఎలా ఉండబోతోందనే భయాన్ని రేకెత్తిస్తున్నాయి. అమెరికా మరియు ఇజ్రాయెల్ దేశాలు సంయుక్తంగా ఇరాన్‌పై జరిపిన మెరుపు దాడులు, ఆపై ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ హత్యకు గురవ్వడం,ఇవన్నీ ఆధునిక ప్రపంచం ఊహించని ఒక భయంకరమైన యుద్ధానికి నాంది పలికాయి. ఈ దాడులు కేవలం సరిహద్దు తగాదాలు కావు,ఇవి ఒక ప్రాంతపు అస్థిత్వాన్ని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పునాదులను కదిలిస్తున్న పెను తుఫానులు. సైనిక పరిభాషలో చెప్పాలంటే, ఇది అత్యంత వ్యూహాత్మకమైన మరియు విధ్వంసకరమైన ఆపరేషన్. ఇజ్రాయెల్ దీనిని ఆపరేషన్ రోరింగ్ లయన్ అని, అమెరికా ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ అని పిలుచుకున్నాయి. తెహ్రాన్ మొదలుకొని ఇస్ఫహాన్ వరకు, క్వోమ్ నుంచి కెర్మాన్షా వరకు ఇరాన్‌లోని ప్రధాన నగరాలన్నీ క్షిపణుల మోతతో దద్దరిల్లాయి. కేవలం సైనిక స్థావరాలనే కాకుండా, ఇరాన్ గర్వకారణంగా భావించే అణు కేంద్రాలను మరియు అత్యున్నత నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకోవడం ద్వారా అమెరికా-ఇజ్రాయెల్ కూటమి ఇరాన్ నడ్డి విరిచే ప్రయత్నం చేసింది. అయతొల్లా అలీ ఖమేనీ మరణంపై ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ స్పందిస్తూ, ప్రపంచంలోని అత్యంత దుష్ట విలన్ల చేతుల మీదుగా జరిగిన హత్య ఇది అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం ఒక వ్యక్తిపై జరిగిన దాడి కాదు, ఒక జాతిపై, ముఖ్యంగా షియా ముస్లింల ఆత్మగౌరవంపై జరిగిన యుద్ధ ప్రకటనగా ఇరాన్ భావిస్తోంది. దాడి జరిగిన వెంటనే ఇరాన్ మౌనంగా ఉండిపోలేదు. ఆపరేషన్ ట్రూ ప్రామిస్ IV పేరుతో పర్షియన్ గల్ఫ్ ప్రాంతాన్ని అగ్నిగుండంగా మార్చేసింది. వందలాది డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులు జోర్డాన్, కువైట్, బహ్రెయిన్, ఖతార్ మరియు సౌదీ అరేబియాలోని అమెరికా సైనిక స్థావరాల వైపు దూసుకెళ్లాయి. యుద్ధం కేవలం ఇరాన్ సరిహద్దులకే పరిమితం కాకుండా, దుబాయ్ మరియు కువైట్‌లోని పౌర విమానాశ్రయాలు, హోటళ్ల వరకు పాకింది. సముద్ర గర్భంలోనూ యుద్ధం మొదలైంది,ఇండియన్ ఓషన్‌లో ఇరానియన్ ఫ్రిగేట్ IRIS దేనా మునిగిపోవడం ఇరు దేశాల మధ్య ఉన్న ద్వేషాన్ని మరింత పెంచింది. యుద్ధం అంటే కేవలం రాజకీయ గెలుపోటములు కావు, అమాయకుల రక్తం. ఇరానియన్ రెడ్ క్రెసెంట్ లెక్కల ప్రకారం, ఈ దాడుల్లో ఇప్పటికే 200 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ముఖ్యంగా దక్షిణ ఇరాన్‌లోని ఒక బాలికల ప్రాథమిక పాఠశాలపై జరిగిన వైమానిక దాడిలో 85 మంది చిన్నారులు మరణించడం మానవత్వాన్ని సిగ్గుతో తలదించుకునేలా చేసింది. అటు ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌లో జరిగిన క్షిపణి దాడిలో ఒక మహిళ మరణించగా, కువైట్‌లో ఆరుగురు అమెరికా సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ మరణాల సంఖ్య గంట గంటకూ పెరుగుతూనే ఉంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ సైనిక చర్య నాలుగు నుంచి ఐదు వారాల్లో ముగుస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు వేరుగా ఉన్నాయి. బ్రూకింగ్స్ ఇన్‌స్టిట్యూషన్ నిపుణులు హెచ్చరిస్తున్నట్లుగా, వైట్ హౌస్ ఆశించిన దానికంటే ఇరాన్ బలమైన ప్రతిఘటనను చూపుతోంది. ఇరాన్ ఇంటెలిజెన్స్ వర్గాలు చర్చలకు సిద్ధమనే సంకేతాలు పంపినట్లు వార్తలు వస్తున్నా, వాషింగ్టన్ మాత్రం ప్రస్తుతానికి నిష్క్రమణ మార్గాలు (Exit routes) ఏవీ లేవని కుండబద్దలు కొట్టినట్లు చెబుతోంది. ఇక ఇరాన్ సైనిక కమాండర్లు కూడా మా లక్ష్యాలు నెరవేరే వరకు విశ్రమించం అని ప్రతిజ్ఞ చేస్తున్నారు. రాయిటర్స్ సర్వే ప్రకారం, అమెరికా ప్రజల్లో కేవలం 25 శాతం మంది మాత్రమే ఈ యుద్ధానికి మద్దతు తెలుపుతున్నారు. వాషింగ్టన్ వీధుల్లో యుద్ధ వ్యతిరేక నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. దూరంగా జరుగుతున్న ఈ యుద్ధం భారతదేశాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది? సమాధానం చాలా భయంకరంగా ఉంది. భౌగోళికంగా మధ్యప్రాచ్యం భారత్‌కు దూరంగా ఉన్నప్పటికీ, ఆర్థికంగా మనం ఆ ప్రాంతంతో విడదీయలేని బంధాన్ని కలిగి ఉన్నాం.



ప్రపంచ చమురు సరఫరాలో 20 శాతం వాటా ఉన్న స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్ మూసివేత భారత్‌కు పెద్ద దెబ్బ. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధరలు ఒక్కసారిగా 10-13 శాతం పెరిగి బారెల్‌కు \$82 మార్కును దాటాయి. భారత్ తన చమురు అవసరాల్లో 85 శాతం దిగుమతుల పైనే ఆధారపడుతుంది. చమురు ధరలో ప్రతి \$10 పెరుగుదల వల్ల మన దేశ దిగుమతి బిల్లు సుమారు \$13-14 బిలియన్లు పెరుగుతుంది. ఇది దేశ ఆర్థిక పురోగతికి పెద్ద ఆటంకం. భారత్ నుండి యూరప్ లేదా అమెరికా వెళ్లే విమానాలు ఇరాన్, అరేబియా గగనతలం గుండానే ప్రయాణించాలి. యుద్ధం కారణంగా ఈ మార్గాలు మూతపడటంతో విమానాలను దారి మళ్లించాల్సి వస్తోంది. దీనివల్ల ఇంధన ఖర్చు పెరిగి, విమాన టిక్కెట్ల ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరుతున్నాయి. ఇండిగో, ఎయిర్ ఇండియా వంటి సంస్థలు ఇప్పటికే భారీ నష్టాలను చవిచూస్తున్నాయి. మధ్యప్రాచ్యంలో సుమారు 9 మిలియన్ల మంది భారతీయులు నివసిస్తున్నారు. వారు మన దేశానికి పంపే రెమిటెన్స్ (Remittances) మన విదేశీ మారక ద్రవ్య నిల్వల్లో 38 శాతం వాటా కలిగి ఉన్నాయి. యుద్ధం కారణంగా అక్కడ చమురు, నిర్మాణం, ఆతిథ్య రంగాల్లో ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. ఇది లక్షలాది భారతీయ కుటుంబాల జీవనాధారాన్ని దెబ్బతీస్తుంది. చమురు ధరలు పెరిగితే రవాణా ఖర్చులు పెరుగుతాయి, ఫలితంగా నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతాయి. అంతేకాకుండా, గల్ఫ్ దేశాలకు మనం ఎగుమతి చేసే ఇంజనీరింగ్ వస్తువులు, వస్త్రాలు, రసాయనాలపై రవాణా మరియు బీమా ఖర్చులు పెరగడంతో మన ఎగుమతిదారులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోతున్నారు. పరిస్థితిని గమనిస్తున్న భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ (CCS) సమావేశంలో చమురు నిల్వలు మరియు భారతీయ పౌరుల భద్రతపై కీలక చర్చలు జరిగాయి. ప్రస్తుతం భారత్ వద్ద 74 రోజులకు సరిపడా చమురు నిల్వలు ఉన్నాయి. రష్యన్ చమురు కొనుగోలుకు అమెరికా 30 రోజుల తాత్కాలిక మినహాయింపు ఇవ్వడం కొంత ఊరటనిచ్చే అంశం. మధ్యప్రాచ్యంలో రగులుతున్న ఈ మంటలు కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కావు. ఇది ఒక అంతర్జాతీయ సంక్షోభం. భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఈ యుద్ధం ఒక అగ్ని పరీక్ష. శక్తి వనరుల కోసం ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కోవాల్సిన సమయం ఆసన్నమైంది. వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను పెంచుకోవడం మరియు దౌత్యపరంగా శాంతి ప్రయత్నాలకు మద్దతు ఇవ్వడం ద్వారా మాత్రమే మనం ఈ సంక్షోభం నుండి గట్టెక్కగలం. యుద్ధం ఏ సమస్యకైనా పరిష్కారం కాదు, అది కేవలం కొత్త సమస్యలను సృష్టిస్తుంది. మానవత్వం గెలవాలంటే తుపాకుల మోత ఆగి, చర్చల గొంతు వినిపించాలి.




డా .సూర్యదేవర రామకృష్ణ
9490754169


## అమెరికాను శారెత్తిస్తున్న
# ఇరాన్ షహీద్ డ్రోన్లు

మధ్య ప్రాచ్యం దాడులు ప్రతిదాడులతో అట్టుడికి పోతున్నది. యుద్ధం ఆరవ రోజుకి వచ్చినా, దేశ నాయకులలో దానిని ఆపివేద్దామనే భావన కనిపించడం లేదు. ఈ క్రమంలో అమెరికా వద్ద ఆయుధాలు అయిపోతున్నాయనే వార్తలు వినవస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమ వద్ద ఎంతకాలమైనా తరిగిపోని ఆయుధాలు ఉన్నాయని ప్రకటించినా, ఇరాన్ చవుకగా తయారు చేసిన షాహిద్ డ్రోన్ల ముందు అవి వెలవెలబోతున్నాయి. ఇరాన్ చవుకగా తయారు చేసిన షాహిద్ డ్రోన్లు ఆధునిక యుద్ధాన్ని మలుస్తున్నాయి. ఈ డ్రోన్ల విజయం అన్నది అత్యాధునిక సాంకేతికతలో లేదు, సరళమైన గణితంలో ఉంది. ఇదే అమెరికా, దాని మిత్రదేశాల రక్షణ వ్యవస్థలను ఇబ్బంది పెడుతోంది. సుమారు 20వేల డాలర్ల విలువైన ఇరానియన్ డ్రోన్ ను కూలగొట్టడానికి అమెరికా మిలయన్ డాలర్ల విలువైన ఇంటర్సెప్టర్లను ఉపయోగించవలసి వస్తోంది. ఈ అసమతుల్యతే ఇరాన్వ్యూహానికి కేంద్రంగా మారినట్టు కనిపిస్తోంది. ఇజ్రాయెల్, దాని మిత్రదేశాలతో యుద్ధంలో ఇరాన్ షహీద్ డ్రోన్లపై భారీగా ఆధారపడింది. షాహీద్ డ్రోన్లు ఖరీదైన అమెరికన్ క్షిపణి రక్షణల నుంచి తప్పించుకుంటున్నాయి. అలా అని అవి సాంకేతికంగా అంత ఉన్నతమైనవి కాదు. అవి చవకైనవి అధిక సంఖ్యలో వాటిని ఇట్టే ప్రయోగించవచ్చు. ఒక డ్రోన్ల రీదు 20 నుంచి 50 వేల డార్ల వరకూ ఉండగా, పాట్రియాట్ వంటి వ్యవస్థల ఖరీదు అనేక మిలియన్ డాలర్లు ఉంటుంది. నలు దిక్కుల నుంచి చవకైన కమికాజె డ్రోన్లను ప్రయోగించడం వల్ల, అమెరికా, ఇజ్రాయెల్ నెట్‌వర్క్‌లు వాటి ని అన్నిదిక్కుల నుంచీ జాడపట్టి నిర్వీర్యం చేయవలసి ఉంటుంది. దీనితో పరిమితంగా ఉన్నవారి నిల్వలు ఖర్చైపోతున్నాయి. దీని ఫలితంగా ఆయుధాల అసమతుల్యత ఏర్పడుతోంది. సరళమైన సాంకేతికతతో రూపొందించిన ఈ డ్రోన్లకు షహీద్ అని పేరు పెట్టారు. పెర్షియన్‌లో దాని అర్థం సాక్షి అని. వీటిని ఇరాన్‌కు చెందిన షాహిద్ ఏవియేషన్ ఇండస్ట్రీస్ 2000 దశాబ్దం మొదట్లో అభివృద్ధి చేసింది. ఇందులో షాహిద్ -136 దీర్ఘ శ్రేణి ఉంది. ఇది 2వేల నుంచి 2,500 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించగలదు. డ్రోన్లు చిన్నవి, ప్రయోగించడం తేలిక. వాటిని ట్రక్కులపై ఎక్కించిన మొబైల్ రాక్ను౦ చి ప్రయోగించవచ్చు. సామర్థ్యం కన్నా వేగానికి ఈ నమూనా ప్రాముఖ్యత ఇచ్చింది. ఎక్కువ ఇంధనం లేకుండా సుదూరాలకు అవి వెళ్లగలవు. షాహిద్ డ్రోన్లు లాయిటరింగ్ మ్యునిషన్స్ అంటే గాలిలో తిరిగే మందుగుండు సామాగ్రిలా పని చేస్తాయన్న మాట. అవి నిఘా తర్వాత స్థావరానికి తిరిగి రావడానికి బదులుగా, మోసుకెళ్లిన పేలుడు పదార్థాలతో లక్ష్యంపై దాడి చేసి, తమను తాము నాశనం చేసుకుంటాయి. ఈ డ్రోన్ ప్రభావం సంతృప్త సూత్రంలో ఉంది. ఇరాన్ ఒకేసారి చాలా డ్రోన్‌లను ప్రయోగిస్తుంది, దాని ప్రత్యర్థుల వాయు రక్షణ వ్యవస్థలు భారీ సంఖ్యలో వచ్చే మానవరహిత వైమానిక వాహనాలను (యుఏవి) ఎదుర్కోవలసి వస్తుంది. వందలాది షాహిద్‌లు ఒకేసారి సమీపించినప్పుడు అత్యంత అధునాతన క్షిపణి కవచాలు కూడా కష్టమైన గణనను ఎదుర్కొంటాయి. అధిక అంతరాయ రేట్లు సాధ్యమే, కానీ అవి గణనీయమైన ఆర్థిక వ్యయంతో కూడుకున్నవి. పేట్రియాట్ ఇంటర్‌సెప్టర్ ధర దాదాపు 4 మిలియన్ డాలర్లు ఉంటుంది. 20,000 డాలర్ల విలువైన డ్రోన్‌ను కాల్చివేసేందుకు దానిని ఉపయోగించడం అంటే దాడి చేస్తున్న ఆయుధం కంటే చాలా ఎక్కువ ఖర్చు చేయవలసి వస్తుంది. ఇటీవలి సంవత్సరాలలో ఇరాన్ బహుళ ఘర్షణల్లో వేలాది షాహిద్ డ్రోన్‌లను మోహరించిందని నివేదికలు సూచిస్తున్నాయి.

అమెరికా, ఇజ్రాయెల్ వంటి అత్యంత అధునాతన రక్షణ నెట్‌వర్క్ కూడా ఇటువంటి నిరంతర ఒత్తిడిలో ఇబ్బంది పడవచ్చు. పేట్రియాట్, థాడ్ వంటి అధునాతన వ్యవస్థలు ఇప్పటికీ సమర్థవంతంగా పనిచేస్తాయి. ఈ వేదికలను ఉపయోగించే కొన్ని దేశాలు 90 శాతం కంటే ఎక్కువ అంతరాయ రేట్లను నివేదిస్తున్నాయి. అయినప్పటికీ ఖర్చు అసమతుల్యత నిరంతర సవాలుగా మిగిలిపోయింది.



> ఇరాన్ ఒకేసారి చాలా డ్రోన్‌లను ప్రయోగిస్తుంది, దాని ప్రత్యర్థుల వాయు రక్షణ వ్యవస్థలు భారీ సంఖ్యలో వచ్చే మానవరహిత వైమానిక వాహనాలను (యుఏవి) ఎదుర్కోవలసి వస్తుంది. వందలాది షాహిద్‌లు ఒకేసారి సమీపించినప్పుడు అత్యంత అధునాతన క్షిపణి కవచాలు కూడా కష్టమైన గణనను ఎదుర్కొంటాయి. అధిక అంతరాయ రేట్లు సాధ్యమే, కానీ అవి గణనీయమైన ఆర్థిక వ్యయంతో కూడుకున్నవి. పేట్రియాట్ ఇంటర్‌సెప్టర్ ధర దాదాపు 4 మిలియన్ డాలర్లు ఉంటుంది.

## మావోయిస్టు ఉద్యమానికి
# చరమగీతమా?

దశాబ్దాల పాటు తుపాకీనే మార్గమని నమ్మి అడవుల్లో సాయుధ పోరాటం సాగించిన నాయకులు ఇప్పుడు ప్రజాస్వామ్యమే పరిష్కారమని ప్రకటించడం భారత అంతర్గత భద్రతా చరిత్రలో ఒక యుగాంతర దృశ్యం. ఇటీవల వరుసగా అగ్రనేతల లొంగుబాట్లు, అసెంబ్లీ సందర్శనలు, ముఖ్యమంత్రులతో మర్యాదపూర్వక భేటీలు.. ఇవన్నీ కలిపి చూస్తే మావోయిస్టు ఉద్యమం తన చివరి అధ్యాయాన్ని రాస్తోందా అన్న ప్రశ్న సహజంగా ముందుకొస్తుంది. గతంలో “వ్యవస్థను కూల్చాలి” అన్న నినాదం వినిపించిన చోట ఇప్పుడు “వ్యవస్థలోనే మార్పు సాధిద్దాం” అన్న ప్రకటన వినిపించడం కేవలం వ్యూహ మార్పు కాదు; ఒక ఆలోచనా విధాన మార్పు. ఇటీవల ఛత్తీస్గఢ్ లో మాజీ మావోయిస్టులు ఛత్తీస్గఢ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ ని సందర్శించడం, అక్కడ ప్రజాస్వామ్య చర్చలను గ్యాలరీ నుంచి వీక్షించడం ఒక ప్రతీకాత్మక రాజకీయ ప్రకటనగా నిలిచింది. ఇదే సమయంలో తెలంగాణలో లొంగిపోయిన అగ్రనేతలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ను మర్యాదపూర్వకంగా కలవడం.. రాజ్యాంగ వ్యవస్థపై నూతన విశ్వాసానికి సంకేతంగా భావించవచ్చు. తుపాకీ పట్టిన చేతులు రాజ్యాంగాన్ని అంగీకరించడం భారత ప్రజాస్వామ్య సహనానికి, వ్యవస్థా బలానికి ఒక నిదర్శనం. మావోయిస్టు ఉద్యమం చరిత్రను పరిశీలిస్తే ఇది ఒక్కరోజులో పుట్టినది కాదు, ఒక్కరోజులో కూలిపోయినది కూడా కాదు. 1967లో నక్సల్బరి ఉద్యమంతో ప్రారంభమైన ఈ సాయుధ భావజాలం భూసంస్కరణలు, గిరిజన హక్కులు, సామాజిక అసమానతలపై తిరుగుబాటు అనే నినాదాలతో ముందుకు వచ్చింది. అనేక ప్రాంతాల్లో ఇది ఒక ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగింది. కానీ కాలక్రమేణా ఉద్యమం స్వరూపం మారింది. ప్రజా మద్దతు క్రమంగా తగ్గింది. హింసాత్మక ఘటనలు పెరిగాయి. అమాయకుల ప్రాణనష్టం ఉద్యమ నైతికతను ప్రశ్నార్థకంగా మార్చింది. అభివృద్ధి కార్యక్రమాలకు అడ్డంకులు ఏర్పడ్డాయి. ఈ పరిణామాలు ప్రజల్లో ఆమోదాన్ని దెబ్బతీశాయి.

ఇటీవలి లొంగుబాట్ల వెనుక అనేక కారణాలు ఉన్నాయి. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయ భద్రతా వ్యూహాలు, ఆధునిక సాంకేతిక పర్యవేక్షణ, ఇంటెలిజెన్స్ బలోపేతం——ఇవి అగ్రనేతల వరకు చట్టం చేరేలా చేశాయి. అభివృద్ధి ప్రాజెక్టులు, రహదారులు, విద్య, ఆరోగ్య సదుపాయాల విస్తరణతో గిరిజన ప్రాంతాల్లో జీవన ప్రమాణాలు మెరుగయ్యాయి. సరెండర్ పాలసీలు, పునరావాస ప్యాకేజీలు కేడర్‌లో భవిష్యత్ భద్రతపై నమ్మకం కలిగించాయి. సిద్ధాంతపరంగా కూడా కొత్త తరం యువతలో హింసాత్మక విప్లవ భావజాలం ప్రభావం తగ్గింది. అంతర్గత విభేదాలు, అరెస్టులు, ఎన్‌కౌంటర్లు.. ఇవి సంఘటిత బలం క్షీణించడానికి దారితీశాయి. అయితే ఉద్యమం పూర్తిగా నేలకూలిందని తేల్చేయడం తొందరపాటు. సామాజిక అసమానతలు ఇంకా ఉన్నాయి. గిరిజన భూహక్కుల సమస్యలు పూర్తిగా పరిష్కారం కాలేదు. మైనింగ్, పారిశ్రామిక విస్తరణపై ఇంకా వివాదాలు కొనసాగుతున్నాయి. నిరుద్యోగం, ప్రాంతీయ వెనుకబాటు.. ఇవి సవాళ్లుగానే ఉన్నాయి. ఈ మూల సమస్యలు పరిష్కారమైతేనే సాయుధ భావజాలానికి శాశ్వత ముగింపు పలకవచ్చు. లేకపోతే అది వేరే రూపంలో పునరావృతమయ్యే అవకాశాన్ని పూర్తిగా కొట్టిపారేయలేము. ప్రజాస్వామ్య మార్గాన్ని ఎంచుకున్నామని ప్రకటించిన మాజీ నేతల ముందు కూడా సవాళ్లు ఉన్నాయి. గతాన్ని అంగీకరించడం, హింసను స్పష్టంగా ఖండించడం, బాధితులకు న్యాయం జరిగేలా సహకరించడం.. ఇవి విశ్వాసాన్ని పునర్నిర్మించడానికి అవసరం. ప్రజాస్వామ్యం ఒక సహన వ్యవస్థ. కానీ అది చట్టబద్ధత, పారదర్శకత, బాధ్యతలను కోరుతుంది. ఆయుధం విడిచిపెట్టడం మొదటి అడుగు మాత్రమే; రాజ్యాంగ విలువలను ఆచరణలో చూపించడం తదుపరి కీలక దశ. ప్రభుత్వాల బాధ్యత కూడా ఇక్కడితో ముగియదు. పునరావాస ప్యాకేజీలు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా పారదర్శకంగా అమలుకావాలి. గిరిజన అభివృద్ధి, భూసంస్కరణలు, ఉపాధి అవకాశాలు.. వీటిపై దీర్ఘకాల దృష్టి అవసరం. భద్రతా విజయాన్ని రాజకీయ ప్రచారంగా కాకుండా సామాజిక శాంతి నిర్మాణంగా చూడాలి. పోలీస్-ప్రజా సంబంధాలు మెరుగుపడాలి. ప్రజల నమ్మకం బలపడాలి. అడవుల్లో గుప్తంగా సాగిన సాయుధ పోరాటం నుంచి అసెంబ్లీ గ్యాలరీలో కూర్చుని ప్రజాస్వామ్య చర్చలను గమనించే దశకు మార్పు ఒక చారిత్రక సంధి. ఇది హింసకు ముగింపు సంకేతం కావచ్చు. కానీ శాశ్వత శాంతి కోసం న్యాయం, సమానత్వం, అభివృద్ధి అనే అసలు లక్ష్యాలు నెరవేరాలి. తుపాకీ నిశ్శబ్దమవడం శాంతి ప్రారంభం. కానీ సామాజిక న్యాయం స్థిరపడితేనే ఆ శాంతి చిరస్థాయిగా నిలుస్తుంది. మావోయిస్టు ఉద్యమం సాయుధ శక్తిగా బలహీనపడింది అనడం నిజానికి దగ్గర. కానీ అది పూర్తిగా చరిత్ర పుటల్లో కలిసిపోయిందని చెప్పాలంటే దేశం సామాజిక-ఆర్థిక అసమానతలపై నిజమైన పరిష్కారాన్ని సాధించాలి. అడవుల అస్తమయం ప్రజాస్వామ్య ఉదయానికి మార్గం వేయాలి. అదే ఈ పరిణామాల అసలైన అర్థం.




(కాలగిరి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్)



# గ్రేటర్ హైదరాబాద్



## మహిళలు ఆర్థికంగా ఎదగాలి

### మంత్రి పొన్నం ప్రభాకర్







**హైదరాబాద్, మార్చి 06, (ఉదయం):** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలని హైదరాబాద్ ఇంచార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. మాసాబ్ ట్యాంక్ లోని చాచా నెహ్రూ పార్క్ లో జీహెచ్ఎంసీ పరిధిలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాన్ని మంత్రి శుక్రవారం ప్రారంభించారు.

కార్యక్రమానికి ముందు భారత తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా గ్రామాలు, వార్డులు, మున్సిపాలిటీల్లో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు ఈ 99 రోజుల కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12 వేల గ్రామాలు, వార్డులు, మున్సిపాలిటీల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు.

ఈ కార్యక్రమంలో భాగంగా ఈవేస్ట్ సేకరణ కేంద్రాల కియోస్క్ లను మంత్రి ప్రారంభించారు. ఇళ్లలో పాడైపోయిన టీవీలు, ఫ్రిజ్‌లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను ఇళ్లలోనే ఉంచకుండా ఈ కేంద్రాలకు తీసుకువచ్చి రీసైక్లింగ్ చేయాలని ప్రజలకు సూచించారు. అలాగే 1500 చదరపు గజాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన అద్దాల లైబ్రరీని ప్రారంభించారు. స్థానిక ప్రజల్లో పఠన అలవాటును పెంపొందించేందుకు ఇది దోహదపడుతుందని తెలిపారు. పుస్తకాలను దానం చేసేందుకు ప్రత్యేక సౌకర్యం కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా స్వయం సహాయక సంఘాలకు చెందిన సభ్యులకు రూ.35 కోట్ల జీరో వడ్డీ రుణాల చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. అదేవిధంగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను మంత్రి ప్రారంభించారు. దీని ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళల పేర్లపై రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, అర్హులైన కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు వివరించారు.

మహిళలు పెద్ద సంఖ్యలో స్వయం సహాయక సంఘాల్లో చేరి ప్రభుత్వం అందిస్తున్న సున్నా వడ్డీ రుణాలను వినియోగించుకుని స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలని సూచించారు. సెట్విన్ వంటి శిక్షణ సంస్థల ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరచేందుకు శిక్షణ కార్యక్రమాలు, కుట్టు మిషన్ల పంపిణీ వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో మహిళలు చురుకుగా పాల్గొని విద్య, వైద్యం, పర్యావరణం, భద్రత తదితర రంగాల్లో ముందంజలో నిలవాలని మంత్రి పిలుపునిచ్చారు. మహిళలు ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాలు, ఐబిఎం, ఎల్ జి, ఎర్త్ సెన్స్, రెనవార్ట్, జి ఎన్విరో, రెల్డ్ న్ సంస్థలు కలిసి చాచా నెహ్రూ పార్క్ వద్ద ఈవేస్ట్ సేకరణ కోసం ప్రత్యేక కియోస్క్‌లను ఏర్పాటు చేశాయి. కార్యక్రమానికి మహిళలు ఇందిరమ్మ చీరలు ధరించి హాజరుకావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, హైదరాబాద్ గ్రంథాలయ సమితి చైర్మన్ కె. ఉపేందర్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరి చందన , గోల్కొండ జోనల్ కమిషనర్ ముకుంద రెడ్డి, అదనపు కమిషనర్ రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



## తారా కళాశాలలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమ ప్రారంభోత్సవం



**సంగారెడ్డి, మార్చి 06 ఉదయం :** తార ప్రభుత్వ కళాశాల సంగారెడ్డిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా చేపట్టి నిర్వహిస్తున్న "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. ప్రవీణ తెలిపినారు. ప్రత్యేకంగా విద్యా శాఖ అభివృద్ధికై ప్రజా పాలన ప్రగతి పాలన కార్యక్రమములో భాగంగా 10 రోజుల అభివృద్ధి ప్రణాళిక ను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని, ఈ పది రోజుల్లో చేపట్టి చేపట్టవలసిన అన్ని కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తామని ప్రిన్సిపల్ పేర్కొన్నారు.

మొదటి రోజైన శుక్రవారం కార్యక్రమంలో భాగంగా అధ్యాపక బృందము, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్సీసీ క్యాడెట్లు, విద్యార్థిని విద్యార్థులు కళాశాల పరిసర ప్రాంతాలను శుభ్రం చేయడం జరిగిందని, కళాశాలలో వృధాగా పేరుకుని పోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను, చెత్తాచెదారాన్ని తొలగించడం జరిగిందని, దీనివల్ల పర్యావరణ పరిశుభ్రత ఏర్పడి పర్యావరణంలో సమతుల్యత ఏర్పడడానికి అవకాశం ఉంటుందని తెలిపినారు .ఈ పది రోజులలో నిర్వహించవలసిన కార్యక్రమ ప్రణాళికను తయారు చేసుకోవడం జరిగిందని తెలిపినారు. ఈ పది రోజుల అభివృద్ధి ప్రణాళికలో భాగంగా కళాశాలలో అన్ని రకాలైన రికార్డులను తయారు చేయడము, సైన్స్ విభాగాల లేబరెటరీ సదుపాయాలను మెరుగుపరచడం, కళాశాలలో వివిధ విభాగాలలో చేయవలసిన రిపేర్లను చేయించడం జరుగుతుందని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందము ఎన్ఎస్ఎస్ అధికారులు ఎన్సిసి అధికారి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్నికల వరకే రాజకీయాలు

### అభివృద్ధి కోసం కలసి పనిచేయాలి: ఎమ్మెల్యే చింత ప్రభాకర్



**కంది, మార్చి 06 ఉదయం:** సంగారెడ్డి జిల్లా కంది మండలం చిమ్నాపూర్ గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రారంభించారు. స్థానిక గ్రామ సర్పంచ్ కృష్ణ గౌడ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి పంచాయతీ వ్యవస్థ ఎంతో కీలకమని అన్నారు. ఎన్నికలు ముగిసిన తర్వాత రాజకీయ విభేదాలను పక్కన పెట్టి గ్రామ అభివృద్ధి కోసం అందరూ కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజలు మనపై నమ్మకం ఉంచి ఆశీర్వదించి గెలిపించారని, వారి ఆశలు నెరవేర్చడం మన బాధ్యత అని పేర్కొన్నారు.

నూతన పంచాయతీ భవనం ద్వారా గ్రామ ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని తెలిపారు. గ్రామ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే గ్రామంలో స్కూల్ భవన నిర్మాణానికి కూడా పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు కలసికట్టుగా పనిచేస్తే గ్రామం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అనంతరం గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ కొండల్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచేందర్ నాయక్, ఆంజనేయులు, ఉప సర్పంచ్ మోతిలాల్, మాజీ జడ్పీటీసీ మనోహర్ గౌడ్, సుధీర్ రెడ్డి, సాయిగౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గీతంలో రోబోటిక్స్, ఏఐ ల్యాబ్స్

### ప్రారంభించిన మహీంద్రా సీనియర్ జీఎం అనిల్ కుమార్





**పటాన్చెరు, మార్చి 06 (ఉదయం):** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ లో రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) లాబొరేటరీని జహీరాబాద్ లోని మహీంద్రా & మహీంద్రా ఆటోమోటివ్ డివిజన్ ప్లాంటు అధిపతి, సీనియర్ జనరల్ మేనేజర్ (తయారీ) అనిల్ కుమార్ మహేంద్రకర్ శుక్రవారం ప్రారంభించారు. స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్ ల్యాబ్ భావనను మహేంద్రకర్ ప్రశంసించడమే గాక, పారిశ్రామిక అనువర్తనాలతో విద్యాభ్యాసాన్ని అనుసంధానించడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. నిపుణుల ఉపన్యాసాలు, ఆచరణాత్మక శిక్షణను అందించడానికి మహీంద్రా ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులను కూడా ఇక్కడకు పంపుతామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. తమ పారిశ్రామిక ఉత్పత్తులను స్వయంగా పరిశీలించి, ఉత్పత్తి సంస్థను సందర్శించిన అనుభూతిని సొంతం చేసుకోవడానికి గీతం విద్యార్థులు తమ కర్మాగారాన్ని సందర్శించాలని ఆయన ఆహ్వానించారు.

గీతంతో అంకురించిన అనుబంధాన్ని మహేంద్రకర్ గుర్తుచేసుకుంటూ, తమ ప్లాంట్ లో ఫ్యాకల్టీ ఇంటర్న్ షిప్ కోసం గీతం అధికారులు తమను సంప్రదించినప్పుడు, తొలుత ఒకింత విస్మయానికి గురయ్యామని చెప్పారు. రెండు బ్యాచులుగా గీతం అధ్యాపకులు తమ వద్ద శిక్షణ పొందారని, వారికి తమ పరిశ్రమపై లోతైన అవగాహన ఏర్పడడంతో పాటు, మెరుగైన విద్యా దృక్పథాలు వచ్చాయన్నారు. ఇది తమకు కూడా ఉపకరిస్తుందన్న విశ్వాసం వెలిబుచ్చారు.

గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు, కోర్ ఇంజనీరింగ్ మాజీ డీన్ ప్రొఫెసర్ వి.ఆర్.శాస్త్రి, స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ వడ్డి సమక్షంలో ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. అంతర్ విభాగ అధ్యయనం, ఆవిష్కరణ, పరిశోధనల కోసం ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని వారు విద్యార్థులను ప్రోత్సహించారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం స్థాపించిన ఈ ప్రయోగశాల, రోబోటిక్ వ్యవస్థల రూపకల్పన, ప్రోగ్రామింగ్, నిర్వహణలో విద్యార్థులకు ఆచరణాత్మక అనుభవాన్ని అందించడం ద్వారా రోబోటిక్స్, ఆటోమేషన్, కృత్రిమ మేధస్సు, స్మార్ట్ తయారీలో ఆచరణాత్మక అభ్యాసం, పరిశోధనలను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది.

మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ పి. శ్రీనివాస్, రోబోటిక్స్ఏఐ లాబొరేటరీ ప్రొఫెసర్ ఇన్ ఛార్జి డాక్టర్ ఎ.కిరణ్ కుమార్ ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని సంయుక్తంగా సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. సాంకేతిక ఆధారిత విద్య, పరిశ్రమ సంబంధిత నైపుణ్య అభివృద్ధికి గీతం యొక్క నిబద్ధతలో ఈ కొత్త సౌకర్యం మరో ముఖ్యమైన అడుగును సూచిస్తుంది.

## ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలి

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



**సంగారెడ్డి, మార్చి 06 (ఉదయం ప్రతినిధి) :** హత్నూర మండలం మంగపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా వేగంగా పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో పూరి ఇళ్లలో నివసిస్తున్న అర్హులైన పేద కుటుంబాలను గుర్తించి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపించాలని అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరులు కల్పించాలని తెలిపారు. గ్రామంలో మంజూరైన ఇళ్ల సంఖ్య, నిర్మాణ దశలు, లబ్ధిదారుల ఖాతాల్లో నిధుల జమ వంటి అంశాలపై ఎంపీడీఓ, హౌసింగ్ ఏఈలతో సమీక్ష నిర్వహించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లకు సంబంధించిన ఫోటోలను వెంటనే అప్‌లోడ్ చేయాలని సూచించారు. అలాగే స్లాబ్ పనులు పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లకు ఏప్రిల్ 20 నుండి 26 వరకు నిర్వహించే సంక్షేమ మహోత్సవాల సందర్భంగా గృహప్రవేశ కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. లబ్ధిదారులు తమ స్వంత ఇళ్లలో నివసించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మండల పరిషత్ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లో నీటి వనరులను పరిశీలించి అవసరమైన చోట్ల బోర్ల మరమ్మతులు చేయడం, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా కల్పించడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు తాగునీటి సమస్యలు లేకుండా ముందస్తుగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు.

అనంతరం హత్నూర మండలం కసాల గ్రామంలోని డీసీఎంఎస్ ఎఫ్ఎస్సీ ఫర్టిలైజర్స్ దుకాణాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు అందుబాటులో ఉన్న విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నిల్వలను పరిశీలించారు. విక్రయాలకు సంబంధించిన రికార్డులు, బిల్లు బుక్స్, స్టాక్ బోర్డు వివరాలను తనిఖీ చేసి అధికారులను పలు విషయాలపై ప్రశ్నించారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సరిపడా నిల్వలో ఉంచాలని, ధరల వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలని దుకాణ నిర్వాహకులకు సూచించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా వ్యవసాయ శాఖ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ చలపతి రావు, సర్పంచ్ మన్నే రాధా రమేష్, తహసీల్దార్, ఎంపీడీఓ, పంచాయితీ సెక్రటరీ, ఇంజినీరింగ్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలపై అవగాహన సదస్సు



**సంగారెడ్డి, మార్చి 06 ఉదయం :** సంగారెడ్డిలోని సెయింట్ పీటర్స్ పాఠశాలలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నేటి కాలంలో చాలాచోట్ల అగ్ని ప్రమాదాలు జరుగుతుండడం గమనిస్తున్నాము. గ్యాస్ సిలిండర్ విషయంలో, షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి సంగారెడ్డి పట్టణంలోని అగ్నిమాపక శాఖ అధికారి శ్రీ భిక్షపతి గారు తగిన జాగ్రత్తలను విద్యార్థులకు తెలిపారు. చక్కని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది శ్రీ నాగిరెడ్డి, యాదగిరి, యాదయ్య, రవి, రత్నం, ఇక్బాల్, శ్రీకాంత్ గౌడ్, మరియు ప్రధాన ఉపాధ్యాయులు శ్రీ రవి కుమార్ గారు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

### ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ: మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి




**మెదక్, మార్చి 06 (ఉదయం ప్రతినిది):** ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటికి తక్షణ పరిష్కారం చూపే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాన్ని చేపట్టిందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు మరియు భూగర్భ శాఖ మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో అమలు చేస్తున్న ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలపై శుక్రవారం మెదక్ సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులతో సన్నాహక సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, వాటి ఫలితాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించేందుకు గ్రామ, వార్డు సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

విద్యారంగంలో జరుగుతున్న సంస్కరణలు, వైద్యరంగంలో తీసుకొస్తున్న మార్పుల నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులను మెరుగుపరిచే ప్రణాళికను ప్రజలకు వివరించాలని సూచించారు. సోలార్ విద్యుత్ వినియోగాన్ని పెంచడం ద్వారా ప్రజలకు అదనపు ఆదాయ మార్గాలు కల్పించే అంశాలను కూడా ప్రచారం చేయాలని తెలిపారు.

స్థలం ఉన్నా ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. అలాగే అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డులు అందించే ప్రక్రియను నిరంతరంగా కొనసాగించాలని చెప్పారు. యువతకు నైపుణ్య శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు 99 రోజుల కార్యాచరణలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో పనిచేసి ప్రజలకు అందించే సేవలను మరింత సమర్థవంతంగా అందించాలని మంత్రి సూచించారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించే విధంగా పనిచేయాలని ఆదేశించారు.

మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వేసవికాలంలో త్రాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో బోర్ల మరమ్మత్తులు చేయడంతో పాటు ప్రత్యామ్నాయ తాగునీటి సరఫరాకు ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు అమలు చేయాలని అన్నారు.

ఎంపీ సురేష్ షట్కర్ గ్రామ స్థాయిలో ఆరోగ్య సేవలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఎంఎల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి మున్సిపాలిటీల్లో డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో అండర్ పాస్ నిర్మించాలని సూచించారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్ రెడ్డి గ్రామాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించడంతో పాటు పాల ఉత్పత్తిని పెంచే చర్యలు తీసుకోవాలని కోరగా, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు జిల్లాలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పనులు ప్రారంభించాలని సూచించారు. టి.జి.ఐ.ఐ.సి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు.

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ కార్యాచరణలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల పరిశుభ్రత, పెండింగ్ ఫైళ్ల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 613 మంది సర్పంచులు, 11 మంది మున్సిపల్ చైర్మన్లకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి, అదనపు కలెక్టర్లు నగేష్, మాధురి, అబ్దుల్ హమీద్, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, మెదక్ ఎస్పీ శ్రీనివాస్ రావు, మెదక్ మున్సిపల్ చైర్మన్ కనుగుల రాధిక, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కౌన్సిలర్లు, జిల్లా అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## వివాహిత అదృశ్యం



**మేడిపల్లి, మార్చి 06 (ఉదయం ప్రతినిధి):** మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని స్వరూప్ నగర్ కాలనీలో నివసించే కళ్ళు కీర్తి వయసు 34 సంవత్సరాలు గత కొంతకాలంగా బట్టల వ్యాపారం చేస్తున్నది వ్యాపారం అభివృద్ధి కొరకు తెలిసిన వాళ్ళ దగ్గర కొంత నగదు అప్పుగా తీసుకున్నది వ్యాపారంలో నష్టం రాగా అప్పుల బాధ భరించలేక గత నెల 28 తారీఖున ఎవరికి చెప్పకుండా ఇల్లు విడిచి వెళ్ళినది. శుక్రవారం ఆమె కుమారుడు రాహుల్ ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికతో సానుకూల మార్పులు

### శాస్త్రీపురం ఆర్ఓబి నీ ప్రారంభానికి సిద్ధం చేయాలి : అధికారులను ఆదేశించిన కమిషనర్



**హైదరాబాద్, మార్చి 06 (ఉదయం):** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 99 రోజుల "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంతో అనేక సానుకూల మార్పులు రానున్నాయని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్ తెలిపారు. అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యం, ప్రభుత్వ విభాగాల సహకారంతో చేపట్టనున్న ఈ కార్యక్రమంతో నగర ప్రజల జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడతాయని ఆయన తెలిపారు. 99 రోజుల "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైన నేపథ్యంలో శుక్రవారం రాజేంద్ర నగర్ జోన్ అత్తాపూర్ సర్కిల్ లోని నిర్మాణంలో ఉన్న శాస్త్రీపురం ఆర్ఓబి నీ క్షేత్ర స్థాయిలో కమిషనర్ పరిశీలించారు. పురోగతిని పరిశీలించిన ఆయన అప్రోచ్ రోడ్డు , పెండింగ్ పనులు పూర్తి చేసి ప్రారంభానికి కి సిద్ధం చేయాలన్నారు. ఆ వెంటనే పారిశుద్ధ్య కార్యక్రమాల అమలు తీరును, ఇంటింటా చెత్త సేకరణ ప్రక్రియను పరిశీలించారు. ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణ తప్పకుండా చేయాలని స్వచ్ఛ ఆటోల డ్రైవర్లకు సూచించారు. రోడ్లపై ఎక్కడ చెత్త కనపడవద్దని ఆదేశించారు. అనంతరం కమిషనర్ కోత్వాల్‌గూడ వద్ద ఎకో హిల్ పార్క్ సీఎం ప్రారంభించనున్న నేపథ్యంలో ప్రారంభ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... 99 రోజుల "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" లో గ్రేటర్ హైదరాబాద్ నగరంలో చెత్త సేకరణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. నగరంలో 100 శాతం ఇంటింటా చెత్త సేకరణ జరిగేలా చూస్తామన్నారు. గార్బేజి వలన రెబల్ పాయింట్లపై ప్రత్యేకంగా ఫోకస్ పెడుతున్నట్లు కమిషనర్ తెలిపారు. గార్బేజ్ పాయింట్లు చెత్త ఉన్నట్లు గుర్తిస్తే ప్రతి ఉదయం 9 గంటల లోపే దానిని ప్రాసెసింగ్ యూనిట్ కి తరలించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో ఒక్క పారిశుద్ధ్యం పై మాత్రమే కాకుండా జీహెచ్ఎంసీకి చెందిన అన్ని విభాగాల కలెక్టివ్ గా పార్కుల అభివృద్ధి, లేక్స్ క్లీనింగ్, స్వయం సహాయక సంఘాల బలోపేతం, టౌన్ ప్లానింగ్, ఆస్తి పన్నుల చెల్లింపులు , రోడ్డు భద్రతా చర్యలు వంటి అంశాలకు ప్రాధాన్యమిస్తామని కమిషనర్ తెలిపారు. స్వయం సహాయక సంఘాలను ఈ కార్యక్రమంలో క్రియాశీలక భాగస్వామ్యం చేస్తామన్నారు. క్షేత్ర పరిశీలనలో కమిషనర్ వెంట రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ మందా మకరందు, అదనపు కమిషనర్ రవి కిరణ్ , డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య తదితరులు ఉన్నారు.



## పలువురికి మాజీ ఎమ్మెల్యే మెచ్చా పరామర్శ

**దమ్మపేట, మార్చి 6 (వుదయం ప్రతినిధి ) :**

అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు శుక్రవారం మండలంలో పలువురిని పరామర్శించారు. కంటి ఆపరేషన్ చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న పట్వారీగూడెం (గ్రామం)లో యలమంచి చంద్రశేఖర్ రావు, గుండె సంబంధిత ఆపరేషన్ చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న అదే గ్రామంలోని తంత్రి శ్రీరాములు, ఇటీవలే రోడ్డు ప్రమాదం జరగగా వైద్యం చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా పార్కలగండిలో కుర్సాం మారప్ప చిన్న కుమారుడిని ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకొని పరామర్శించారు. కార్యక్రమంలో వారితో పార్కలగండి సర్పంచ్ కొమరం సుశీల, రెడ్డిమల్ల నాగయ్య, కొనకళ్ళ సురేష్, రత్నాకర్ రావు, నడ్డి సత్యనారాయణ, కాకా శివ ప్రసాద్, రాజ్ శేఖర్, రంగ, పద్దం అశోక్, కొమరం భీమరాజు తదితరులు ఉన్నారు

### 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళి'కను

# విజయవంతంగా నిర్వహించాలి

**రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**



**నిర్మల్, మార్చి 06 (వుదయం ప్రతినిధి) :**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి (జిల్లా ఇన్‌చార్జి మంత్రి) జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం మంత్రి జూపల్లి, ఆదిలాబాద్ కలెక్టరేట్ నుంచి, ఎంపీ గోడం నగేష్, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలందరికీ క్షేత్రస్థాయిలో మెరుగ్గా అందాలన్న ఉద్దేశంతో "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక"ను చేపట్టిందన్నారు. కార్యక్రమంలో భాగంగా 99 రోజులపాటు, అన్ని శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని వివరించారు. పెండింగ్‌లో ఉన్న ఫైల్‌స్‌లను పరిష్కరించాలని పేర్కొన్నారు. వేసవిలో ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు కలుగకుండా తగు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు, ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులతో మాట్లాడుతూ.. జిల్లాల్లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖలకు కేటాయించిన పనులన్నీ ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని అన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, పెండింగ్ ఫైల్స్ పరిష్కారం, వైద్యారోగ్య కార్యక్రమాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన, అరైవ్ అలైవ్ కార్యక్రమం, తదితర కార్యక్రమాలన్నీ ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని అన్నారు. అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధుల సంయుక్త భాగస్వామ్యంతో 99 రోజుల ప్రత్యేక కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణను స్వయంగా పర్యవేక్షిస్తామని స్పష్టం చేశారు. సంబంధిత శాఖల అధికారులు అందరూ తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమాలలో పాల్గొనాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, నిర్మల్ మున్సిపల్ చైర్మన్ అప్పాల కావ్య, వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, భైంసా మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి, నిర్మల్, భైంసాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లు సోమ భీమ్‌రెడ్డి, షిండే ఆనంద్ రావు పటేల్ పాల్గొన్నారు.



## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

**మంత్రి పొంగులేటి కి టి యు డబ్ల్యు జే టీజేఎఫ్ వినతి**
**అధికారులతో చర్చించి సత్వరమే పరిష్కారానికి హామీ**

**ఖమ్మం, వుదయం బ్యూరో మార్చి 6..**

ఖమ్మం జిల్లాలో వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టియుడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారులతో ప్రగతి ప్రణాళిక పై జరిగిన సమీక్ష సమావేశంలో రాష్ట్రం రెవిన్యూ శాఖ మంత్రిని కలిసిన టిజెయఫ్ నాయకులు , వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు తక్షణమే పంపిణీ చేయాలని , జర్నలిస్టులకు అక్రిడేషన్ కుదింపు చేసే జీవో నెంబర్ 252 సరిచేసి అర్హులైన వారందరికీ అక్రిడేషన్ ఇవ్వాలని కోరారు. గత ఎన్నో రోజులుగా తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అనేకసార్లు విజ్ఞప్తి చేశామని గుర్తు చేశారు. అనంతరం మంత్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ త్వరలో ఉన్నతాధికారులతో చర్చించి వాటి పరిష్కారానికి ఓ స్పష్టమైన నిర్ణయాన్ని తెలుపుతామని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి యూనియన్ నేతలకు హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో టియు డబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి చిర్రా రవి, ఉపాధ్యక్షులు బొల్లం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



## ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీకి ప్రజలు తోడ్పాటు అందించాలి

**రామకృష్ణాపూర్/మార్చి 06 (వుదయం ప్రతినిధి)**

క్యాతన్ పల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్ పట్టణంలో గల రాజీవ్ చౌక్ ఏరియాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికా కార్యక్రమాన్ని మున్సిపాలిటీ కమిషనర్ మారుతి ప్రసాద్ ప్రారంభించారు. ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రతిజ్ఞతో ప్రారంభించగా ముఖ్య అతిథులుగా మున్సిపల్ అసిస్టెంట్ డైరెక్టర్ సాయికుమార్ హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పది రోజులపాటు చేపట్టపోయే పనుల గురించి వివరించారు. పారిశుద్ధ్య పనులు, తడి చెత్త, పొడి చెత్త ,డ్రైనేజీలు శుభ్రం చేయడం, రోడ్డు పక్కన పిచ్చి మొక్కలు తొలగించడం, చేతి పంపులు మరమ్మత్తులు చేయించడం తదితర కార్యక్రమాలను చేపట్టబోతున్నట్లు మున్సిపాలిటీ కమిషనర్ మారుతి ప్రసాద్ తెలియజేశారు. అనంతరం ఐదవ వార్డు అమరవాదిలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని సందర్శించారు. ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీకి ప్రజలందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు, పట్టణ ప్రజలు, మెప్మా సిబ్బంది, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## కన్నుల పండువగా లక్ష్మీనృసింహుడి ఉత్తర దిగ్యాత్ర

**ధర్మపురి మార్చి 06 (వుదయం ప్రతినిధి) :**

ధర్మపురి లక్ష్మి నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవా రం లక్ష్మీనృసింహుడి ఉత్తర దిగ్యాత్ర వైభవంగా నిర్వహించా రు.ఈ సందర్భంగా యోగ, ఉగ్ర నారసింహ స్వామివార్ల ఉత్సవ మూర్తులను యజ్ఞచార్యులు పురుషోత్తమాచర్య నేతృత్వంలో ముఖ్య అర్చకులు నంబి శ్రీనివా సచార్య లు,ఉప ప్రధాన అర్చకు లు నెరేళ్ల శ్రీనివాసచార్యులు వేద పండితులు బొజ్జా రమేష్ శర్మ , పాలేపు ప్రవీణ్ కుమార్ శర్మ మంత్రోచ్చారణ ల మధ్య ఈఓ సంకటాల.శ్రీనివాస్ పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకీ సేవ పై స్వామి వారిని ఆశీనులను చేసి ఊరేగింపుగా ఉత్తర దిక్కులోని ఉసిరిక వాగు వద్దకు తీసుకువెళ్లారు. దారి పొడవునా మహిళల కోలాటలతో, ఆటపాటలతో రాగా ఉసిరిక వాగువద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతీ ఏటా లాగానే ఈ పూజలో పెరుమాండ్ల ఎల్లా గౌడ్ కుటుంబం స్వామివారికి పూజలు నిర్వహిం చిన అనంతరం స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం స్వామివారిని తిరిగి ఆలయానికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అల్వాల్ శ్రీనివాస్, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు, సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

## ధర్నాను విజయవంతం చేయాలి

- ఎమ్మార్పీఎస్ నాయకులు

**నల్లగొండ, మార్చి 6 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

కలెక్టరేట్ ఎదుట ఈ నెల 9 సోమవారం చేపట్టనున్న ధర్నా కార్యక్రమాన్ని, మార్చి 30న ఇందిరాపార్క్ దగ్గర జరిగే నిరాహార దీక్షను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం నల్లగొండలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రపత్రం ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న ఆదేశాల మేరకు రాష్ట్రప్రధాన కార్యదర్శి కుడుతాల నాగయ్య మాదిగ ఆధ్వర్యంలో కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేడి నరసింహ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు జిల్లా అధికార ప్రతినిధి ఎర్రోళ్ల శ్రీనివాసు మాదిగ, ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా నాయకులు వంగూరి యాదగిరి, ఎంఎస్ఎఫ్ జిల్లా నాయకులు వంగూరి సునీల్ కుమార్, కార్మిక విభాగం జిల్లా నాయకులు కుడుతాల సైదులు, రంగనాయకులు, స్వామి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా గతంలో లాగా ఎస్సీ ఉపకులాల్లో ఉన్న 59 కులాలకు లోన్లు మంజూరు చేయాలని కోరారు. దళితుల వద్ద నుంచి లాక్కున్న అసైన్డ్ భూములను తిరిగి ఇవ్వడంతోపాటు పారిశుద్ధ కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగుల గుర్తించి కనీస వేతనం 20,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. లీడ్ క్యాప్ పునరుద్ధరించి తోళ్ల పరిశ్రమకు రూ.10000 కోట్లు కేటాయించి చైర్మన్ నియమించి తోళ్ల పరిశ్రమలు ఏర్పాటు చేసి మాదిగ యువతకు ఉపాధి కల్పించాలి. కార్పొరేట్ విద్యాసంస్థల్లో 25% ఉచిత విద్యలు కల్పించాలన్నారు. అర్హులైన ప్రతి దళిత కుటుంబానికి మూడు ఎకరాల భూమిని సాగుభూమి కేటాయించాలన్నారు. జీవో నెంబర్ 58, 59 ప్రకారం పట్టాలి ఇచ్చి అమ్ముకునే హక్కుకల్పించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుడుతాల నాగయ్య మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి దళితుల్లో ఉన్న 59 ఉప కులాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## ఖమ్మంలో అధునాతన 'ప్రెస్ క్లబ్' నిర్మించుకుందాం

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- డబ్ల్యూజేఐ వినతికి సానుకూల స్పందన
- 'ఇందిరమ్మ మోడల్ హౌస్'లను ప్రెస్ క్లబ్బులకు ఇవ్వాలని విజ్ఞప్తి
- 'అక్రిడిటేషన్ కమిటీ'లో డబ్ల్యూజేఐ ప్రతినిధులకు ప్రాతినిధ్యం కల్పించాలి

**ఖమ్మం, మార్చి 6 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

ఖమ్మం జిల్లా కేంద్రంలో అధునాతన 'ప్రెస్ క్లబ్' నిర్మించుకుందామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం ఖమ్మంలోని తన నివాసంలో మంత్రి పొంగులేటిని కలిసిన వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) ఖమ్మం జిల్లా కన్వీనర్ గంటెల ఆనంద్, కో కన్వీనర్లు యెన్నబోయిన శ్రీనివాస రావు, అమరనేని రామకృష్ణ, ఖమ్మం నియోజక వర్గ కన్వీనర్ కె.కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా నాయకులు బొడ్డుపల్లి రవీందర్ తదితరులు, జర్నలిస్టులకు సంబంధించిన పలు అంశాలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా, నియోజక వర్గ కేంద్రాల్లో అధునాతన ప్రెస్ క్లబ్ భవనాలు నిర్మించాలని, ఖమ్మం జిల్లా అక్రిడేషన్ కమిటీలో 'డబ్ల్యూజేఐ' ప్రతినిధులకు ప్రాతినిధ్యం కల్పించాలని, అక్రిడిటేషన్ కార్డుల మంజూరుకు సంబంధించిన కొన్ని నిబంధనలను మార్చాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పుడున్న ప్రెస్ క్లబ్ జర్నలిస్టుల అవసరాలకు ఏ మాత్రం సరి పోవడం లేదని, అక్కడ కనీసం పార్కింగ్ స్థలం కూడా లేదని, ఎక్కువ మంది కూర్చోవడానికి ఇబ్బందిగా వుందని డబ్ల్యూజేఐ ప్రతినిధులు మంత్రి దృష్టికి తెచ్చారు. అన్ని నియోజక వర్గ కేంద్రాల్లోనూ స్థలాలను కేటాయించి, ప్రెస్ క్లబ్ భవన నిర్మాణాలను చేపట్టాలని, వీటి నిర్మాణాలు పూర్తి అయ్యే వరకూ తాత్కాలికంగా నియోజక వర్గాల్లో నిరుపయోగంగా వున్న వున్న ప్రభుత్వ భవనాలను కేటాయించాలని కోరారు. అవకాశం వున్న చోట ఇందిరమ్మ మోడల్ హౌసులను ప్రెస్ క్లబ్బుల నిర్వహణకు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కొత్త ప్రెస్ క్లబ్ నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించి, అధునాతన భవనం నిర్మించాలని కోరారు. యూనియన్ ప్రతినిధుల విజ్ఞప్తికి మంత్రి పొంగులేటి స్పందిస్తూ.. ఖమ్మంలో అధునాతన 'ప్రెస్ క్లబ్' నిర్మించుకుందామన్నారు.



ఖమ్మం జిల్లా 'అక్రిడిటేషన్ కమిటీ'లో ప్రాతినిధ్యం కల్పించండి..

'వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా' ప్రతినిధులకు ఖమ్మం జిల్లా 'అక్రిడేషన్ కమిటీ'లో స్థానం కల్పించాలని మంత్రి పొంగులేటిని యూనియన్ ప్రతినిధులు కోరారు. ఇది 2017లో ట్రేడ్ యూనియన్ యాక్టు క్రింద నమోదు చేయబడిన సంస్థని, 'భారతీయ మజ్దూర్ సంఘ్'కు అనుబంధంగా పని చేస్తుందని చెప్పారు. అయితే, కొన్ని కారణాల వల్ల ఈ సంఘానికి అక్రిడేషన్ కమిటీల్లో ప్రాతినిధ్యం దొరక లేదని తెలిపారు. తమ యూనియన్ ప్రతినిధులకు కూడా ఖమ్మం జిల్లా 'అక్రిడిటేషన్ కమిటీ'లో స్థానం కల్పించాలని కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి పొంగులేటి, జిల్లా కలెక్టర్ తో మాట్లాడి 'డబ్ల్యూజేఐ' ప్రతినిధులకు కూడా 'అక్రిడిటేషన్ కమిటీ'లో స్థానం కల్పిస్తానని హామీ ఇచ్చారు. అక్రిడిటేషన్ కార్డుల జారీలో నిబంధనలను మార్చాలని ప్రతినిధులు మంత్రికి విజ్ఞప్తి చేశారు.



## స్వచ్ఛ సిద్దిపేట మనందరి బాధ్యత

- 99 రోజుల ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి శ్రీకారం
- పురపాలక సంఘం, సభ్యులతో ర్యాలీ
- బహిరంగ ప్రదేశాల్లో చెత్త , మలవిసర్జన చేయకూడదని సూచన
- కమిషనర్ అశ్రిత్ కుమార్

**వుదయం - సిద్దిపేట ప్రతినిధి ( మార్చి 6):**

స్వచ్ఛ సిద్దిపేట మనందరి బాధ్యత సిద్దిపేట కమిషనర్ అశ్రిత్ కుమార్ పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళిక కార్యక్రమాన్ని శుక్రవారం సిద్దిపేటలో పురపాలక సంఘ కమిషనర్ అశ్రిత్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పురపాలక సంఘ కార్యాలయం నుండి బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీలో పురపాలక సంఘ సిబ్బంది, మార్నింగ్ వాకర్స్, పట్టణ ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకూడదని, బహిరంగ మలవిసర్జన చేయకూడదని, ప్రజలు పబ్లిక్ టాయిలెట్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే ఇంటి వద్ద వెలువడే చెత్తను తప్పనిసరిగా తడి-ఎండు చెత్తగా వేరు చేయాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని సందేశాలతో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు.ర్యాలీ అనంతరం ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక ప్రతిజ్ఞను చేయించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా మార్చి 6 నుండి మార్చి 15, 2026 వరకు పరిసరాల పరిశుభ్రతకు సంబంధించిన కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని, మున్సిపాలిటీ అభివృద్ధికి మనసా వాచా కర్మణా కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ అధికారులు,సిబ్బంది మరియు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## స్వచ్ఛ దుబ్బాకే లక్ష్యంగా కృషి



- రానున్న 99 రోజుల్లో మున్సిపల్ లో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రోజువారి కార్యక్రమాలు నిర్వహిస్తాం
- దుబ్బాక మున్సిపల్ చైర్పర్సన్ శ్రీరామ్ సంగీత

**వుదయం, దుబ్బాక ( మార్చి 06)**

దుబ్బాక మున్సిపాలిటీ పరిశుభ్రతే లక్ష్యంగా పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచి, వార్డుల్లో ఉన్న పలు సమస్యలను పరిష్కరించి, స్వచ్ఛ దుబ్బాక సాధనే లక్ష్యంగా కృషి చేస్తామని దుబ్బాక మున్సిపల్ ల్ చైర్పర్సన్ శ్రీరామ్ సంగీత తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలనప్రగతి ప్రణాళిక (99 రోజుల కార్యచరణ ప్రణాళికా కార్యక్రమం) లో భాగంగా శుక్రవారం దుబ్బాక మున్సిపల్ కార్యాలయం నుంచి అంగడి బజార్ వరకు పాలకవర్గం సభ్యులు, పుర, మెప్మా సిబ్బంది ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి, ముఖ్యమంత్రి సందేశం వినిపించారు. అనంతరం అంగడి బజార్లో వారితో ప్రతిజ్ఞ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న 99 రోజుల్లో మున్సిపల్ లో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రోజువారి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ముఖ్యంగా అన్ని వార్డుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణతో పాటు ప్రజలకు తడి, పొడి, హానికర చెత్తపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అలాగే కార్యాలయంలో పెండింగ్ లో ఉన్న వివిధ రకాల పనులతో పాటు ప్రజా సమస్యల దరఖాస్తులను కూడా పూర్తిస్థాయిలో పరిష్కరించనున్నట్లు తెలిపారు. పాలకవర్గం, ప్రజలు, అన్ని పార్టీల సహకారంతో దుబ్బాక మున్సిపాలిటీ ని అన్ని రంగాల్లో మరింత ముందంజలో ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆస సులోచన, పురపాలిక మేనేజర్ శ్రీనివాస్,సీనియర్ అకౌంటెంట్ అనిల్ రెడ్డి, పాలకవర్గం సభ్యులు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నోడల్ ఆఫీసర్ ఎస్ .రాజేశ్వర్ పరిశీలించి, పాలకవర్గంతో సమీక్ష సమావేశం నిర్వహించి, 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా కృషి తీసుకోవాలని కోరారు. ఆ తర్వాత 19వ వార్డులో చేపట్టిన పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాలను మునిసిపల్ చైర్పర్సన్ శ్రీరామ్ సంగీత, మునిసిపల్ కమిషనర్ రమేష్ కుమార్ తో కలిసి ఆయన పరిశీలించారు.వారి వెంట టిపిఓ గిరిధర్, పురపాలిక మేనేజర్ శ్రీనివాస్, పుర సిబ్బంది తదితరులు ఉన్నారు.





## 99 రోజుల కార్యక్రమం విజయవంతం చేయాలి

**ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌లో ప్రజాప్రతినిధులు పాల్గొనాలి**
**కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట, మార్చి 6 (వుదయం) :**

జిల్లాలో అమలు చేయనున్న 99 రోజుల కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బాలేం గ్రామ పంచాయతీ కార్యాలయంలో 99 రోజుల కార్యక్రమం అమలుపై నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజల్లో మంచి పేరు సంపాదించుకునేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం ద్వారా అవకాశం కల్పించిందన్నారు. మార్చి 6 నుంచి మార్చి 15 వరకు నిర్వహించే ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌లో ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. పెండింగ్ ఫైళ్లను క్లియర్ చేయడం, తాగునీరు, విద్య, వైద్యం వంటి అంశాలకు సంబంధించిన దరఖాస్తులను పది రోజుల్లో పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు చేరేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. పేదలకు మెరుగైన పరిపాలన అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అనంతరం బాలేం గ్రామంలో ప్రజలతో కలెక్టర్ ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తరువాత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిచెన్ షెడ్, స్టోర్ రూమ్, వంటశాల, కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించారు. పాఠశాలకు సంబంధించిన బిల్లులు ఆన్‌లైన్‌లో ఎలా నిర్వహిస్తున్నారో వివరాలు తెలుసుకున్నారు. 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి సబ్జెక్టులో కనీసం 70 శాతం మార్కులు సాధించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు అందుతున్న భోజన వసతులను పరిశీలించారు. అలాగే పల్లె దవాఖానలో ఏఎన్ఎంలతో మాట్లాడి వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదగిరి, ఆర్డీవో వేణు మాధవరావు, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో బాలకృష్ణ, ఎంపీఓ లింగారెడ్డి, ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కారానికి ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్**
**బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలో జెండా ఊపి ప్రారంభం**
**కార్యాలయ ఆవరణలో శుభ్రత కార్యక్రమ నిర్వహణ, శానిటేషన్ ప్రతిజ్ఞ**







**వరంగల్ టౌన్, మార్చి 06 (వుదయం ప్రతినిధి) :**

స్థానిక సమస్యల పరిష్కారానికి "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వరంగల్ (పశ్చిమ) ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్‌లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా చేపట్టిన "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే మేయర్ కలెక్టర్‌లు లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించి, చీపుర్లు చేతబట్టి కార్యాలయ ఆవరణలో శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన శానిటేషన్ ప్రతిజ్ఞలో ప్రజాప్రతినిధులు కలెక్టర్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం వరంగల్ (పశ్చిమ) ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశానుసారం ఈనెల 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజులపాటు 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడానికి ఆదేశాలు జారీ చేశారని, కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మేయర్ కలెక్టర్‌లతో కలిసి ప్రారంభించామని, మన పట్టణాన్ని మనమే పరిశుభ్రంగా ఉంచుకోవడం మన బాధ్యత అని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్త డబ్బాల్లో వేసి స్వచ్ఛ ఆటోలకు అందజేయాలని కోరారు.నగర మేయర్ మాట్లాడుతూ.. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమ ముఖ్య ఉద్దేశం ఒక్కో రోజు ఒక్కో కార్యక్రమాన్ని చేపట్టి విజయ వంతంగా నిర్వహించాలని ఆదేశాలున్నాయని ప్రధానంగా శానిటేషన్‌కు వారం రోజుల పాటు కార్యక్రమాలను కేటాయించారని, దీనితో పాటు నీటి సరఫరాతో పాటు మహిళా దినోత్సవ కార్యక్రమ నిర్వహణను కూడా షెడ్యూల్ లో చేర్చామని, ఇందుకోసం 66 డివిజన్ ల వ్యాప్తంగా ఉన్న కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఇప్పటికే నగరంలో తడి పొడి చెత్తను వేరు చేసి అందించే కార్యక్రమాన్ని ప్రారంభించామని, ఇండోర్ పర్యటన కు వెళ్ళి అక్కడి పారిశుధ్య విధానాలను అధ్యయనం చేయడం వల్ల వాటి అమలుకు ప్రస్తుతం చక్కని అవకాశం దక్కిందని, నగరంలోని వాటర్ ట్యాంక్ (ఈఎల్ఎస్ఆర్)ఉన్న ఆవరణను శుభ్రంగా ఉంచుతూ వాటికి అనువైన లైటింగ్ ఏర్పాట్లు చేయడంతో పాటు నీటి సరఫరాలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలన్నారు. పారిశుద్ధ్యం, లైటింగ్ తదితర అంశాలకు సంబంధించి 99 రోజులలో అట్టి సమస్యలకు పరిష్కారం చూపుతామని ప్రజలందరూ ఈ కార్యక్రమాల్లో భాగస్వాములై విజయవంతం చేయాలని మేయర్ అన్నారు.హనుమకొండ జిల్లా కలెక్టర్, బల్దియా కమిషనర్ మాట్లాడుతూ.. పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు వివిధ సమస్యలను పరిష్కారం చేసి ఫైల్ పెండెన్స్ క్లియర్ చేయాలని ఇందులో కేవలం మున్సిపాలిటీ కాకుండా రూరల్ అడ్మినిస్ట్రేషన్‌లు ముఖ్య భూమిక పోషిస్తాయని, ప్రతి విభాగానికి ఒక వారం కేటాయించి అందులో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించేలా చూడాలని, పిహెచ్‌సి స్థాయిలో స్పెషలిస్ట్ డాక్టర్‌లతో హెల్త్ క్యాంప్ ల ఏర్పాటు, రైతు వేదికల్లో రైతులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాని, జీడబ్ల్యూఎంసి పరిధిలో దాదాపు 90 శాతం ప్రాజెక్ట్‌లు ప్రారంభోత్సవాలకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఉర్సు, భద్రకాళి వడ్డేపల్లి బండ్‌లలో పనులు కొనసాగుతున్నాయని, వాటిని ప్రారంభించేలా చూస్తామని వాహన షెడ్డులో ఫిల్టర్ బెడ్లలో పేరుకుపోయిన స్క్రాప్‌ను క్లియర్ చేసి ఆ పరిసరాలను పరిశుభ్రంగా తయారు చేయాలన్నారు. నగరంలో సమగ్ర శానిటేషన్ నిర్వహణ కోసం ప్రతి డివిజన్ కు ముగ్గురు వలంటీర్‌ను ఏర్పాటు చేసి వారి ద్వారా అవగాహన కలుగజేసి తడి పొడి చెత్తను వేరుగా అందించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఇటీవల ఏం ఆర్ ఎఫ్ ప్రాజెక్ట్‌కు ఆమోదం లభించిందని, ఇందులో భాగంగా సేకరించిన చెత్తను ప్రాసెస్ చేసి అందులోనుంచి పొడి చెత్తను వేరు చేసి మిగిలిన అంత్యాలను సిమెంట్ ఫ్యాక్టరీ లకు పంపించామని తెలిపారు. సిఎన్‌డి వేస్ట్ కోసం టెండర్ పిలిచామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమం లో స్థానిక డివిజన్ కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి సురేందర్, సిఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి, సి హెచ్ ఓ రమేష్, అకౌంట్స్ అధికారి శివ లింగం, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్‌లు ప్రసన్న రాణి, సమ్మయ్య, బిర్రు శ్రీనివాస్, ఏంహెచ్‌ఓ డా.రాజేష్, హెచ్ఓ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ‘కార్యాచరణ’ను విజయవంతంగా అమలు చేయాలి



**ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం అధికారుల బాధ్యత**
**రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ**
**99 రోజుల ‘ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక’పై దిశా నిర్దేశం**
**సమగ్ర ప్రణాళిక రూపొందించాం**
**కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల మార్చి 06 (ఉదయం ప్రతినిధి) :** ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు ఇతర కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం అధికారుల బాధ్యత అని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహణకు సంబంధించి శుక్రవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ఐడిఓసి సమావేశ మందిరంలో ఐదు జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతి నిధులు, వివిధ శాఖల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ముందుగా తెలంగాణ రాష్ట్ర గీతం ఆలపించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం 99 రోజులపాటు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు రూపొందించిన ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతం చేసేందుకు అధికార యంత్రాంగం సంసిద్ధంగా ఉండాలన్నారు. ప్రభుత్వం ప్రధానంగా 10 అంశాలను తీసుకొని ఈనెల 6వ తేదీ నుంచి జూన్ 12 వరకు షెడ్యూల్ ప్రకారం వివిధ దశల్లో ఆయా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు వివిధ సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రధానంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అభివృద్ధి కమిటీల సమావేశాలు, ఉపాధ్యాయుల రేషియో, తాగునీరు, మైనారిటీ సంక్షేమ శాఖ పథకాల అమలు, తదితర అంశాలన్నింటినీ పరిగణలోకి తీసుకొని పరిస్తామన్నారు. నల్లమల ప్రాంతంలో అటవీ భూముల సమస్యల పరిష్కారానికి రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మార్చి 12వ తేదీన నిర్వహించే జిల్లా స్థాయి ప్రజాప్రతినిధుల శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వం ఏ పథకం ప్రవేశపెట్టినా ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా అర్హులైన వారందరికీ వాటిని అమలు చేసేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై ఇప్పటికే చేసిన పనులను పెద్ద ఎత్తున ప్రచారం జరిగేలా సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలన్నారు. గ్రామసభలు నిర్వహించేటప్పుడు ఇప్పటికే వివిధ శాఖలకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వాటిని సకాలంలో పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 46 లక్షలకు పైగా మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు ఉన్నారని, 99 రోజులపాటు నిర్వహించే ఆయా కార్యక్రమాల్లో వీరిని పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. పది అంశాలపై నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల్లో తాను తరచు పాల్గొనడానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తానని తెలిపారు. ఆయా థీమ్ లకు సంబంధించి జిల్లా నోడల్ అధికారులు ప్రధాన బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి అధికారి బాధ్యతగా పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా మంత్రి పిలుపునిచ్చారు. జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమాయత్తమైనట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. జిల్లా, మండల స్థాయిలో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఇప్పటికే సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామ పంచాయితీ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు చేపట్టాల్సిన ఆయా కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించామన్నారు. ప్రభుత్వం ఈ రెండేళ్లలో అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆయా థీమ్ లకు సంబంధించి నోడల్ అధికారులను నియమించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా చేపట్టే పనుల ఫోటోలు, ఇదివరకటి పరిస్థితి ఫోటోలు నోటీస్ చేయడం జరుగుతుందన్నారు. ఆయా శాఖల వారీగా వచ్చిన దరఖాస్తులకు సంబంధించి ఎప్పటికప్పుడు సంబంధిత శాఖల అధికారులు పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం జిల్లా ఇన్చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను, టీ షర్టులను అధికారులు ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే ఎన్నం శ్రీనివాస్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీ కృష్ణ, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఉబేదుల్లా కోత్వాల్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ఆయా జిల్లాల కలెక్టర్లు కుష్బూ గుప్తా, బాదావత్ సంతోష్, ఆదర్శ సురభి పాల్గొన్నారు.





## దమ్మపేట లో ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక ప్రారంభం

- పారిశుధ్య సిబ్బందితో కలిసి చీపిరి పట్టిన పాలకవర్గ సభ్యులు

**దమ్మపేట(మార్చి 06) (ఉదయం ప్రతినిధి ):** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా మార్చి 6 నుండి మార్చి 15 వరకు ప్రజా ప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాలు మరియు యువకుల భాగస్వామ్యం తో మొదటి దశగా పారిశుధ్యం మరియు ఫైల్ క్లియరెన్స్ 10 రోజుల ప్రత్యేక డ్రైవ్ లో శుక్రవారం దమ్మపేట పంచాయతీ పారిశుధ్య సిబ్బందితో కలిసి పాలక వర్గ సభ్యులు, కార్యదర్శి దమ్మపేట ప్రధాన సెంటర్ బాలాజీనగర్ రోడ్డుకు ఇరువైపుల చెత్తను తొలగించి శుభ్రం చేసే డ్రైవ్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దమ్మపేట పంచాయతీ కార్యదర్శి బండి అనంత్ కుమార్ మాట్లాడుతూ శుక్రవారం నుండి 10 రోజుల పాటు రోజు ఒక కార్యక్రమం నిర్వహిస్తాము అని, ముఖ్యంగా 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా సన్నాహక సమావేశం, పెండింగ్ ఫైళ్ల పరిష్కారం, ప్రజా సంస్థల శుభ్రత, చెత్త వేరు చేసి సేకరణపై అవగాహన కార్యక్రమం, వీధులు మరియు డ్రెయిన్ల శుభ్రపరచడం, మంచినీటి ట్యాంకులను శుభ్రపరచడం మరియు నిరుపయోగ బావులు/బోర్లు మూసివేత, గ్రామపంచాయతీ స్థాయి సమావేశం, శుక్రవారం డ్రై డే, నర్సరీ మరియు వీధి కుక్కల నియంత్రణ, సన్మానం మరియు ఆరోగ్య శిబిరం, ఓరియెంటేషన్ శిక్షణ, ప్రణాళిక మరియు అమలు మొదలగున్నవి నిర్వహిస్తాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పగడాల రమాదేవి, రాంబాబు, ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, బత్తుల సాయి, చాట్ల శ్రీను, ధర్మసోతు పద్మ, బద్దె వెంకటలీల, చిన్నశెట్టి నాగలక్ష్మి, పూనెం పోలమ్మ, దాసరోజు రామారావు, విజయ్, సింగ్, గణేష్, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలి



**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**
**అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి**
**మంత్రి కొండా సురేఖ**

**మహబూబాబాద్ మార్చి 06 (ఉదయం జిల్లా ప్రతినిధి) :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుకు చేరేలా అధికారులు కృషి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంపై మహబూబాబాద్ ఐడీఓసి కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాం నాయక్, ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్, ఏమ్మెల్సీ రవీందర్ రావు, శాసన సభ్యులు మురళి నాయక్, దొంతి మాధవరెడ్డి, రాజేందర్ రెడ్డి, నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, కూడా చైర్మన్ ఇనుగల వెంకట్రామిరెడ్డి, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ నెల 6వ తేదీ నుంచి జూన్ 12వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా “ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక” కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యా, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల కొరతను తీర్చాలని, అవసరమైన సిబ్బందిని నియమించుకోవాలని చెప్పారు. ముఖ్యంగా మారుమూల గ్రామాల్లో కూడా వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి కొరత ఉండకుండా చూడాలని సూచించారు. ఉపయోగంలో లేని వైద్య పరికరాలను తొలగించి, అవసరమైన పరికరాలకు తగిన సిబ్బందిని నియమించి వాటిని సమర్థంగా వినియోగంలోకి తేవాలని పేర్కొన్నారు. పాఠశాలల వాహనాలు ఫిట్‌నెస్ లేకపోతే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు కఠినంగా వ్యవహరించాలని సూచించారు. జిపిఆర్ఎస్ ద్వారా పాఠశాల వాహనాలు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. స్లమ్ ఏరియాల్లో నివసిస్తున్న ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని, ఉందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలి, ఎక్కడైనా నిధులు మంజూరు సమస్య ఉంటే నివేదికలు పంపాలని తెలిపారు. ప్రతి హాస్టల్ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించి తనిఖీలు చేయాలని, విద్యార్థులతో కలిసి భోజనాలు చేయాలని తెలిపారు. గ్రామ, మండల స్థాయిలో ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారుల జాబితా తయారు చేయాలని తెలిపారు. మార్చి నెలాఖరు వరకు ఇందిరమ్మ ఇండ్లు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని, గ్రౌండ్ కాని ఇండ్లు లబ్ధిదారుల నుంచి అంగీకారాన్ని తీసుకుని రద్దు చేయాలని తెలిపారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కార స్థితిని దరఖాస్తుదారులు తెలుసుకునేలా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి సమాచారం వారి సెల్‌ఫోన్లకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలికల వసతి గృహాల్లో ఇన్సినిరేటర్లు ఏర్పాటు చేయాలని, మండల స్థాయిలో ఆరోగ్య సదస్సులు నిర్వహించి వైద్య పరీక్షలు చేపట్టాలని మంత్రి పేర్కొన్నారు. అలాగే గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, ఛైర్మన్‌లకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## పరిశుభ్రతను పాటించాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**జయశంకర్ భూపాలపల్లి మార్చి 06 (ఉదయం జిల్లా ప్రతినిధి) :** భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో 3వ వార్డులో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, డ్రైనేజీలు, కాలనీలు, ఇళ్ల పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని ప్రజలకు సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అన్ని శాఖల అధికారులు పాల్గొని ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తమ వార్డులు, గ్రామాల అభివృద్ధికి భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమరయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య విద్య అభివృద్ధి కొరకు సకల సదుపాయాలు కల్పిస్తాం





- పెద్దపల్లి పార్లమెంటు సభ్యుడు గడ్డం వంశీకృష్ణ
- ప్రభుత్వ వైద్య కళాశాల కొరకు నూతన శాశ్వత భవనం
- కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మార్చి 6 (ఉదయం ప్రతినిధి) :** ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వ వైద్య కళాశాలలలో వైద్య విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల కొరకు సకల సదుపాయాలు కల్పించడం జరుగుతుందని పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేట ప్రాంతంలో గల ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థుల కొరకు ఏర్పాటుచేసిన బస్సులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ లు రేఖ, జగతీ దేవి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఎం.పి. నిధుల నుండి 2 బస్సులు, డి.ఎం.ఎఫ్.టి. నిధుల నుండి 1 బస్సు మొత్తం 80 లక్షల రూపాయలతో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. దేశంలోని ఇతర ప్రాంతాల నుండి వచ్చి వైద్య విద్య అభ్యసిస్తున్నారని, వైద్య విద్య అనేది ప్రత్యేకమైనదని తెలిపారు. చదువుకోవడం అనేది ప్రతి ఒక్కరి హక్కు అని, ఉన్నత చదువులు అభ్యసించి ఆదర్శంగా నిలవాలని, ఉన్నత స్థాయిలో ప్రజలకు సేవ అందించడం బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధి కొరకు వచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవడం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు. గడిచిన 2 సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు తీసుకువచ్చి పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని రామగుండం, బెల్లంపల్లి, రేచిని ఇతర ప్రాంతాలలో ఓవర్ బ్రిడ్జిలు, ఇతర అభివృద్ధి కొరకు అనుమతులు పొంది పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. రైల్వే స్టేషన్లను ఆధునికరిస్తూ అనేక చర్యలు చేపట్టామని, మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో వందే భారత్ రైలు నిలుపడం ద్వారా రైల్వే శాఖకు ఈ ప్రాంతం నుంచి అధిక ఆదాయాన్ని సమకూర్చామని తెలిపారు. విద్యారంగాన్ని పటిష్టపరిచి అన్ని ప్రభుత్వ పాఠశాలలలో సకల సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన విద్యను అందిస్తామని తెలిపారు. మంచిర్యాల ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించామని, విద్యార్థులు ఏకాగ్రతతో, చిత్తశుద్ధితో చదివి దేశంలో మంచిర్యాల ప్రాంతానికి గుర్తింపు తీసుకురావాలని, ఇందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించి ప్రోత్సహిస్తామని తెలిపారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతాయని, తద్వారా చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని, విద్యార్థుల కొరకు త్వరలోనే స్పోర్ట్స్ కిట్లను అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్య కళాశాల కొరకు నూతన శాశ్వత భవనాన్ని ఏర్పాటు చేశామని, దాదాపు 1 వేయి మంది విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారని తెలిపారు. వైద్య విద్య కొరకు అవసరమైన తరగతి గదులు, ల్యాబ్, మెటీరియల్, ఫ్యాకల్టీ ఇతర అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించామని, విద్యార్థులకు అవసరమైన బస్సులను ప్రారంభించామని తెలిపారు. ఇటీవల వరుసగా జరిగిన పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల కారణంగా ఆలస్యం జరిగిందని అన్నారు. ప్రభుత్వం నుంచి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించామని, మంచిర్యాల జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మితమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రిని త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. వైద్య విద్య ఎంతో ఖర్చుతో కూడుకుందని, అర్హత గల విద్యార్థులకు ప్రభుత్వం విద్య అందిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వైద్య విద్యను పూర్తి చేసి సమాజానికి సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల హెచ్ఓడి శ్రీకాంత్, ఎడి తులసీదేవి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ విధానాలతో దళితుల మనుగడకు ముప్పు



- ఉద్యమించేందుకు దళితులు ఏకం కావాలి
- కాంగ్రెస్ ఎస్సీ సెల్ జాతీయ అధ్యక్షుడు రాజేంద్రపాల్ గౌతమ్

**కరీంనగర్, మార్చి 6 (ఉదయం ప్రతినిధి) :** భారతీయ జనతా పార్టీ అనుసరిస్తున్న దళిత వ్యతిరేక, అభివృద్ధి నిరోధక విధానాలను ఎండగడుతూ ఉద్యమించేందుకు దళితులంతా ఏకం కావాలని ఏఐసీసీ జాతీయ ఎస్సీ విభాగం అధ్యక్షుడు రాజేంద్ర పాల్ గౌతమ్ పిలుపునిచ్చారు. శుక్రవారం గాంధీ భవన్ లో టీపీసీసీ ఎస్సీ విభాగం చైర్మన్, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అధ్యక్షతన టీపీసీసీ ఎస్సీ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దళితులపై రాజకీయంగానే కాకుండా ఆధ్యాత్మిక పరంగానూ పెత్తనం చెలాయించాలని చూస్తున్నదని, ఈ కుట్రలను తిప్పి కొట్టకుంటే దళితుల మనుగడ ప్రశ్నార్థకమవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ పాలకులు పథకం ప్రకారమే దళితులనువిద్యకు దూరం చేస్తున్నారని, ఈ విధానాల ఫలితంగానే ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత విద్య వరకు విద్య దళితులకు, బడుగు బలహీనవర్గాలకు అందని ద్రాక్షగా తయారయిందని ఆయన విమర్శించారు. గత పన్నెండు సంవత్సరాలలో కేంద్ర బడ్జెట్‌లో విద్యకు కేవలం రెండు శాతం మాత్రమే నిధులు కేటాయిస్తుండటం వల్ల కేంద్ర ప్రభుత్వ విధానమేమిటో తేటతెల్లమవుతున్నదని ఆయన పేర్కొన్నారు. అందువల్లనే దళితులకు, బడుగు బలహీనవర్గాల పిల్లలకు స్కాలర్ షిప్పులు కూడా ఇవ్వడం లేదన్నారు. అంతేకాకుండా ప్రభుత్వరంగ విద్యా సంస్థలకు నిధులు ఇవ్వకుండా వాటిని నిర్వీర్యం చేస్తున్నారని, తద్వారా పిల్లలు విద్యకు దూరమై కూలీ పనులు చేసుకునే పరిస్థితి కల్పించాలని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

12న బాధ్యతల స్వీకరణ టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. ఈ నెల 12వ తేదీన గాంధీ భవన్‌లో టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం అనంతరం దళితులను సంఘటితం చేసి కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే దిశగా చర్యలు చేపడతామన్నారు. బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ తోపాటు దళిత సామాజిక వర్గానికి చెందిన మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, అన్ని దళిత సంఘాల నాయకులు హాజరవుతారని ఆయన వివరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, దళితులు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు. సమావేశంలో జాతీయ ఎస్సీ విభాగం సమన్వయకర్త శుక్లా, టీపీసీసీ ఉపాధ్యక్షుడు నమిండ్ల శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.ప్రీతం, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అచ్యుత్ రమేష్, టీపీసీసీ దళిత విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్షులు, ఉస్మానియా జాక్ నాయకులు పాల్గొన్నారు.



## పారిశుద్ధ్య డ్రైవ్‌లో భాగస్వాములు కావాలి

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- 99 రోజుల కార్యక్రమంపై అవగాహన

**ఖమ్మం, మార్చి 06 (ఉదయం జిల్లా ప్రతినిధి) :** గ్రామాలలో నూతనంగా గెలిచిన సర్పంచ్ లు, ప్రజాప్రతినిధులు మార్చి 6 నుంచి 15 వరకు జరిగే ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌లో భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పిలుపునిచ్చారు. శుక్రవారం రఘునాథపాలెం రైతువేదిక నందు మండల సర్పంచ్ లు, ప్రజా ప్రతినిధులు, గ్రామ కార్యదర్శులు, వివిధ శాఖల మండల అధికారులకు ప్రభుత్వం నిర్దేశించిన 99 రోజుల కార్యక్రమ అమలుపై నిర్వహించిన సన్నాహక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని అవగాహన కల్పించారు. అంతకుముందు రఘునాథపాలెం గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో చేపట్టిన పారిశుద్ధ్య పనులు, పరిసరాలలో చెత్త, పిచ్చిమొక్కల తొలగింపు పనులను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులు, ఫైల్స్ క్లియరింగ్, ఆన్‌లైన్ దరఖాస్తులను కలెక్టర్ తనిఖీ చేశారు. అనంతరం బస్తీ దవాఖానను సందర్శించి ఓపీ, మందుల నిల్వలు, గర్భిణి మహిళలకు అందించే సేవల వివరాల రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా కలిసి విజయవంతం చేయాలన్నారు. సర్పంచ్‌లు, వార్డుమెంబర్‌లు ప్రతిరోజు ఉదయం 6 గంటలకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పారిశుద్ధ్య సంబంధించి చేయాల్సిన పనులు పరిష్కరించాలని అన్నారు. గ్రామపరిధిలో పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేయాలని, ఏ ఫైల్ తిరస్కరించిన స్పష్టమైన కారణం ఫిర్యాదుదారులకు తెలియజేయాలని కలెక్టర్ అన్నారు. 99 రోజుల కార్యక్రమంలో చివరి వరకు ప్రజా ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు 99 రోజుల కార్యాచరణను ప్రణాళిక ప్రకారం అమలు చేయాలని, ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు అర్హులైన ప్రజల గడపకు చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని అన్నారు. పేదలకు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించడంతో పాటు భవిష్యత్తు ప్రణాళిక సిద్ధం చేసుకునే ఉద్దేశంతోనే ప్రభుత్వం 99 రోజుల కార్యాచరణ కార్యక్రమం చేపట్టిందన్నారు. గ్రామ పంచాయతీలకు పెద్ద ఎత్తున నిధులు వస్తున్నాయని, వీటిని సమర్థవంతంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని, ఆ నిధుల వినియోగం ఎలా జరుగుతుందో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అభివృద్ధి కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మార్చి 6 నుంచి మార్చి 15 వరకు పారిశుద్ధ్య నిర్వహణ, ఫైల్స్ క్లీయరెన్స్ ప్రాధాన్యతగా కార్యక్రమాలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. వార్డ్ మెంబర్ నుంచి సర్పంచ్, ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేస్తూ క్షేత్ర స్థాయిలో పర్యటించి ఎక్కడ పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలో ప్రణాళిక సిద్ధం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలందరికీ డిజిటల్ హెల్త్ కార్డులు



**హెల్త్ ప్రొఫైల్ తయారుకు కార్యాచరణ**
**కలెక్టర్ కోయ శ్రీ హర్ష**
**రాఘవపూర్ గ్రామంలో 99 రోజుల కార్యక్రమం**

**పెద్దపల్లి, మార్చి-06 (ఉదయం ప్రతినిధి) :** జిల్లాలోని స్వశక్తి మహిళా సంఘాలో ఉన్న మహిళలందరికీ హెల్త్ ప్రొఫైల్ తయారు చేసే దిశగా కార్యాచరణ అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శుక్రవారం పెద్దపల్లి మండలం రాఘవపూర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో 99 రోజుల కార్యక్రమం అమలు పై నిర్వహించిన సన్నాహక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలో ఇందిర మహిళా శక్తి క్రింద ఉన్న లక్షా 20 వేల మహిళల హెల్త్ చెకప్ చేస్తూ వారికి డిజిటల్ హెల్త్ కార్డులు అందించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని అన్నారు. మార్చి 6 నుంచి మార్చి 15 వరకు గ్రామం లో పారిశుధ్యం నిర్వహణ ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని, ప్రభుత్వ కార్యాలయాలు చాలా రోజులుగా పెండింగ్ ఉన్న ఫైల్స్ చేసేందుకు కూడా చర్యలు చేపట్టామని అన్నారు. ప్రజలు భాగస్వామ్యం ఐతే 99 రోజుల కార్యక్రమం విజయవంతం అవుతుందని, మన కార్యక్రమంగా భావించి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు మాట్లాడుతూ, మన ఆరోగ్యం బాగుంటే ఎలాగైనా బ్రతకవచ్చని అన్నారు. దేశ వ్యాప్తంగా కల్తీ ఆహారపు వాడకం వల్ల క్యాన్సర్ వ్యాప్తి పెరుగుతుందన్నారు. నూనె వాడకం తగ్గించాలని లేకపోతే గుండెలో హోల్ పడే అవకాశం కూడా ఉంటుందన్నారు. మన సమస్య తీవ్రం అయ్యే వరకు వేచి చూడవద్దని, మొదటి దశలో కేన్సర్ గుర్తిస్తే మెరుగైన చికిత్స వల్ల త్వరగా మనం ఆరోగ్యవంతులం కావచ్చని అన్నారు. వైద్య క్యాంపులో బిపి, షుగర్ గుర్తింపు పరీక్షలు కూడా నిర్వహిస్తున్నామని, షుగర్‌తో సర్వ రోగాలు వస్తాయని, దీనిని మంచి ఆహారపు అలవాట్లతో నియంత్రణలో పెట్టాలని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో రాఘవపూర్ సర్పంచ్ చామంతి పాల్గొన్నారు.

## పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో



99 రోజుల కార్యక్రమాన్ని అధికారులు ప్రజాప్రతినిధులు సంయుక్తంగా పనిచేస్తూ విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శుక్రవారం పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో 99 రోజుల కార్యక్రమం అమలు పై నిర్వహించిన సన్నాహక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, నూతనంగా గెలిచిన స్థానిక నాయకులకు ప్రజలలో మంచి పేరు సుస్థిరం చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని, మార్చి 6 నుంచి మార్చి 15 వరకు జరిగే ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ లో స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కౌన్సిలర్లకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పారిశుధ్య సంబంధించి చేయాల్సిన పనులు చైర్ పర్సన్ దృష్టికి తీసుకొని వస్తె వెంటనే వాటిని పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. మున్సిపల్ పరిధిలో పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేస్తామని, ఏ ఫైల్ తిరస్కరించిన స్పష్టమైన కారణం తెలియజేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. 99 రోజుల కార్యక్రమంలో చివరి వరకు ప్రజా ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొన్నాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, వైస్ చైర్ పర్సన్ ముస్కాన్ నాజ్ , పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



### కోదాడ – హుజూర్నగర్ ప్రజలే

# తమ బిడ్డలు

**అభివృద్ధి – సంక్షేమంలో దూసుకు పోతున్న మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి రెడి**

సూర్యాపేట ,మార్చి 6(వుదయం)

కోదాడ, హుజూర్నగర్ నియోజకవర్గాల ప్రజలను తమ బిడ్డలుగా భావిస్తూ వారి అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల మరియు నీటి పారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటికి పరిష్కారం చూపడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.రైతాంగానికి సాగునీరు అందించేందుకు నీటిపారుదల ప్రాజెక్టుల పనులు వేగవంతం చేస్తూ వ్యవసాయాన్ని సస్యశ్యామలం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా రెడ్లకుంట ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి రైతులకు నీటి సౌకర్యం కల్పించేందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు.ఇక కోదాడ నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధి, రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం వంటి రంగాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నారు. మహిళల ఆర్థిక సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించే చర్యలు తీసుకుంటున్నారు.ప్రజల సంక్షేమమే ధ్యేయంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి కలిసి పనిచేస్తుండటంతో కోదాడ, హుజూర్నగర్ నియోజకవర్గాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.అభివృద్ధి – సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటున్న ఈ నాయకత్వం ప్రాంతానికి భరోసాగా మారిందని పలువురు పేర్కొంటున్నారు.

### గ్రామానికి ప్రజా సేవ

# చేయడమే మా లక్ష్యం



సర్పంచ్ గారే సహేంద్ర బిక్షపతి ..

రాయపర్తి మార్చి 06 (వుదయం జిల్లా ప్రతినిధి) :

మండల కేంద్రంలోని గుబ్బడి తండా ప్రజలు వేసవిలో మంచినీటి కోసం ఇబ్బంది పడుతుండేవారు ఎన్నికల హామీ మా తండా వాసుల కోసం మంచినీటి బోరు వేయించాలని సర్పంచ్ ని కోరగా వేసవిని దృష్టిలో పెట్టుకొని మంచినీటి కోసం ఇబ్బంది పడకుండా ఉండాలని సర్పంచ్ గారే సహేంద్ర బిక్షపతి ఈ రోజు తండా లో బోరు పడాలని కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. బోరు వేయించగా నీరు పడడంతో తండా ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ సర్పంచ్ కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం లోఉప సర్పంచ్ మచ్చ రమేష్, పంచాయతీ కార్యదర్శి పల్లె వినోద్ , వార్డు మెంబర్లు గారే కళ్యాణి విష్ణు,బిల్ కలెక్టర్ మల్లయ్య, మాజీ ఉపసర్పంచ్ ఎండి మహమూద్ యూత్ మండల అధ్యక్షులు బొమ్మెర కళ్యాణ్ గౌడ్, రాయపర్తి యూత్ అధ్యక్షులు పిరని ప్రవీణ్ , తండా యూత్ అధ్యక్షులు గూగులోతు నరేందర్ నాయక్ ,తండా ప్రజలు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజాపాలన – ప్రగతికి సరికొత్త బాట

- 99 రోజుల కార్యాచరణతో సత్ఫలితాలు సాధించాలి
- రెవెన్యూ – అటవీ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

ఉమ్మడి ఖమ్మం జిల్లా సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి







ఖమ్మం ,మార్చి 6 (వుదయం)

ప్రజలకు మేలైన పాలన అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల ప్రత్యేక కార్యాచరణను విజయవంతం చేయాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా ఇన్–ఛార్జ్ మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా సన్నాహక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.... క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని దిశానిర్దేశం చేశారు.సాంకేతిక లోపాలు సరిదిద్ది.. బాధ్యతను నిర్ధారించాలి మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో గతంలో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణాల్లో చోటుచేసుకున్న లోపాలపై మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. కొన్ని ప్రాంతాల్లో సరైన లెవల్స్ లేకపోవడం వల్ల మురుగునీరు నిలిచిపోయి ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ విభాగం అధికారులు ప్రత్యేకంగా సమావేశమై, ఎక్కడైతే నీరు ఆగుతుందో ఆ ప్రాంతాలను గుర్తించి తక్షణమే సరిచేయాలని ఆదేశించారు. అవసరమైతే లోపభూయిష్టమైన నిర్మాణాలను తొలగించి, కొత్తగా నిర్మించాలని సూచించారు. ఏ అధికారి హయాంలో ఈ పొరపాట్లు జరిగాయో రికార్డుల్లో నమోదు చేసి, వారిని బాధ్యులను చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్లకు స్పష్టం చేశారు.అటవీ – రెవెన్యూ సరిహద్దు వివాదాలకు ముగింపుఉమ్మడి జిల్లాలో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న అటవీ మరియు రెవెన్యూ భూముల వివాదాలను పరిష్కరించేందుకు ఈ 99 రోజుల ప్రణాళికను వేదికగా చేసుకోవాలని మంత్రి సూచించారు. కొత్తగూడెం, సత్తుపల్లి, ఇల్లెందు, వైరా వంటి నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉందని, దీనివల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు.

కలెక్టర్లు, డి.ఎఫ్.ఓలు మరియు రెవెన్యూ యంత్రాంగం ఉమ్మడిగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, సరిహద్దులను ఖరారు చేయాలన్నారు. ఈ ప్రక్రియలో ఎక్కడా జాప్యం జరగకుండా నూటికి నూరు శాతం పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు.ప్రజాప్రతినిధులకు ప్రత్యేక శిక్షణ.. నిధుల వినియోగంకొత్తగా ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లు, మేయర్లు మరియు చైర్మన్లకు పాలనాపరమైన అంశాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు ఈ నెల 12న ఉమ్మడి జిల్లా స్థాయిలో ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మంత్రి ప్రకటించారు. అనుభవజ్ఞులైన అధికారులతో ఈ శిక్షణ ఇప్పించడం ద్వారా, గ్రామాల్లో నిధుల వినియోగంపై వారికి స్పష్టత వస్తుందన్నారు. ముఖ్యంగా గత రెండేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న పంచాయతీ నిధులు ఇప్పుడు విడుదలవుతున్నాయని, వాటిని గ్రామాభివృద్ధికి పారదర్శక పద్ధతిలో ఖర్చు చేసేలా విలేజ్ సెక్రటరీలతో కలిసి పని చేయాలని సూచించారు.సాగు పద్ధతుల్లో మార్పు.. రైతుల్లో చైతన్యంవ్యవసాయ రంగంలో రైతులు విచక్షణారహితంగా వాడుతున్న ఎరువులు, పురుగుమందుల ప్రభావం భూసారంపై పడుతోందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతి రైతుకూ భూసార పరీక్షలు, పంట మార్పిడి విధానంపై అవగాహన కల్పించాలన్నారు. అధికారులే నేరుగా రైతుల వద్దకు వెళ్లి ఆధునిక సాంకేతికతను వివరించాలని, అవసరమైతే ఇతర ప్రాంతాల్లోని ఆదర్శ సాగు పద్ధతులను పరిశీలించేందుకు ప్రభుత్వ ఖర్చుతో రైతులకు క్షేత్ర పర్యటనలు ఏర్పాటు చేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు.పార్టీలకు అతీతంగా ప్రజా సేవఎన్నికల సమయంలో రాజకీయాలు ఉన్నా, గెలిచిన తర్వాత ప్రజాప్రతినిధులందరూ ప్రజల కోసమే పని చేయాలని మంత్రి ఉద్ఘాటించారు. ఈ అభివృద్ధి ప్రణాళికలో అధికార, ప్రతిపక్ష పార్టీలనే భేదం లేకుండా అందరినీ భాగస్వాములను చేయాలన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో అధికారులు మరింత శ్రద్ధ వహించి ప్రభుత్వ ఆలోచనలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మరియు వివిధ శాఖల ఉన్నతాధికారులు, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్లు, చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.



### మల్లారం రైతు వేదికలో

## వెబినార్ ద్వారా రైతులకు అవగాహన

దమ్మపేట ,మార్చి 6 (వుదయం ప్రతినిధి)

కేంద్ర ప్రభుత్వం 2026–27 బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత వ్యవసాయ రంగానికి ఇచ్చే చేయూత గురించి రైతులకు వెబినార్ ద్వారా తెలియజేసారు.ఈ వెబినార్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ వున్నపంటలు సాగుచేయటం ద్వారా రైతులు లాభం పొందాలని సూచించారు. రసాయన రహిత పంటలు సాగు చేసి నేలలను కాపాడి సేంద్రియ ఉత్పత్తులను సాధించాలని ఆయన విజ్ఞప్తి చేసారు.

సెక్రటరీ స్థాయి అధికారులు మరియి శాస్త్రవేత్తలు వివిధ పథకాల గురించి వివరించారు.కొబ్బరి ప్రోత్సాహక పథకం జీడిమామిడి కోకో అభివృద్ధి పథకం బాదం, వాల్నట్, పైన్ నట్ ప్రోత్సాహ పథకం గంధం, అగార్ వుడ్ ప్రోత్సాహక పథకం ఫార్మర్స్ రిజిస్ట్రీ పంటల వైవిధ్దీకరణ మొదలైనకేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026 27 ఆర్థిక సంవత్సరం పథకాల గురించి వెబినార్ కార్యక్రమం మల్లారం రైతు వేదిక లో రైతులకు ప్రదర్శించబడింది. ఈ కార్యక్రమానికి సహాయ వ్యవసాయ సంచాలకులు రవి మరియు మండల వ్యవసాయ అధికారి చంద్ర శేఖర్ రెడ్డి, దీప్తి, అనుబాబు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### సైబర్ నేరాల పట్ల

# అప్రమత్తంగా ఉండాలి

వేంసురు ,మార్చి 6 (వుదయం ప్రతినిధి)




వేంసురు మండల పరిధిలోని చిన్న మల్లెల గ్రామంలో తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఖాతాదారులకు సైబర్ భద్రత మరియు బ్యాంకింగ్ సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ మాధవి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా బ్యాంకింగ్ సేవలను వినియోగించే సమయంలో ప్రతి ఒక్కరూ భద్రతా చర్యలు పాటించాలని సూచించారు. ఖాతాదారులు తమ ఖాతాలకు సంబంధించిన రీ – కేవైసీ మరియు సి – కేవైసీ ప్రక్రియలను సకాలంలో పూర్తి చేసుకోవాలని కోరారు. అలాగే అపరిచిత ఫోన్ నంబర్ల నుండి వచ్చే కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ తమ ఎటిఎం పిన్, ఓటీపీ లేదా బ్యాంక్ వివరాలను ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. సైబర్ నేరగాళ్లు రకరకాల పద్ధతుల్లో మోసాలు చేస్తున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి తమ సొమ్మును కాపాడుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా బ్యాంక్ రీజినల్ మేనేజర్ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ఇన్సూరెన్స్ చాలా అవసరమని తెలిపారు. అనుకోని ప్రమాదాలు లేదా అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడంలో యాక్సిడెంటల్ మరియు లైఫ్ ఇన్సూరెన్స్ పథకాలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. ప్రజలు బ్యాంకుల ద్వారా అందుబాటులో ఉన్న ఇన్సూరెన్స్ పథకాలను తీసుకోవడం ద్వారా తమ కుటుంబ భవిష్యత్తును భద్రపరుచుకోవచ్చని సూచించారు.అదేవిధంగా, కుక్కపల్లి పద్మావతి రోడ్డు ప్రమాదంలో పుట్రేల వద్ద మృతి చెందగా, ఆమెకు ఉన్న ఎస్బిఐ జనరల్ యాక్సిడెంటల్ డెత్ ఇన్సూరెన్స్ కింద మంజూరైన రూ.20 లక్షల చెక్కును బ్యాంక్ రీజినల్ మేనేజర్ ప్రసన్న కుమార్ చేతుల మీదుగా ఆమె నామినీ అయిన భర్త కుక్కపల్లి నరసింహారావు కి అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుక్కపల్లి కిరణ్, మాజీ సర్పంచ్ కుక్కపల్లి సుధాకర్, జయలక్ష్మీపురం సర్పంచ్ గడిపర్తి శ్రీనివాసరావు, శంభుని గూడెం సర్పంచ్ అరవపల్లి నరసింహారావు, బీసీ జేఏసీ తెలంగాణ కో–కన్వీనర్ నూనె హరిబాబు యాదవ్, గ్రామస్తులు, బ్యాంకు సిబ్బంది, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### వైద్య శిబిరాలను

# ప్రజలు వినియోగించుకోవాలి

**డిఎంహెచ్ఓ డాక్టర్ ఏ అప్పయ్య**

హనుమకొండ, మార్చి 06 (వుదయం జిల్లా ప్రతినిధి) :




తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మార్చి ఆరవ తేదీ నుండి జూన్ 12వ తేదీ వరకు నాలుగు దశలలో వైద్య శిబిరములు ,వ్యాధి నిర్ధారణ పరీక్షలు, అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్, సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం సన్నద్ధత ,అవగాహన కార్యక్రమాలు ,ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని హనుమకొండ డిఎంహెచ్వో డాక్టర్ ఏ అప్పయ్య తెలియజేశారు. మొదటి దశలో ఈనెల ఆరవ తేదీ నుండి 31 వరకు స్పెషలిస్ట్ వైద్యులచే నిర్వహిస్తున్న వైద్య శిబిరములను ప్రజలు వినియోగించుకోవాలని డిఎంహెచ్ఓ డాక్టర్ ఏ అప్పయ్య సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నిర్వహించే ఈ ప్రత్యేక వైద్య శిబిరములలో ఎంజీఎం ఆసుపత్రి మరియు ప్రసూతి ఆసుపత్రిల నుండి స్త్రీ వైద్య నిపుణులు ,పిల్లల వైద్య నిపుణులు , జనరల్ ఫిజీషియన్,కంటి వైద్య నిపుణులు ఎముకల వైద్య నిపుణులు ,జనరల్ ఫిజీషియన్ లు సేవలందిస్తారని అలాగే అవసరమైన అన్ని వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేయబడతాయని, ఆరోగ్యం పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అలాగే ఆర్బిఎస్కే బృందాల ద్వారా రెసిడెన్షియల్ పాఠశాలలలో వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులకు చెందిన స్పెషలిస్ట్ పిల్లల వైద్య నిపుణులు ,కంటి వైద్య నిపుణులు ,దంత వైద్య నిపుణులు, విద్యార్థులకు బాలికల రెసిడెన్షియల్ విద్యా సంస్థలలో వీరితోపాటు స్త్రీ వైద్య నిపుణులు వైద్య పరీక్షలు , అవగాహన కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా సిపిఆర్ పై అవగాహన కలిగించారు. అయినవోలులో పి హెచ్ సి లో నిర్వహించిన మొదటి వైద్య శిబిరం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రారంభించారు.గౌరవ జిల్లా కలెక్టర్ గారి సూచనలకు అనుగుణంగా 7 న కడిపికొండ పిహెచ్సీ లో,9 న కమలాపూర్,10 న కొండపర్తి,11 న ముల్కనూర్,12 న శాయంపేట,13 న సిద్దాపూర్,14 న ఉప్పల్,16 న వేలేరు,17 న దామెర,18న హసన్పర్తి 20 న వంగర ,23 న రాయపర్తి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఈ వైద్య శిబిరంలునిర్వహించబడతాయన్నారు. అలాగే పట్టణ పరిధిలో 24 న బోడగుట్ట లో 25 న లష్కర్ సింగారం ,26 న పెద్దమ్మ గడ్డ 28 న పోచమ్మ కుంట ,శాయంపేట30 న సోమిడి మరియు వడ్డేపల్లి,31 న తిరిగి పోచమ్మ కుంట ,వడ్డేపల్లిలో ఈ ప్రత్యేక వైద్య శిబిరంలు నిర్వహించబడతాయి . మహిళ సమాఖ్యలకు చెందిన సభ్యులకు 30 రకాల నిర్ధారణ పరీక్షలు కూడా జరుపబడతాయని

కావున సంబంధిత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు

# బాధ్యతల స్వీకరణ

## పరకాల మున్సిపాలిటీ నూతన పాలక మండలి బాధ్యతల స్వీకరణ

- కాంగ్రెస్ పార్టీతోనే పరకాల అభివృద్ధి సాధ్యం.
- చైర్మన్ పాలకమండలి సభ్యులను సన్మానించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి.



పరకాల ,మార్చి 6 (వుదయం ప్రతినిధి):

శుక్రవారం పరకాల పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో పరకాల మున్సిపాలిటీ నూతన పాలక మండలి బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి హాజరై, ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్ మరియు పాలక మండలి సభ్యులకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. అనంతరం శాలువాతో కౌన్సిలర్లను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...పరకాల పట్టణ అభివృద్ధి ప్రజల ఆశయాలను నెరవేర్చే విధంగా పాలక మండలి పని చేయాలి అన్నారు.పరకాల పట్టణాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసే దిశగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు మున్సిపాలిటీ పాలక మండలి కృషి చేయాలని కోరారు.పరకాల పట్టణ అభివృద్ధికి నూతన కౌన్సిలర్లు మరియు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

## మంత్రి జూపల్లిని కలిసిన కంది శ్రీనివాస రెడ్డి



ఆదిలాబాద్ మార్చి 6(వుదయం ప్రతినిధి )

ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన తెలంగాణ రాష్ట్ర టూరిజం ,ఎక్సైజ్ అండ్ ప్రోహిబిషన్, జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు కు ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ఘన స్వాగతం పలికారు. శుక్రవారం పట్టణంలోని పెన్ గంగా అతిథి గృహం వద్ద పార్టీ శ్రేణులతో కలిసి పుష్ప గుచ్చమందించి స్వాగతించారు.శాల ువాలతో సత్కరించారు.నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులపై చర్చించారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక పకడ్బందీగా సిద్ధం

## మున్సిపల్ చైర్ పర్సన్ పాలకుర్తి సారంగ పాణి..

వర్ధన్నపేట వుదయం ప్రతినిధి:




వర్ధన్నపేట మున్సిపల్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో ఆదర్శ మున్సిపాలిటీగా ఎమ్మెల్యే నాగరాజు సహకారంతో అభివృద్ధి చేస్తానని మున్సిపల్ చైర్ పర్సన్ పాలకుర్తి సారంగపాణి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్ధన్నపేట మున్సిపాలిటీలో ఉన్న 12 వార్డులలో ఉన్న సైడ్ కాలువలు శుభ్రం చేయడం, ముళ్ళ పొదలను తొలగించడం, రోడ్లను శుభ్రం చేయడం, దోమల నివారణ కోసం ఫాగ్గింగ్ చేయడం, మంచి నీటి సరఫరా మరియు విద్యుత్ దీపాలు సమస్యలను ప్రగతి ప్రణాళిక లో పరిష్కరించడం కోసం వార్డు కౌన్సిలర్ కు , వార్డు అధికారులతో మున్సిపల్ చైర్ పర్సన్ పాలకుర్తి సారంగపాణి సమావేశం ఏర్పాటు చేసి సమావేశం అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమీషనర్ ఇమ్మడి సుధీర్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ నేతవత్ శిభారాణి, వార్డు కౌన్సిలర్లు బెజ్జం పాపారావు, బానోతు జ్యోతి, నునవత్ కమిలి, మాలోతు దేవేందర్, చిలువేరు రమ, తుమ్మల అరుణ, తిరుపతి వాణి, సెక్షన్ అధికారులు ,వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అయితే ఇసుక...కాకపోతే మొరం

## ఓ పార్టీ అధ్యక్షుని అండదండలు –అధికారుల చేతివాటం

నారాయణపేట మార్చి 6(వుదయం ప్రతినిధి )

అయితే ఇసుక కాకపోతే మొరం అన్న చందనంతో నారాయణపేట జిల్లాలోని టిప్పర్ యజమానులు ఓ పార్టీ అధ్యక్షుని అండ దండలతో అధికారుల చేతివాటం తడుపుతూ విచ్చలవిడిగా ఇసుక మొరం తరలిస్తున్న ఎవరు పట్టించుకోని సంఘటనలు మాగనూర్ నుండి కొడంగల్ నియోజకవర్గం వరకు సంఘటనలు చీకటిలో కొనసాగుతున్నాయి. ఇంత జరుగుతున్న అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అధికారులు ఒక టిప్పర్ ఇసుక లేదా మొరం లోడ్ కు అనుమతి ఇస్తే టిప్పర్ యజమానులు మాత్రం ఒక్కొక్కరు 8 ట్రిప్పుల చొప్పున రాత్రి వేళల్లో కొనసాగిస్తున్నారు. అధికారులు ఎవరైనా టిప్పర్ లోడ్ ను పట్టుకుంటే యజమానులు మాత్రం పదే పదే అదే అనుమతిని చూపిస్తూ వారి వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారు. అదే అనుమతిని మూడోసారి చూపిస్తే అనుమానం వచ్చి సంబంధిత అధికారులు పట్టుకుంటే ఓ పార్టీ అధ్యక్షుని ఫోన్ పట్టుకున్న అధికారికి రావడంతో వెంటనే ఆ టిప్పర్ ను వదిలి వేస్తున్న సంఘటనలు ఇక్కడ జరుగుతున్నాయి. శనివారం సాయంత్రం నుండి ఆదివారం సెలవు కావడంతో సోమవారం ఉదయం వరకు ఈ ఇసుక వ్యాపారం కొనసాగుతున్నాయి. దీనితో టిప్పర్ యజమానులు ఇసుకను మాగనూర్ వాగు నుండి మక్తల్ ,ఉట్కూర్, నారాయణపేట ,దామరగిద్ద, మద్దూరు వరకు ఇసుకను తరలిస్తున్న సంఘటనలు జరుగుతున్నాయి. ఇలా ఆ పార్టీ అధ్యక్షుని అండ దండలతో అధికారుల చేతివాటం తడుపుతూ టిప్పర్ యజమానులు ఇసుక కాకపోతే మొరం ను మూడు పువ్వులు ఆరు కాయలుగా అమ్ముకుంటూ తమ వ్యాపారాన్ని యదేచ్ఛగా కొనసాగిస్తున్నారు.



# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక సిద్ధం

**కాజీపేట, వుదయం:**



కమీషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్, హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా 06 నుండి 15 వరకు పది రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమాన్ని శుక్రవారం కళాశాలలో ప్రారంభించారు. ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం కళాశాల పరిపాలన వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడం, రికార్డులను సక్రమంగా నవీకరించడం, క్యాంపస్ అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టారు.ఈ పది రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వివిధ కమిటీల నిర్మాణం, కార్యాలయరికార్డుల అప్డేట్, స్టాక్ వెరిఫికేషన్, గ్రీన్ క్యాంపస్ అభివృద్ధి చర్యలు, కళాశాల భవనాల మరమ్మతులు వంటి కార్యక్రమాలను చేపట్టనున్నారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల క్యాంపస్‌ను పరిశీలిస్తూ ఇన్స్పెక్షన్ నిర్వహించి, వివిధ బాధ్యతల కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది రోజుల యాక్షన్ ప్లాన్‌ను ప్రతి విభాగం బాధ్యతగా తీసుకుని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కళాశాల క్యాంపస్‌ను పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది అందరూ కలిసి పనిచేస్తే కళాశాల అభివృద్ధి మరింత వేగంగా సాధ్యమవుతుందని తెలిపారు.మొదటి రోజు కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రాంగణాన్ని శుభ్రపరిచే కార్యక్రమం నిర్వహించారు. క్యాంపస్ పరిశుభ్రత, పచ్చదనం పెంపు లక్ష్యంగా విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా.జి. సుహాసిని, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డా. సురేష్ బాబు, అకడమిక్ కోఆర్డినేటర్ డా. ఎం. అరుణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు ఈ. కవిత, రామా రత్నమాల, డా. వి. మమత, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మహిళలకు సైబర్, ఫ్రాడ్ ఆర్థిక నేరాలపై అవగాహన



**వరంగల్ క్రైం, వుదయం:**

వరంగల్ పోలీస్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు సిసిపిఎస్ ఎసిపి కలకోట గిరి కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై బి. శివకుమార్ హెడ్ కానిస్టేబుల్ పి. శ్రీనివాస్, శివకుమార్ కానిస్టేబుల్ సంయుక్తంగా ప్రపంచ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళలను సైబర్ నేరాలపై అవగాహన కల్పించడం కొరకు సెల్ఫోన్లో సోషల్ మీడియా ద్వారా మరియు హోం జాబ్ పేరుమీద ఫేక్ అకౌంట్లో ద్వారా మరియు ఫేక్ వాట్సాప్ ద్వారా జరుగుచున్న నేరాలను నిరోధించడం, వారికి అవగాహన కల్పించడం కొరకు చెన్నై షాపింగ్ మాల్ లో సుమారుగా 75 మంది మహిళలకు సైబర్ నేరాలు, ఫ్రాడ్ ఆర్థిక నేరాలపై అవగాహన కల్పించారు.

# వృద్ధులకు మంచాలు పంపిణీ.!

**వరంగల్, వుదయం:**



రోటరీక్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ డిస్టిక్ 3150 మాదురి గణేష్అధ్యక్షుల ఆధ్వర్యంలో మూడవ డివిజన్ ములుగు రోడ్డు స్వయంకృషి మహిళ సొసైటీ వృద్ధాశ్రమంలో వృద్ధులు ముసలి వారు నేలపై పడుకుంటున్నారని తెలిసి వారికి 16 మంచములు దాదాపు లక్ష రూపాయల వ్యయంతో దాతల సహకారంతో రోటరీ క్లబ్ వరంగల్ సెంట్రల్ వారు అందజేయడం జరిగింది రోటరీ క్లబ్ వరంగల్ సెంట్రల్ అధ్యక్షులు మదూరు గణేష్ మాట్లాడుతూ వరల్డ్ వైడ్40 వేల క్లబ్బులు కొన్ని లక్షల మంది సభ్యులతో మా స్వంత ఖర్చులతో సేవ చేసే కార్యక్రమంలో మేము ముందంజలో ఉంటామని ఎనిమిది నెలలలో దాదాపుగా 10 లక్షల రూపాయల వ్యయంతో కుట్టు మిషన్లు పేదలకు సైకిల్ వాటర్ ప్లాంట్ ఫ్రిడ్జ్ మరియు వాటర్ కూలర్ హాస్పిటల్లో ప్రోటీన్ పౌడర్లు ఉచితంగా పంపిణీ కార్యక్రమాలు నిర్వహించినము వీరికి మెడికల్ గా ఏ అవసరం వచ్చిన దేవ మహేందర్ వారి కుమారులు డాక్టర్ విశాల్ రాజ్ (జనరల్ మెడిసిన్) సాహస రాజా దేవ హాస్పిటల్ jpn రోడ్డు వారు అందుబాటులో ఉండి ఉచితంగా వారికి సర్వీస్ చేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో సెక్రటరీ పొన్న హరినాథ్ కోశాధికారి బండారు కుమారస్వామి రోటరీ క్లబ్ ముఖ్య నాయకులు తోట సంపత్ కుమార్ బేతి అశోక్ బాబు,జూలూరి కృష్ణమూర్తి, వద్నాల సదానందం దేవ మహేందర్ పోరండ్ల రత్నాకర్ నాయిని అనిల్, కిరణ్, బేతి రాజేందర్, వేణు స్వయంకృషి సేవ సొసైటీ వారు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## గ్రామలలో స్వచ్ఛత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

**యాదాద్రి భువనగిరి, వుదయం:**



గ్రామలలో స్వచ్ఛత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మోటకొండూరు మండల కేంద్రంలో నూతన పెట్రోల్ బంక్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా బంక్ యజమాని, సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బుడిగా జంగల కాలనీలో జంగలలకు సంబంధించిన కార్యాలయాన్ని ప్రారంభించి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం బీర్ల ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన వైకుంఠ రథాన్ని ప్రారంభించారు. మోటకొండూరు గ్రామ పంచాయతీ ఆవరణంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని ప్రారంభించి గ్రామంలో స్వచ్ఛత, పరిశుభ్రతతో పాటు ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో అధికారులు ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, మాజీ మండలాధ్యక్షులు కాలుగు బాలరాజు గౌడ్, రాజాపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేందర్ గౌడ్, ఎంపీడీవో ఇందిరా, డిప్యూటీ తాహసిల్దార్ జయలక్ష్మి , మండల పార్టీ అధ్యక్షులు గంగపురం మల్లేష్, మహిళా మండల అధ్యక్షురాలు బోయిని ఝాన్సీ, సర్పంచ్ భూమండ్ల జయమ్మ శ్రీనివాస్, ఉప సర్పంచ్ వంగాల నికిత మహేందర్ గౌడ్, కాంగ్రెస్ జిల్లా నాయకులు నెమ్మని సుబ్రమణ్యం, ఉస్మానియా ఉద్యమకారుడు కంకల ఎలందర్, గ్రామశాఖ అధ్యక్షులు బుగ్గ కొమురయ్య, మండల సేవాదళ్ అధ్యక్షులు జలతార్ రాజు యాదవ్, వివిధ గ్రామాల సర్పంచులు బోట్ల నగేష్, బుడిగే బాలరాజు గౌడ్, వాకిటి లింగారెడ్డి, స్వామి, సరిత మచ్చేందర్, ఉప సర్పంచ్ ఏనుగు అంజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు శశిధర్ రెడ్డి, బొల్లేపల్లి శ్రీనివాస్, వంగాల మల్లేష్, బోట్ల సంజీవ, పంతంగి ఉదయ్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చట్ట పరిధిలో తమ దినచర్యను కొనసాగించాలి

### బాలాజీ కళాశాలలో లీగల్ అవేర్నెస్ క్యాంపు నిర్వహించిన తాలూకా లీగల్ సర్వీసెస్ అథారిటీ

**నర్సంపేట, వుదయం**



నర్సంపేట మండలంలోని బిట్స్ కాలేజీలో నర్సంపేట తాలూకా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో లీగల్ అవేర్నెస్ ప్రోగ్రాం ని నిర్వహించినారు. ఈ సమావేశం కాలేజీ హెచ్ఓడి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన న్యాయవాదులు దొంతి సాంబయ్య, మోటూరి రవి, టి సునీత, ఏ సుధీర్, జీ కిరణ్ లు మాట్లాడుతూ ఈరోజుల్లో విద్యార్థులు తప్పుడు వ్యసనాలకు అలవాటు పడి కొన్ని కొన్ని కేసులలో ఇన్వాల్వ్ అవుతున్నారని అట్టి కేసులకు విద్యార్థులు దూరంగా ఉండి వారి బంగారు భవిష్యత్తును కాపాడుకోవాలని తెలిపారు. ఎక్కువగా సైబర్ క్రైమ్స్, డ్రంక్ అండ్ డ్రైవ్ అదే విధంగా మత్తు పానీయాలకు అలవాటు పడుతూ తమ జీవితాలను అన్యాయం చేసుకుంటున్నారని తెలిపారు. కొన్ని కొన్ని సందర్భాలలో తెలిసో తెలియకో తప్పులు చేసి ఫోక్సో కేసులలో కూడా ఇన్వాల్వ్ అవుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఒకసారి ఒక విద్యార్థి మీద కేసు నమోదు అయితే అది తనను తనతో పాటు తన కుటుంబాన్ని మొత్తం ఇబ్బందులకు గురి చేస్తుందని కాబట్టి విద్యార్థులు చట్టపరంగా చట్ట పరిధిలో జీవించి మంచి భారత పౌరులుగా ఎదగాలని ఈ సమాజానికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలేజీ యజమాన్యం, లీగల్ సర్వీస్ అథారిటీ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థుల ఎంపిక



**కరీంనగర్, వుదయం:**

ఆర్చరీ క్రీడ ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిన క్రీడని, క్రీడల ద్వారా విద్యార్థులకు జ్ఞాపకశక్తితో పాటు ఏకాగ్రత అభివృద్ధి చెందుతుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. కొత్తపల్లి లోని అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకుఎంపికైన సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక అభినందన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వలన విద్యార్థులకు మానసిక ఉల్లాసంతో పాటు ఒత్తిడి నుండి ఉపశమనం లభించడం జరుగుతుందన్నారు.క్రీడల యొక్క ప్రాముఖ్యత దృష్టిలో పెట్టుకొని అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు వివిధ రకాల క్రీడల పోటీలను నిర్వహించడం జరుగుతుందని, వివిధ స్థాయిలలో నిర్వహింపబడే పోటీలకు సైతం ఎంపిక చేస్తూ వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీస్తున్నామని చెప్పారు. అసోసియేషన్ వారు నిర్వహించి జిల్లా స్థాయి పోటీలలో పాఠశాలకు చెందిన డి.సుదీక్ష 9వ తరగతి, కె.లిశిత అక్షయ, 8వ తరగతి, జి.శ్రీహరినాథ్, 8వ తరగతి, డి.శ్రినిత్య, 4వ తరగతి అత్యుత్తమ ప్రతిభను కనబరిచి త్వరలో నిర్వహించబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవ్వడం చాలా హర్షించదగ్గ విషయమన్నారు. ఎంపికైన విద్యార్థులకు పుష్పగుచ్చాలను అందజేసి రాష్ట్రస్థాయిలోనూ అసమాన ప్రతిభను కొనసాగించి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భారీగా పటిక, బెల్లం నాటు సారా పట్టివేత

### ఎక్సైజ్ సీఐ నరేష్ రెడ్డి ఆధ్వర్యంలో ముత్తోజిపేటలో దాడి

*100 కేజీల బెల్లం 300 కేజీల పట్టిక ఐదు లీటర్ల నాటు సారా పట్టివేత*

**నర్సంపేట, వుదయం**



నర్సంపేట ఎక్సైజ్ సీఐ నరేష్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ నర్సంపేట పరిధిలో నాటుసారా నియంత్రణ కొరకు ప్రత్యేకంగా రూపొందించిన కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా విస్తృత తనిఖీలను చేపట్టడం జరిగింది. ఇందులో భాగంగా నాటుసారా తయారీకి ఉపయోగించే ముడి పదార్థాల రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ముడి పదార్థాల రవాణా చేస్తున్నారని ఖచ్చితమైన సమాచారంతో నర్సంపేట మండలం ముత్తోజి పేట వద్ద వాహన తనిఖీలు నిర్వహించగా నల్లబెల్లి మండలం బుచ్చిరెడ్డి పల్లెకు చెందిన బానోతు రాజన్న (టీక్య ) తండ్రి వీరన్న అనే వ్యక్తి బెల్లం, పట్టిక ను కారులో రవాణా చేస్తూ అధికారులకు పట్టుపడినట్టు ఎక్సైజ్ సిఐ నరేష్ రెడ్డి తెలిపారు. అతని వద్ద నుండి 300 కేజీల పట్టిక, 100 కేజీల బెల్లం, ఐదు లీటర్ల నాటుసార, టాటా విస్టా కారు, ఒక మొబైల్ ఫోన్ సీజ్ చేసినట్టు తెలిపారు. ఈ తనిఖీలలో నర్సంపేట ఎక్సైజ్ నరేష్ రెడ్డి, ఎస్సై శార్వాణి, సిబ్బంది పాల్గొన్నారు.

# కౌమారులలో పెంపొందించవలసిన జీవన నైపుణ్యాలు..సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ రామారావు

**రాయపర్తి, వుదయం:**




పి ఎం శ్రీ జెడ్పిహెచ్ఎస్ కొండూరు పాఠశాలలో జెండర్ ఈక్విటీ లింగ సమానత్వం కౌమారదశలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు సవాళ్లను ఎదుర్కోవడం ఎలా అనే అంశంపై ప్రేరణాత్మక సందేశం కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయిని కొనతం పద్మలత అధ్యక్షతన పోలీస్ శాఖలో సిటీ స్పెషల్ బ్రాంచ్ లో సబ్ ఇన్స్పెక్టర్ గా పనిచేస్తూ పోలీస్ శాఖ వారి జాగృతి కళాబృందం వ్యవస్థాపకులు సామాజిక సమస్యలపై ప్రజల్లో ఎన్నో వేల కార్యక్రమాల పాటల ద్వారా చైతన్యం కలిగించిన రావెళ్ళ రామారావు చే నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కౌమార దశలో పిల్లల నుండి పెద్దల దశకుమారే ముఖ్యమైన సమయంలో విద్యార్థులు చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తూ జీవితాన్ని చక్కటి మార్గంలో మలుచు కోవాలని సూచించారు. సెల్ ఫోన్ తో ఈ రోజులలో చాలా మోసాలు, చెడు జరుగుతున్నాయి. సెల్ఫోన్ ను ఎలా నైనా ఉపయోగించుకోవచ్చు వాటిని మన అభివృద్ధికి దోహదపడే విధంగా వాడుకోవాలి కానీ సోషల్ మీడియా ఫేస్బుక్లని ఇన్స్టాగ్రామ్ అని రీ ల్స్ అని వీడియో గేమ్స్ అని మొదలగు వాటికి ఉపయోగించి సమయాన్ని వృధా చేసుకోవద్దని సూచించారు. గ్రామీణ వాతావరణంలో తల్లిదండ్రులు ఎంతో కష్టపడి అహరహం కష్టించి వారి పిల్లలు వృద్ధిలోకి రావాలని ఆశపడితే విద్యార్థులు చెడు మార్గంలో ప్రయాణించి తల్లిదండ్రులు తలదిం చుకునే విధంగా వ్యవహరించ వలదని సూచించారు. ఎంత కష్టం వచ్చినా ధైర్యంగా ఎదుర్కోవాలి కానీ చిన్న చిన్న కష్టా లకు కృంగిపోయి ఆత్మహత్యలు చేసుకోవద్దని సూచించారు.ఈనాడు మనం పెద్దపెద్ద మేధావులు అనుకునేటువంటి వాళ్ళు ఒకనాడు ఓడి గెలిచిన వారే అని తెలుపుతూప్రేరణాత్మకమైనటువంటి సందేశం ఇచ్చారు తల్లి తండ్రి గురువు లను గౌరవిస్తూ నైతిక విలువలు పెంపొందించుకొని దేశం గర్వపడే విధంగా భావిభారత పౌరులుగా తయారు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామ్మెడ్డి వివిఆర్ ఆచార్య శ్యాంసుందర్ శ్రీదేవి అనితరాణి నాగరాజు ఉషారాణి శివకృష్ణ రాజు వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుని కుటుంబానికి పి ఆర్ టి యు టి ఎస్ సంఘం ఆర్థిక చేయూత

**పరకాల, వుదయం:**



కొత్తపల్లి గోరి మండలం దామరంచపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (సోషల్)గా పని చేస్తూ ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన సీనియర్ (PRTUTS) పి ఆర్ టి యు టి ఎస్ సభ్యుడు దొమ్మటి ప్రసంగి కుటుంబాన్ని ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు పింగిలి శ్రీపాల్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు.దశదిన కర్మ సందర్భంగా పరకాలలోని వారి స్వగృహాన్ని సందర్శించిన ఆయన మృతునికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం టి ఆర్ టి యు టి ఎస్ సంఘం తరపున ఒక లక్ష రూపాయల ఆర్థిక సహాయ చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ (PRTUTS) సభ్యత్వం ఒక రక్షణ కవచం లాంటిదని, సభ్యులు సేవలో ఉన్నంతకాలం మాత్రమే కాకుండా, వారి మరణానంతరం కూడా సంఘం కుటుంబాలకు అండగా నిలుస్తుందని తెలిపారు. దొమ్మటి ప్రసంగి కుటుంబానికి రావలసిన డెత్ గ్రాట్యుటీతో పాటు ఇతర అన్ని ఆర్థిక ప్రయోజనాలు త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామని, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించే దిశగా తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం కారుణ్య నియామకం కింద రెండు నెలల్లోపు ఉద్యోగం వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో PRTUTS పి ఆర్ టి యు టి స్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు రేగూరి సుభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్ కుమార్ మాట్లాడుతూ దొమ్మటి ప్రసంగి 30 సంవత్సరాలుగా ఉపాధ్యునిగా రిసోర్స్ పర్సన్ గా, సంఘంలో క్రియాశీల సభ్యునిగా చేసిన సేవలు మరవలేనివి అని, ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దడంలో అంకిత భావంతో సేవలందించారు అని,ఘనపురం, మొగుళ్ళపల్లి, రేగొండ, కొత్తపల్లి గోరి, పరకాల మండలంలో ఎనలేని సేవ చేశాడని, మృతుని కుటుంబానికి సంఘం అన్ని విధాలుగా అండగా ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో PRTU హనుమకొండ జిల్లా అధ్యక్షులు మందల తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి పాలిత శ్రీహరి, రేగొండ మండల అధ్యక్షులు దుస్స సదాకర్, ప్రధాన కార్యదర్శి మంతెన విజయ్ కుమార్, జిల్లా మరియు రాష్ట్ర నాయకులు విజయభాస్కర్, పోలు నాగరాజు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మొడెం రాజేంద్ర బాబు, పరకాల మండల అధ్యక్షులు దగ్గు తిరుపతి రావు, చిలువేరు సురేందర్, దొమ్మటి భద్రయ్య, దొమ్మటి శంకరయ్య, దొమ్మరి సారయ్య, పసుల నర్సయ్యతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# దోనూర్‌లో ప్రజా పాలన కార్యక్రమం



**ధర్మపురి, వుదయం:**

మండలంలోని దోనూర్ గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా సర్పంచ్ దాసరి.పురుషోత్తం ఆధ్వర్యంలో గ్రామ పరిశుభ్రత కార్యక్రమం శుక్రవారం నిర్వహించగా ముఖ్య అతిథిగా ఎంఈఓ సీతాలక్ష్మీ పాల్గొన్నారు. గ్రామంలోని వీధులు, ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రపరిచే కార్యక్రమాన్ని చేపట్టడంతో పాటు ప్రజలు, విద్యార్థులు,ప్రజాప్రతినిధులు, గ్రామస్థాయి అధికారులు కలిసి ర్యాలీ నిర్వహించారు.అనంతరం మానవ హారం ఏర్పాటు చేసి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచు తామని ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ దాసరి పురుషోత్తం మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమాన్ని గ్రామస్థాయికి తీసుకెళ్లి ప్రతి వీధి,ప్రతి ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకో వాలని పిలుపునిచ్చారు. చెట్లు నాటి పచ్చదనాన్ని కాపాడాలని, ప్రజలు, విద్యార్థులు, యువత, ఉద్యోగులు, చిన్న వ్యాపారస్తులు అందరూ కలిసి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని సూచించారు.ఈకార్యక్రమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ సంగ. నర్సింహులు, ఉపసర్పంచ్ చిరుత ప్రభాకర్, పంచాయతి సెక్రటరీ నలువాల ముత్యం, వార్డు సభ్యులు చిరుత మల్లేశం, కొత్తపెల్లి ఆశయ్య, రామడగు జగన్, కళ్యాడాపు అమృత, బుద్దుల శ్రీలత, గొట్టం ప్రణయ్, కండ్లె ధర్మక్క, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# రాయపట్నంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సమావేశం

### పాఠశాల, అంగన్వాడి భవనాల పరిశీలన మధ్యాహ్న భోజనంపై అధికారులు ఆరా

**ధర్మపురి, వుదయం:**



మండలంలోని రాయపట్నం గ్రామ పరిధిలో తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శుక్రవారం సన్నాహక సమావేశం నిర్వహించారు.ఎంపీడీవో రవీందర్,గ్రామపంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ రాందేని మొగిలి అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గ్రామ పాలకవర్గ సభ్యులు, మండల అధికారులు హాజరై గ్రామంలోని వివిధ సమస్యలపై చర్చించారు.అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల నూతనం గా నిర్మిస్తున్న అంగన్వాడి భవనా న్ని పరిశీలించారు.ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని కూడా పరిశీలించారు.విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో తగిన పౌష్టికాహారం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామ సర్పం చ్,ఎంపీడీవో సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చిలుక రామన్న, గ్రామవార్డు సభ్యులు గటికే కమలాకర్, తనుగుల తిరుపతి, ముక్కెర అంజి, ముక్కెర కుమార్, అప్పని తిరుపతి, గోపతి వెంకటేశ్వర్లు, గొర్ల.సురేష్, గొల్ల.రఘు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# తుమ్మలపల్లిలో మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

**చండూరు, వుదయం**

చండూరు మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన ఆక ఇందిరమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలిసిన వెంటనే స్థానిక నాయకుడు ఎత్తపు మధుసూదన్ రావు మృతురాలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కుటుంబానికి ధైర్యం చెప్పి, వారి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు. మృతురాలి కుటుంబానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కుటుంబాన్ని పరామర్శించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ ఉపాధ్యక్షుడు కురుపాటి సుదర్శన్, 5వ వార్డు సభ్యుడు భూతరాజు పరమేష్, 4వ వార్డు సభ్యుడు కాశమళ్ళ శ్రీనివాసరావు, 8వ వార్డు సభ్యుడు కురుపాటి సురేష్, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ నాయకుడు అద్దంకి కిరణ్, సీనియర్ నాయకులు గజ్జెల రాంరెడ్డి, మాజీ అధ్యక్షుడు జక్కలి రాములు, దాసరి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# వ్యర్థాలతో కంపోస్ట్ తయారు చేసి మొక్కలకు వినియోగించాలి : కమిషనర్ అశ్రిత్ కుమార్

**వుదయం - సిద్దిపేట**



వ్యర్థాలతో కంపోస్ట్ తయారు చేసి మొక్కలకు వినియోగించాలని సూచిస్తూ పట్టణ పరిశుభ్రతకు అందరూ సహకరించాలని కమిషనర్ అశ్రిత్ కుమార్అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ కార్యక్రమంలో కమిషనర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో కలిసి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ప్రతిజ్ఞ చేశారు. ఎన్ ఎస్ ఎస్, ఎన్ సీసీ విద్యార్థులు స్వచ్ఛంద కార్యక్రమాల్లో పాల్గొని ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై దుకాణ దారుల కు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులు షాపింగ్‌కు వెళ్తప్పుడు బట్ట సంచులు, టిఫిన్ బాక్సు లు ఉప యోగించాల ని తెలిపారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, వైస్ ప్రిన్సిపాల్ అయోధ్య రెడ్డి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# రంగనాయక సాగర్ నుంచి తాపస్‌పల్లి రిజర్వాయర్‌కు నీటి అనుసంధానాన్ని నిలిపివేయాలి : రైతులు, బీఆర్ఎస్ నేతలు

**వుదయం - సిద్దిపేట**



కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా రంగనాయక సాగర్ కుడి కాలువఎల్ డి – 10 నుంచి కమలాయిపల్లి శివారు వద్ద తాపస్‌పల్లి రిజర్వాయర్‌కు చెందిన డి3 కాలువకు నీటిని అనుసంధానం చేసే ప్రయత్నాలను వెంటనే నిలిపివేయాలని నంగునూర్మండల రైతులు, బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగం గౌడ్ ఆధ్వర్యంలో రైతులు సిద్దిపేట ఇరిగేషన్ ఎస్ఈ అధికారిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్ డి –10 కాలువ కింద 11,550 ఎకరాల ఆయకట్టు ఉన్నప్పటికీ గత రెండేళ్లుగా నీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కమలాయిపల్లి శివారు వద్ద రంగనాయక సాగర్ కుడి కాలువ నుంచి డి3 కాలువకు అదనపు ఓటి నిర్మాణం చేసి నీటిని మళ్లించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. దీనివల్ల సిద్దిపేట నియోజకవర్గ రైతులకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ పనులను వెంటనే నిలిపివేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని రైతులు, బీఆర్ఎస్ నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మైసంపల్లి, ఖానాపూర్, అంక్సాపూర్, నాగరాజుపల్లి, నంగునూర్, ఘనపూర్, అక్కెనపల్లి, గట్ల మల్యాల ఖాతా, సీతారాంపల్లి, కొండంరాజుపల్లి, సంతోష్‌నగర్ తదితర గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## నడుము నాజూగ్గా..

నాజూకైన నడుమును సొంతం చేసుకోవడానికి వ్యాయామాలు చేయడం, ఆహారంలో మార్పులు చేసుకోవడం.. ఇలా ఎన్నో కసరత్తులు చేస్తుంటారు అమ్మాయిలు. వీటితో పాటు ఈ చిట్కాలూ మేలు చేస్తాయంటు వచ్చం టున్నారు నిపుణులు.

నాజూకైన నడుమును సొంతం చేసుకోవాలంటే తీసుకునే ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో తక్కువ క్యాలరీలుండే ఆహార పదార్థాలు తీసుకోవాలి. జంక్‌ఫుడ్, వేపుళ్లు, చాక్లెట్లు.. వంటివి పక్కన పెట్టేయాలి. పండ్లు, కూరగాయలు, గుడ్లు, చేపలు.. మొదలైనవి తినడం అలవాటు చేసుకోవాలి. మోనోఅన్‌శ్యాచురేటెడ్ కొవ్వులు మన శరీరానికి ఎంతో అవసరం. ఇవి ఎక్కువగా లభించే గింజలు, అవకాడో.. వంటివి తినడం వల్ల శరీరానికి అవసరమైన ఆరోగ్యకరమైన కొవ్వులు అందడంతో పాటు.. బరువును కూడా అదుపులో ఉంచుకోవచ్చు. ప్రొటీన్లు ఎక్కువగా లభించే పదార్థాలను ఆహారంలో చేర్చుకుంటే ఎక్కువ సమయం కడుపు నిండుగా ఉంటుంది. తద్వారా ఆహారపు కోరికల్ని అదుపులో ఉంచుకోవచ్చు. బరువునూ నియంత్రించుకోవచ్చు. బరువు తగ్గడానికే కాదు.. నడుము నాజూగ్గా మారేలా చేయడంలో వ్యాయామాలదీ కీలక పాత్రే! అందుకే నిపుణుల సలహాతో క్రమం తప్పకుండా ఎక్సర్‌సైజులు చేయడం అలవాటు చేసుకోవాలి. క్రమం తప్ప కుండా నడవడం, పరిగెత్తడం, డ్యాన్స్ చేయడం, ఈత కొట్టడం, సైక్లింగ్.. వంటివి కూడా నడుమును నాజూగ్గా ఉంచడంలో సహకరిస్తాయి అంటున్నారు నిపుణులు.



నిపుణులు. రాత్రుళ్లు పడుకోవడానికి కనీసం రెండు గంటల ముందే భోజనం ముగించుకోవాలి. అప్పుడే తీసుకున్న ఆహారం జీర్ణమవుతుందట. అలాగే శరీరంలో, పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోకుండా కూడా జాగ్రత్తపడచ్చు. ఫలితంగా నాజూకైన నడుమును సొంతం చేసుకోన్నారు

## సూక్ష్మక్రిముల ఆవాసాలివి...



ఇల్లు దులుపు తాం, గిన్నెలు కడుగు తాం... దుప్పట్లు మారు స్తాం, దుస్తులు ఉతుకుతాం. కానీ, కొన్ని పనులు చిన్నవిగా అనిపించి నిర్లక్ష్యం చేస్తాం. కానీ, అవి సూక్ష్మక్రిములకు ఆవాసాలుగా మారతాయి. ఏ మాత్రం అశ్రద్ధ చేసినా అనారోగ్యాలకు కారణం అవుతాయి. అవేంటంటారా? వంటింట్లో సింక్ కడగడం, పొడిగా ఉంచడం వంటి పనులు తప్పక చేస్తాం. కానీ, సింక్ కింద శుభ్రం చేయడానికి బద్ధకిస్తుంటాం. లీకేజీల వల్ల ఆ ప్రాంతంలో ఎప్పుడూ ఫంగస్ ఉంటుంది. దీనికి దుమ్ము, ధూళీ తోడై మరింత ప్రమాదకరంగా మారొచ్చు. అందుకే దీన్ని ఎప్పటికప్పుడు తడిలేకుండా తుడవాలి. రెండు రోజులకోసారి బేకింగ్ సోడా లేదా బ్లీచింగ్ వంటివి చల్లడం మరిచిపోవద్దు. లేదంటే చెదలూ, బొద్దింకలు వంటివి చుట్టూ చేరతాయి. టూత్ బ్రష్‌లను నెలలు కాదు... ఏళ్ల తరబడి వాడేస్తారు చాలా మంది. దాన్ని ఎలా వాడాలో తెలుసుకోరు. వాడే ముందు తప్పనిసరిగా కడగాలి. వాడాక గాలికి ఆరనివ్వడమో, ఎండలో ఉంచడమో చేయాలి. రెండు రోజులకోసారి రెండు సెకన్లయినా వంటసోడా వేసిన వేణ్నీళ్లలో ముంచి తీయాలి. అప్పుడే సూక్ష్మక్రిములు నోట్లోకి చేరకుండా ఉంటాయి. బ్రష్‌లను స్నానాల గదిలో ఎట్టిపరిస్థితిలోనూ ఉంచొద్దు. సోఫాలో కూర్చున్నంత సేపూ మన వేళ్లు రిమోట్ మీదే ఉంటాయి. అలానే మొబైల్ కూడా ఎప్పుడూ చేతిలోనే ఉంటుంది. వీటిపై అత్యధిక స్థాయిలో ప్రమాదకర బ్యాక్టీరియా స్థానం ఏర్పరచుకుంటుందని ఇప్పటికే అనేక అధ్యయనాలు వెల్లడించాయి. మరి వీటిని శుభ్రం చేయడంపై ఏ మాత్రం దృష్టిపెడుతున్నారు? ఆ మాటే గుర్తుండదు. కానీ, చేయాలి.

## పోషకాల ఖర్జూరాలు.. అందుకే ఎంతో మేలు!

రంజాన్ మాసంలో ఆచరించే కఠిన ఉపవాస దీక్షకు అత్యంత ప్రాధాన్యం ఉంది. రోజూ ఈ దీక్ష విరమించేటప్పుడు తీసుకునే ఆహార పదార్థాల్లో ‘ఖర్జూరాలు’ తప్పకుండా ఉంటాయి. శరీరానికి తక్షణ శక్తినిచ్చే ఈ పండు ఆరోగ్యప చ్చని చెబుతున్నారు నిపుణులు. ఖర్జూరం పండ్లలో శరీరానికి కావాల్సిన ఖనిజాలు, విటమిన్లు, ఇతర పోషకాలు అధికంగా ఉంటాయట. ఇవి సంపూర్ణ ఆరోగ్యానికి చాలా అవసరం. ఖర్జూరాల్లో ఫైబర్ ఎక్కువగా కొలెస్ట్రాల్ తక్కువగా.. ఉంటాయి. కాబట్టి ఇవి తింటే ఎక్కువసేపు కడుపు నిండుగా ఉన్న భావన కలిగి.. బరువు అదుపులో ఉంచుకోవచ్చు. క్యాల్షియం, మెగ్నీషియం, కాపర్.. వంటి ఖనిజాలు ఈ పండులో అధికంగా లభిస్తాయి. క్యాల్షియం ఎముకలను, దంతాలను దృఢంగా ఉంచడానికి.. కాపర్ ఎర్రరక్తకణాల ఉత్పత్తికి.. మెగ్నీషియం ఎముకల ఆరోగ్యానికి ఉపయోగపడతాయి. ఖర్జూరాలు కేవలం బరువు తగ్గడానికి మాత్రమే కాదు.. బాగా సన్నగా ఉండి బరువు పెరగాలనుకునే వారికీ మంచి ఫలితాన్ని స్తాయంటున్నారు నిపుణులు. ఖర్జూరం పండు శరీరానికి తక్షణ శక్తినిస్తుంది. అందుకే రంజాన్ ఉపవాస దీక్షల సమయంలో ఈ పండుని ఆహారంగా తీసుకుంటారు. మలబద్ధకంతో బాధపడే వారు కొన్ని ఖర్జూరాల్ని రాత్రంతా నీటిలో నానబెట్టి ఉదయాన్నే పరగడుపున వాటిని తిని, ఆ నీరు తాగితే మంచి ఫలితం ఉంటుందట. ఖర్జూ రంలో ఉండే వివిధ పోషకాలు శరీరంలోని జీవక్రియలను వేగవంతం చేయడంలో సహకరిస్తాయి. ఖర్జూరాల్లో ఉండే విటమిన్ ‘బి6’ వల్ల మెదడు చురుగ్గా పనిచేస్తుందట. శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలోనూ ఖర్జూరాలు తమ వంతు పాత్ర పోషిస్తాయని చెబుతున్నారు నిపుణులు.



రంగానూ ఎంతో మేలు చేస్తుందంటున్నారు నిపుణులు. పొటాషియం ఎక్కువగా లభించే ఖర్జూరాలు తినడం వల్ల గుండె కొట్టుకునే రేటు, రక్తపోటు అదుపులో ఉంటాయట. అలాగే గుండె సంబంధిత సమస్యలు దరిచేరకుండా జాగ్రత్తపడ

## చర్మం బాగుండాలంటే..!

ఒక్కోసారి ఫుడ్ అలర్జీ వంటి సమస్యల వల్ల కూడా చర్మంలో చాలా మార్పులు కనిపిస్తుంటాయి. ఈ క్రమంలో– చర్మం రఫ్‌గా తయారవుతున్నా.. డల్‌గా కనిపిస్తున్నా ఓసారి వైద్య నిపుణులను సంప్రదించి పరీక్ష చేయించుకోవడం అవసరం. దీంతో పాటు చర్మ సంరక్షణకు సంబంధించి కూడా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. మన శరీరానికి సరిపడే ఆహారం మాత్రమే తీసుకోవాలి. అదే మన ఆరోగ్యానికి మంచిది. ప్రత్యేకించి జంక్ ఫుడ్స్, డెయిరీ ప్రొడక్ట్స్ తినే విషయంలో జాగ్రత్తగా ఉండాలి. అలాగే ప్రతి రోజూ సరిపడినన్ని నీళ్లు తాగడం తప్పనిసరి. ఏ కాలమైనా సరే– బయటికి వెళ్లేటప్పుడు చర్మానికి సన్‌స్క్రీన్ రాసుకోవాలి. అదేవిధంగా అవసరాన్ని బట్టి డెర్మటాలజిస్ట్ సలహా మేరకు సి–విటమిన్ అధికంగా లభించే సీరంను రోజూ చర్మానికి రాసుకోవాలి. ఇది చర్మ సంరక్షణకు ఎంతగానో ఉపకరిస్తుంది. చర్మంలో తేమ స్థాయులు తగ్గకుండా ఉండేందుకు మాయిశ్చరైజర్ రాసుకోవాలి. ప్రత్యేకించి మెడ భాగంలో, కళ్ల కింద మాయిశ్చరైజర్‌తో మృదువుగా మర్దన చేసుకోవాలి. రోజుకు రెండుసార్లు శుభ్రమైన నీటితో ఫేస్ వాష్ చేసుకోవాలి. ముఖం కడుక్కునేటప్పుడు చేతులతో మరీ గట్టిగా రుద్దకూడదు. ఇలా చేస్తే చర్మం పొడిబారిపోయే ప్రమాదముంది. మచ్చలు, మొటిమలు ఏర్పడితే వాటిని గిల్లకూడదు. అలా చేస్తే ఆ ప్రాంతం మరింత అందవిహీనంగా తయారవుతుంది.



## స్పైసీగా తింటున్నారు!

‘ఉన్నది ఒక్కటే జీవితం... దీన్ని పూర్తిగా అనుభవించాలి’... ఈ తరం చెబుతోన్న మాటే ఇది. కాబట్టే, కెరియర్ దగ్గర్నుంచి... టూర్ల వరకూ ఏదైనా నచ్చిందే చేస్తున్నారు. భిన్న రుచులను వెతుక్కుంటూ వెళ్లిమరీ ఆస్వాదించేస్తున్నారు. అన్నట్టూ ఈమధ్య వాళ్లని ఆకర్షిస్తున్నదేంటో తెలుసా? హాట్ హనీ! అంటే తేనెని వేడి చేసి తీసుకోవడం అనుకునేరు. ఇదో తీపి, కారాల కలయిక. తేనెని వేడిచేసి, దానికి చిల్లీఫ్లేక్స్ కలుపుతారు. ఓవైపు తీయగా, మరోవైపు కారంగా... ఆ రుచే వేరు అంటూ పిజ్జా, కూరగాయల సలాడ్, ఫ్రైడ్‌స్నాక్స్, టోస్ట్... ఇలా ప్రతి దానిమీదా వేసుకుని తినేస్తున్నారు. పైగా ఈ స్వీట్, స్పైసీల కలయికకి ‘స్వైసీ’ అని పేరు పెట్టుకుని మరీ సోషల్‌మీడియాలో దీని గురించి పంచుకుంటున్నారు. ఏళ్లనాటి నుంచి వస్తున్న సాస్‌కి దీన్నో ట్రెండీ ప్రత్యామ్నాయంగానూ చెబుతున్నారు. దీంతో చిటికెలో పూర్తయ్యే వంటలు, ఫ్లేవర్ల విషయంలో ప్రయోగాలు చేసే జెన్‌జీ అమ్మాయిల ఫేవరెట్‌గా మారిపోయింది స్వైసీ తేనె. మరి మీ సంగతేంటి? మీరూ రుచి చూస్తారా ఓసారి?



## చక్కెర.. ఇలా కూడా వాడచ్చట!

చక్కెరను స్వీట్లు, ఇతర ఆహార పదార్థాల తయారీలో ఉపయోగించడం మనకు తెలిసిందే! కానీ నిత్య జీవితంలో వివిధ పనుల కోసం కూడా చక్కెరను వాడచ్చంటున్నారు నిపుణులు. దుర్వాసనను పోగొట్టడానికి.. మిక్సీ జార్లు, కాఫీ గ్రైండర్స్, ఇతర డబ్బాలు.. వంటివన్నీ ఎక్కువ రోజులు వాడకుండా మూతపెట్టి అలాగే ఉంచడం వల్ల కొన్ని రోజులకు వాటి నుంచి అదో రకమైన వాసన వస్తుంటుంది. అలాంటప్పుడు ఆ వాసనను తొలగించడానికి చక్కెర బాగా ఉపయోగపడుతుందట. ఇందుకోసం కాఫీ గ్రైండర్స్, మిక్సీ జార్లు.. వంటి వాటిలో పావు కప్పు చక్కెర వేసి కాసేపు గ్రైండ్ చేయాలి. ఆ తర్వాత కడిగేస్తే సరిపోతుంది. ఇలా చేయడం వల్ల అందులోని వాసనను చక్కెర పీల్చేసుకుంటుందట. ఇక ఇతర డబ్బాల్లో ఒక టీస్పూన్ చక్కెరను వాటిలో వేసి మూత పెట్టాలి. తిరిగి ఆ బాక్సులను ఉపయోగించుకునే ముందు శుభ్రంగా కడిగితే ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. చేతులకు గ్రీజు అంటుకున్నప్పుడు ఒక్కోసారి ఎంత కడిగినా వదలదు. అలాంటప్పుడు లిక్విడ్ హ్యాండ్‌వాష్‌లో కాస్త చక్కెర వేసి ఆ మిశ్రమంతో చేతుల్ని శుభ్రం చేసుకుంటే గ్రీజు మరకలు పోతాయట. ఒక నిమ్మచెక్క రసాన్ని తీసుకొని అందులో మూడు టేబుల్‌స్పూన్ల చక్కెర వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని తుప్పు పట్టిన వస్తువులపై వేసి కడిగితే అవి శుభ్రపడతాయంటున్నారు నిపుణులు. ఉల్లిపాయలు కట్ చేసిన తర్వాత చేతులకు అంటుకున్న వాసన పోవాలంటే.. టేబుల్‌స్పూన్ చక్కెరకు టీస్పూన్ లిక్విడ్ హ్యాండ్‌వాష్ కలిపి ఆ మిశ్రమంతో చేతుల్ని రుద్దుకోవాలి. మూడు టేబుల్ స్పూన్ల చక్కెరకు టేబుల్ స్పూన్ బేకింగ్ పౌడర్ కలిపి కొన్ని నీళ్లు పోసి చిక్కగా చేసుకోవాలి. ఈ మిశ్రమంతో పాత్రలను శుభ్రం చేస్తే చక్కటి ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు.



## జుట్టు విషయంలో.. ఈ జాగ్రత్తలు!

ఉదయం లేచిన దగ్గర్నుంచి రాత్రి నిద్రపోయే వరకు సమయంతో ఉరుకులు, పరుగులు పెడుతూనే ఉంటాం. ఈ క్రమంలో కొంతమంది తలస్నానం చేసి వచ్చిన వెంటనే తొందరగా ఆరిపోవాలని డ్రయర్స్ ఉపయోగిస్తూ ఉంటారు. అది మంచిది కాదు. జుట్టుని మరింత పొడిబారిపోయేలా చేస్తుంది అంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో– జుట్టు విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. డ్రయర్స్ వాడడమే కాదు.. తలస్నానం చేసి వచ్చిన వెంటనే టవల్‌తో గట్టిగా రుద్దేయడం కూడా పొరపాటే. దీనివల్ల జుట్టు చిక్కులు పడి, మరింత ఎక్కువగా ఊడిపోయే అవకాశం ఉంటుంది. అలాగే జుట్టు తడిగా ఉన్నప్పుడే కొందరు దువ్వుకుని, జడ వేసేసుకుంటూ ఉంటారు. ఇలా చేస్తే బలహీనంగా ఉన్న కుదుళ్ల నుంచి వెంట్రుకలు ఊడిపోతాయి.. అంతేకాకుండా తల పూర్తిగా ఆరకపోతే కాస్త ఇబ్బందిగా కూడా ఉంటుంది. శిరోజాలకు సంబంధించిన కొన్ని ఉత్పత్తులను జుట్టు తడిగా ఉన్నప్పుడు అప్లై చేయకూడదు అంటున్నారు నిపుణులు. అలాగే తల నుంచి సువాసన రావాలని హెయిర్ స్ప్రేలను ఉపయోగిస్తూ ఉంటాం. వాటిని నేరుగా తల మీద స్ప్రే చేయకూడదు. వాటిలోని రసాయనాలు, ఆల్కహాల్ జుట్టుపై ప్రభావం చూపిస్తాయి. అందుకే చేతుల్లో స్ప్రే చేసుకుని తర్వాత జుట్టుకి రాసుకోవాలి అని సూచిస్తున్నారు.



## పాదాలు... జాగ్రత్త!

కొత్త చెప్పులు వేసుకున్నామంటే బొబ్బలు ఖాయం. ఎక్కువ దూరం నడిచినా, స్టైల్‌గా కనిపించాలని హీల్స్ వేసినా ఇవి పలకరించేస్తాయి. ఈ సమస్య కొన్నాళ్లు నొప్పితో పోయేదా? తరవాత మచ్చల రూపంలోనూ వేధిస్తుంది. అందుకే జాగ్రత్త తీసుకోవాలి. కొత్త చెప్పులు వేసుకోవడం... వాటితో బొబ్బలు రావడం ఆపై అవస్థలు మామూలుగా ఉండవు కదూ! బ్యాండెయిడ్ వేసి నయం చేసుకోవాలని చూసినా ఆ తిప్పలూ తక్కువేం కాదు. రాపిడికి అది పూర్తిగా ఊడిపోతుంది. గాయానికే ఒరుసుకుపోయి నొప్పి. చిక్కు వద్దంటే బ్లిస్టర్ ప్రివెన్షన్ టేప్ లేదా షూ బైట్ ప్రొటెక్టర్ ఉండాల్సిందే. ముందే వేసుకుంటే గాయాలు కావు. పైగా రాపిడికి త్వరగా ఊడవు, వాటర్ ప్రూఫ్. అప్పటికే గాయమైనా వేసుకోవచ్చు. చెమట, బ్యాక్టీరియాల నుంచి కాపాడతాయి. సమస్య వచ్చే వీలున్న ప్రాంతాల్లో అతికించేయండి. చెప్పులు లేదా షూ అలవాటయ్యేదాకా రోజూ ప్లాస్టర్ ఏం వేసుకుంటాం? మర్చిపోయామో ఇకంతే సంగతులు అంటారా? అయితే షూ బైట్ ప్రొటెక్టర్ ప్యాడ్స్ తెచ్చుకోండి. దీన్ని షూ వెనక భాగంలో అతికించుకుంటే సరి. ఒరిపిడి కాకుండా కాపాడుతూనే పాదానికి హాయినిస్తుంది. ఇవి గాయాలు కాకుండా కాపాడటమే కాదు, మడమలకి నొప్పి రాకుండానూ చూస్తాయట. చాలాసేపు నిలబడాల్సి వచ్చినా, ఎక్కువ దూరాలు నడవాలన్నా మన ఎంపిక షూనే! కానీ నడిచీ నడిచీ కూడా పాదాల వేళ్ల మధ్య రాపిడి జరుగుతుంది. బొబ్బలు, కాయలు వచ్చేస్తాయి. ఇక పాయింటెడ్ షూ, హీల్స్ వేసుకునే వాళ్ల సంగతైతే ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కాలివేళ్లన్నీ నొక్కుకుపోయినట్లుగా అయిపోయి తెగ ఇబ్బంది పెడతాయి. అలాంటివాళ్లు ఈ టో ప్రొటెక్టర్లను తెచ్చుకోవచ్చు. సిలికాన్‌తో చేసినవే కాదు, కాటన్‌వీ దొరుకుతున్నాయి. పాదాల వేళ్లకు తగిలించడమే. గాలి తగిలేలా చేస్తూనే రాపిడి జరగకుండానూ కాపాడతాయి. కావాలంటే ప్రయత్నించండి మరి.



## ప్రొటీన్లతో అలసట మాయం!

ఉదయాన్నే నిద్ర లేచింది మొదలు.. ఊపిరి సలపని పనులతో క్షణం తీరిక ఉండదు. మరోవైపు ఆఫీసులో ఒత్తిడి, అలసటతో సతమతమవుతాం. ఇలాంటి బిజీ లైఫ్‌స్టైల్‌తో ఎదురయ్యే అలసటను దూరం చేసుకొని చురుగ్గా మారాలంటే ప్రొటీన్లు నిండిన ఆహార పదార్థాలను రోజువారీ డైట్‌లో చేర్చుకోవాలని చెబుతున్నారు నిపుణులు. ప్రొటీన్లతో నిండిన బాదంపప్పు, పిస్తా, అక్రోట్.. వంటి గింజలను ప్రతిరోజూ మితంగా తీసుకోవడం మంచిది. అవి గుండెకు మేలు చేస్తాయట. సలాడ్లు, ఉడికించిన కూరగాయలతో కూడా వీటిని కలుపుకొని



తినొచ్చు. అయితే నట్స్‌లో క్యాలరీలు కూడా ఎక్కువగానే ఉంటాయి కాబట్టి మితంగానే తీసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. కండరాల నిర్మాణానికి తోడ్పడే ప్రొటీన్లు పాలు, పాల పదార్థాల్లో పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తపోటు అదుపులో ఉంచడానికీ తోడ్పడతాయట. ఈ క్రమంలో తక్కువ కొవ్వులుండే పాల పదార్థాలను తీసుకోవాలని సూచిస్తున్నారు నిపుణులు. సోయాబీన్స్‌లో ప్రొటీన్ల మోతాదు ఎక్కువ. వీటిని సోయా పాలు, సోయా పేస్ట్, టోఫూ రూపంలోనూ తీసుకోవచ్చు. అయితే ఇవి కొంతమందికి పడకపోవచ్చు. అలాంటి వారు వీటిని తీసుకునే విషయంలో వైద్యులను సంప్రదించాలి. బఠాణీలు, రాజ్మా, బీన్స్, చిక్కుళ్లు, ఇతర కూరగాయల్లోనూ ప్రొటీన్ ఉంటుంది. చేపల్లో ప్రొటీన్లతో పాటు గుండెకు మేలు చేసే ఒమేగా–3 కొవ్వు ఆమ్లాలూ ఎక్కువగానే ఉంటాయి. మాంసాహారంలోనూ ప్రొటీన్లు మెండుగా ఉంటాయి. అయితే వీటిలో కొవ్వులు కూడా ఎక్కువగా ఉంటాయి కాబట్టి మితంగానే తీసుకోవాలంటున్నారు నిపుణులు. కోడిగుడ్డులో కూడా ప్రొటీన్ ఉంటుంది. కానీ కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్న వారు, గుండెజబ్బులు.. వంటి సమస్యలున్న వారు డాక్టర్ సలహా తీసుకున్న తర్వాతే వీటిని ఆహారంలో చేర్చుకోవాలి.

## అనిల్ అంబానీ రిలయన్స్ పవర్‌పై ఈడీ దాడులు



ప్రముఖ వ్యాపారవేత్త అనిల్ అంబానీ కి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. అనిల్ అంబానీ గ్రూప్ కంపెనీ రిలయన్స్ పవర్‌కు సంబంధించి ముంబయి, హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు నిర్వహించింది. మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా 15 బృం దాలు ఈ తనిఖీల్లో పాల్గొన్నాయని జాతీయ డియా కథనాలు పేర్కొన్నాయి. మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా అనిల్ ఫిబ్రవరి 27న ఈడీ విచారణకు హాజరుకావాల్సిఉంది. అయితే ఆయన గైర్హాజరైన నేపథ్యంలో ఈ సోదాలు జరిగాయి.




# ఎల్‌పీజీ, పెట్రోల్, డీజిల్‌కు కొరత లేదు




మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతల మధ్య ఇంధన భద్రతకు సంబంధించి ప్రస్తుతం ఆందోళన చెందాల్సిన అవసరంలేదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. దేశంలో తగినంత ముడి చమురు, గ్యాస్ నిల్వలు ఉన్నాయి. దేశంలో ఇంధన కొరత విషయంలో ఆందోళనలకు తెర దించుతూ పెట్రోల్, డీజిల్ గురించి ఎలాంటి నిబంధనలు విధించడంలేదని, దేశంలో కావాల్సిన నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని వెల్లడించారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేవు కాబట్టి, ప్రజలు, పరిశ్రమలకు ఇబ్బంది ఉండదని పేర్కొన్నారు. దేశ ఇంధన భద్రత గురించి ఎప్పటికప్పుడు సక్ష జరుపుతున్నాం, నిల్వలు రోజూ భర్తీ అవుతున్నాయి. ప్రధానంగా ఎల్‌పీజీ, ఎల్ఎన్‌జీ, ముడి చమురు సరఫరాకు ఎలాంటి సమస్యా లేదు. ప్రాధాన్యతా రంగాలకు గ్యాస్ సరఫరా నిరంతరం అందించడానికి గెయిల్ అవసరమైతే ఫోర్స్ మెజ్యూర్ ప్రకటించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు అభిప్రాయపడ్డాయి. ఈ నిబంధన కింద అనూహ్య పరిస్థితులు ఎదురైతే ఒప్పందాన్ని పాజ్ చేయవచ్చు. భారత్‌కు పంపించాల్సిన ఎల్ఎన్‌జీ విషయంలో ఖతార్ ఇదే విధానాన్ని అమలు చేసింది. ప్రస్తుతం మనకు ఖతార్ రోజుకు 60 మెట్రిక్ స్టాండర్డ్ క్యూబిక్ టర్లు(ఎంఎస్‌సీఎండీ) గ్యాస్‌ను సరఫరా చేస్తోంది. అలాగే, ప్రపంచ అవసరాల్లో 20 శాతం మేర సరఫరా చేస్తోంది. అయితే, భారత్‌కు మొత్తం 195ఎంఎస్‌సీఎండీ) దిగుమతులు అవసరం. కాబట్టి, మనదేశానికి కావాల్సిన గ్యాస్ కోసం ఇతర మార్కెట్లనూ అన్వేషిస్తున్నట్టు అధికారులువెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల మధ్య భారత్ ప్రత్యామ్నాయ వనరులపైనా దృష్టి సారిస్తోంది. ఇప్పటికే కెనడా, ఆస్ట్రేలియాలు గ్యాస్ సరఫరాకు అంగీకరించాయి. కొత్తగా జరిగినఒప్పందాల కింద యూఏఈ, అమెరికా నుంచి కూడా సకరణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో భారత్ ఒక దేశంపైనే ఆధారపడాల్సిన పరిస్థితి లేదు. అంతర్జాతీయంగా ఇబ్బందులు తలెత్తకుండా పలు కంపెనీలతో చర్చలు జరుగుతున్నాయి. యుద్ధం కారణంగా పెరుగుతున్న నౌకల బీమా సౌకర్యాలపైనా అమెరికాతో చర్చలు జరుపుతున్నాయి.

## బేర్ గుప్పిట్లో దలాల్ స్ట్రీట్



ఇరాన్ యుద్ధ మేఘాల నేపథ్యంలో భారత స్టాక్ మార్కెట్లు భారీ పతనాన్ని చవిచూస్తున్నాయి. గడిచిన మూడు ట్రేడింగ్ సెషన్లలోనే ఇన్వెస్టర్లు ఏకంగా రూ. 21.29 లక్షల కోట్ల సంపదను కోల్పోవడం మార్కెట్ వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది. మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచవ్యాప్త సరఫరా గొలుసుపై ప్రభావం చూపుతాయన్న భయంతో మదుపర్లు తమ షేర్లను విక్రయించడానికి మొగ్గు చూపుతున్నారు. గత శనివారం యుద్ధం మొదలైనప్పటికీ, మధ్యలో ఆదివారం మరియు మంగళవారం హోలీ పండగ సందర్భంగా మార్కెట్లకు సెలవులు రావడం ఇన్వెస్టర్లకు కొంత ఊరటనిచ్చింది. ఒకవేళ ఆ రోజుల్లో ట్రేడింగ్ జరిగి ఉంటే నష్టాల తీవ్రత ఇంకా భయంకరంగా ఉండేదని విశ్లేషకులు భావిస్తున్నారు. విరామం లభించినప్పటికీ, అంతర్జాతీయ పరిణామాలు అనుకూలంగా లేకపోవడంతో మార్కెట్ సెంటిమెంట్ పూర్తిగా దెబ్బతింది. యుద్ధం ఇప్పుడప్పుడే ముగిసేలా కనిపించకపోవడం, ఎగుమతులు మరియు దిగుమతులపై ఆంక్షలు కఠినతరం కావడం మరో ప్రధాన ఆందోళనగా మారింది. ముఖ్యంగా ముడిచమురు ధరలు పెరిగే అవకాశం ఉండటంతో ద్రవ్యోల్బణం భయాలు పెరిగిపోయాయి. ఈ అనిశ్చితి వల్ల విదేశీ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నారు, ఇది దేశీయ మార్కెట్లపై అదనపు ఒత్తిడిని పెంచుతోంది. ప్రస్తుత పరిస్థితులను గమనిస్తే, రాబోయే సెషన్లలో 'బేర్' హవా కొనసాగే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కొనుగోలుదారులు వెనకడుగు వేస్తుండటంతో సూచీలు మరింత దిగువకు పడిపోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆచి తూచి అడుగులు వేయాలని, మార్కెట్ స్థిరపడే వరకు వేచి చూడటం ఉత్తమమని సూచిస్తున్నారు.

## పడిపోయిన బియ్యం ధరలు..



గత 72 గంటల్లోనే బాస్మతీ బియ్యం ధరలు దేశీయ మార్కెట్లో 7-10 శాతం మేర పడిపోవడంతో ఎగుమతిదారులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఎగుమతి రవాణా ఖర్చులు 20 శాతం పెరగడమే కాకుండా నౌకల ఇంధన ధర టన్నుకు 520 నుండి 580 డాలర్లకు చేరడం, యుద్ధ రిస్క్ కారణంగా ఇన్సూరెన్స్ ప్రీమియంలు భారమవ్వడంతో ఎగుమతిదారుల ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తమైంది. నౌకలు రద్దయినప్పుడు లేదా సరుకు నిలిచిపోయినప్పుడు పోర్టుల్లో వసూలు చేసే స్టోరేజ్, డెమరేజ్ ఛార్జీలను వెంటనే మాఫీ చేయాలని ఇండియన్ రైస్ ఎక్స్‌పోర్టర్స్ ఫెడరేషన్ (ఐఆర్ఇఎఫ్) కేంద్రాన్ని కోరింది. అదేవిధంగా కోవిడ్ సమయంలో ఇచ్చిన విధంగానే వర్కింగ్ క్యాపిటల్ రుణాలు, బ్యాంకింగ్ వెసులుబాటు కల్పించాలని డిమాండ చేసింది. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే వేల కోట్ల రూపాయల విదేశీ వాణిజ్యం దెబ్బతినే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేసింది.

## వేసవిలో గుడ్ల ధరల తగ్గుదల



కోడిగుడ్ల ధరలు భారీగా తగ్గాయి. సాధారణంగా వేసవి కాలంలో గుడ్ల ధరలు తగ్గుతుంటాయి. కానీ ఈసారి ఇజ్రాయెల్, అమెరికా-ఇరాన్ యుద్ధం కారణంగా ఒక్కసారిగా దారుణంగా పతనమయ్యాయి. పరస్పర దాడులతో పశ్చిమాసియా రగులుతోంది. ఆరు రోజులుగా డ్రోన్లు, క్షిపణులతో ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా దేశాలు పరస్పర దాడులు చేసుకుంటున్నాయి. దీనితో ఎక్కడికక్కడ ఎగుమతులు నిలిచిపోవడం కూడా గుడ్ల ధరలు పడిపోవడానికి కారణం.ఎగుమతులు నిలిచిపోవడంతో పౌల్ట్రీ పరిశ్రమకు భారీ మొత్తంలో నష్టం చేకూరుతుంది. పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతల కారణంగా పోర్టులు, ఎయిర్ పోర్టులు మూసివేయడం పౌల్ట్రీ పరిశ్రమపై భారీ ప్రభావం పడుతోంది. ప్రస్తుతం నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ ధర రూ.4.20కి పడిపోయింది.

## అమెజాన్‌లో మరోసారి లేఆఫ్స్ పక్రియ




ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ మరోసారి లేఆఫ్స్ పక్రియ చేపట్టింది. ఈ ఏడాది జనవరిలో 16 వేలకు పైగా ఉద్యోగులను తొలగించిన కంపెనీ, తాజాగా రోబోటిక్స్ యూనిట్స్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను ఇంటికి సాగనంపింది. దాదాపు 100 మంది వైట్‌కాలర్ ఉద్యోగులపై దీని ప్రభావం ఉండొచ్చని రాయిటర్స్ తన కథనంలో పేర్కొంది. తాజా తొలగింపులు కంపెనీకి చెందిన వేర్‌హౌస్ నెట్‌వర్క్‌లో ఉపయోగించే వేర్‌హౌస్ రోబోట్లు, ఆటోమేషన్ సిస్టమ్‌లను రూపొందించే టీమ్స్‌లోని ఉద్యోగులపై వేటు పడింది. వీరు వేర్‌హౌస్‌లో పనులను ఆటోమేట్ చేసే రోబోలను డిజైన్ చేస్తారు. గతేడాది కంపెనీ వేర్‌హౌస్ ఉద్యోగులకు సహాయంగా బ్లూజే రోబోటిక్ విభాగాన్ని లాంచ్ చేసింది. కానీ, ఈ పక్రియకు ఎక్కువ ఖర్చు అవుతుందనే కారణంతో అమెజాన్ వీటి తయారీని ఆపేసింది. కస్టమర్లకు మెరుగైన సేవలు అందించడానికి ఈ విభాగంలో సక్ష చేపడతామని కంపెనీ అధికారిక ప్రకటనలో తెలిపింది. కానీ, ప్రస్తుతం ఎంతమందిని తొలగించిందనే విషయంపై అమెజాన్ స్పష్టత ఇవ్వలేదు. కాగా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) వినియోగం అత్యంత వేగంగా పెరగడంతో అమెజాన్ గతేడాది ఆఖర్లో 14 వేల మందిని, ఈ ఏడాది ప్రారంభంలో మరో 16 వేల మందిని తొలగించిన సంగతి తెలిసిందే.

## క్రెడిట్ స్కోర్ లేకుంటే.. బ్యాంకులు హోమ్ లోన్ ఇస్తాయా




సొంతింటి కల నెరవేర్చుకోవాలని ప్రతి ఒక్కరూ ఆశపడతారు. అయితే, ప్రస్తుత రోజుల్లో ఇల్లు నిర్మించాలన్నా, కట్టిన ఇల్లు కొనుగోలు చేయాలన్నా లక్షల నుంచి కోట్ల రూపాయలు వెచ్చించాల్సి వస్తోంది.దీంతో తప్పనిసరిగా బ్యాంకులో లోన్ తీసుకోవాల్సి వస్తోంది. అయితే, బ్యాంకుకు వెళ్లినప్పుడు చాలా మందికి ఎదురయ్యే సమస్య క్రెడిట్ స్కోర్. అసలు గంతలో ఎప్పుడూ లోన్ తీసుకోని వారికి క్రెడిట్ స్కోర్ అనేది ఉండదు. మరి అటువంటి వారికి బ్యాంకులు లోన్ ఇవ్వవా? కేవలం సిబిల్ స్కోర్ లేదన్న కారణంతో అప్లికేషన్ తిరస్కరించవచ్చా? దీనిపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలు ఏం చెబుతున్నాయి? అనే వివరాలు తెలుసుకుందాం. చాలా మంది క్రెడిట్ స్కోర్ లేకపోతే బ్యాంకులో లోన్ రాదని భావిస్తుంటారు. అయితే, ఇది ముమ్మాటికీ అపోహే. వాస్తవానికి మొదటి సారి లోన్ తీసుకునే వారిని న్యూ టూ క్రెడిట్ కేటగిరీగా పరిగణిస్తారు. వీరు క్రెడిట్ రిపోర్టులో స్కోర్ సున్నా లేదా మైనస్ వన్ అని కనిపిస్తుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పష్టమైన మార్గదర్శకాలున్నాయి. ఏ బ్యాంకు కూడా కేవలం క్రెడిట్ హిస్టరీ లేదన్న కారణంతో లోన్ అప్లికేషన్ తిరస్కరించకూడదు. 2025-26 నాటి తాజా బ్యాంకింగ్ రూల్స్ ప్రకారం మొదటిసారి లోన్ కావాలని కోరేవారికి ఫైనాన్స్ ఇన్‌క్లూషన్‌లో భాగస్వామ్యం కల్పించాలని ప్రభుత్వం, ఆర్‌బీఐ బ్యాంకులకు సూచించాయి. క్రెడిట్ స్కోర్ లేని సమయంలో బ్యాంకులు ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఆర్థిక స్తోమతను అంచనా వేస్తాయి. రుణ గ్రహీత నెలవారీ శాలరీ స్లిప్పులు, బ్యాంక్ స్టేట్ మెంట్స్, కనీసం రెండేళ్ల ఆదాయపు పన్ను రిటర్నులు పరిగణనలోకి తీసుకుంటాయి. ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగం లేదా వ్యాపారంలో ఎంత కాలం నుంచి ఉన్నారు, కంపెనీకి ఉన్న గుర్తింపు ఏమిటి, అనేవి లెక్కలోకి తీసుకుంటారు. 2026 నాటి ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం రూ.30 లక్షల లోపు హోమ్ లోన్లకు ఆస్తి విలువలో 90 శాతం వరకు లోన్ పొందే అవకాశం ఉంటుంది. ఆస్తి పత్రాలు క్లియర్ గా ఉంటే బ్యాంకులు ఈజీగానే లోన్ ఇస్తాయి. హోమ్ లోన్ ఈజీగా రావాలంటే కో అప్లికెంట్ సమర్థవంతంగా పని చేస్తుంది. భార్య లేదా తల్లిదండ్రుల్లో ఎవరికైనా మంచి క్రెడిట్ స్కోర్ ఉంటే వారిని కో అప్లికెంట్ గా చేర్చుకోవడం ద్వారా లోన్ త్వరగా వస్తుంది. మరోవైపు కొన్ని ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు క్రెడిట్ స్కోర్ లేని వారికి ప్రత్యేక పథకాల కింద రుణాలు ఇస్తాయి.




## అతడి బౌలింగ్ ప్రదర్శన అద్భుతం



ఇంగ్లాండ్‌తో ఉత్కంఠభరితంగా సాగిన టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్ పోరులో టీమ్‌ఇండియా ఏడు పరుగుల తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఆనందం వ్యక్తంచేశాడు. బుమ్రా బౌలింగ్ అద్భుతమని కొనియాడాడు. 'నిజాయతీగా చెప్పాలంటే ఇది చాలా మంచి పిచ్. ఇంగ్లాండ్ బ్యాటర్లు చక్కగా బ్యాటింగ్ చేశారు. వారు ఛేదనలో చివరివరకు విజయానికి చేరువగానే ఉన్నారు. బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ , ఇంకా ఇతర బౌలర్లు మ్యాచ్‌ను ఇంగ్లాండ్ గెలవకుండా చేశారు. కొన్నేళ్లుగా మనం బుమ్రా సామర్థ్యం ఏంటో చూస్తున్నాం. ఈ మ్యాచ్‌లోనూ అతడు మరోసారి అద్భుత ప్రదర్శన చేశాడు. టీమ్‌ఇండియా విజయంలో కీలక పాత్ర పోషించాడు' అని సూర్యకుమార్ యాదవ్ అన్నాడు. అలాగే అక్షర్ పటేల్ అత్యద్భుతమైన క్యాచ్‌లు అందుకున్న నేపథ్యంలో ఫీల్డింగ్ కోచ్ టి.దిలీప్ గురించి కూడా అతడు మాట్లాడాడు.

# ఫైనల్‌కు టీమిండియా




ఐసిసి టి20 ప్రపంచకప్ ఫైనల్‌కు టీమిండియా వరుసగా రెండోసారి ప్రవేశించింది. వెస్టిండీస్, అమెరికా వేదికగా 2024లో జరిగిన టి20 ప్రపంచకప్ ఫైనల్‌కు చేరి టైటిల్‌ను కొట్టిన భారతజట్టు ముచ్చటగా మూడోసారి టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారతజట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 253పరుగుల భారీస్కోర్ నమోదు చేసినా.. టీమిండియాకు ఆషామాషీగా ఏం విజయం దక్కలేదు. ఇంగ్లండ్ ఓపెనర్ బేథెల్(105; 48బంతుల్లో 8ఫోర్లు, 7సిక్సర్లు) చివరి వరకు పోరాడుతూనే ఉన్నాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా.. బేథెల్ పోరాటం ఆగలేదు. ఇంగ్లండ్ విజయానికి చివరి ఓవర్లో 30పరుగులు కావల్సిన దశలో బేథెల్ రనౌటవ్వడం, ఆ తర్వాత బంతికి ఒక్క పరుగే రావడంతో టీమిండియాకు విజయం ఖాయమైంది. కాని చివరి 3బంతులను జోఫ్రా ఆర్చర్ సిక్సర్లు కొట్టినా.. అప్పటికే టీమిండియాకు గెలుపు లాంచనమే అయ్యింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సంజు శాంసన్‌కు దక్కింది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ కెప్టెన్ బట్లర్ నిర్ణయం బెడిసి కొట్టింది. యువ ఓపెనర్ అభిషేక్ శర్మ(9) నిరాశపరిచినా.. వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్ మరోసారి అదరగొట్టాడు. నిర్ణయాత్మక సూపర్-8 మ్యాచ్‌లో విండీస్‌పై అద్భుత ఇన్నింగ్స్ ఆడి టీమిండియాను సెస్‌కు చేర్చడంలో కీలక పాత్ర పోషించిన సంజు.. ఇంగ్లండ్ బౌలర్లకూ చుక్కలు చూపించాడు. కేవలం 42బంతుల్లోనే 8ఫోర్లు, 7భారీ సిక్సర్లతో 89పరుగులు చేసి టీమిండియా భారీస్కోర్‌కు దోహదపడ్డాడు. ఆ తర్వాత ఇషాన్ కిషన్ (39: 18బంతుల్లో 4ఫోర్లు, 2సిక్సర్లు)తో కలిసి శాంసన్ స్కోరు బోర్డును ముందుకు తీసుకెళ్లాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు ఏకంగా 97 పరుగులు జోడించారు. శివమ్ దూబే 25 బంతుల్లో 4 సిక్సర్లతో 43 పరుగులు చేయగా.. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ 11 పరుగులకే వెనుదిరిగాడు. చివర్లో హార్దిక్ పాండ్యా, యువ సంచలనం తిలక్ వర్మ విధ్వంసం సృష్టించారు. హార్దిక్ 12 బంతుల్లో 27 పరుగులు చేయగా, తిలక్ వర్మ కేవలం 7 బంతుల్లోనే 3 భారీ సిక్సర్లతో సహా 21 పరుగులతో రాణించాడు. జోఫ్రా ఆర్చర్‌కి తోడు విల్ జాక్స్, ఆదిల్ రషీద్ చెరో రెండు వికెట్లు తీశారు. దీంతో భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి ఏకంగా 253 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది.

## పాకిస్తాన్ ప్లేయర్ అసభ్య ప్రవర్తన ఆరోపణలు



ఐసీసీ టీ20 వరల్డ్‌కప్‌లో నిరాశాజనక ప్రదర్శన తర్వాత పాకిస్తాన్ క్రికెట్ జట్టుపై మరో వివాదం వెలుగులోకి వచ్చింది. నివేదికల ప్రకారం, వరల్డ్‌కప్ జట్టులో ఉన్న ఒక పాకిస్తాన్ ఆటగాడు శ్రీలంకలో ఉన్న సమయంలో హోటల్‌లో పనిచేసే మహిళా సిబ్బందితో అనుచితంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు వచ్చాయి.టెలికాం ఆసియా స్పోర్ట్ ప్రచురించిన కథనం ప్రకారం ఈ ఘటన శ్రీలంకలోని కాండీ నగరంలో చోటు చేసుకుంది. టోర్నమెంట్ సమయంలో పాకిస్తాన్ జట్టు కాండీలోని గోల్డెన్ క్రౌన్ హోటల్‌లో బస చేస్తుండగా ఈ సంఘటన జరిగినట్లు సమాచారం. నివేదికల ప్రకారం, పాకిస్తాన్ వరల్డ్‌కప్ జట్టుకు చెందిన ఒక ఆటగాడు హోటల్‌లో పని చేస్తున్న మహిళా హౌస్‌కీపింగ్ సిబ్బందితో అనుచితంగా ప్రవర్తించాడు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఆ మహిళ సహాయం కోసం ఇతర సిబ్బందిని పిలిచింది. దీంతో హోటల్‌లోని ఇతర ఉద్యోగులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చినట్లు తెలుస్తోంది.తరువాత ఈ విషయం పాకిస్తాన్ జట్టు మేనేజర్ నవీద్ చీమా దృష్టికి తీసుకెళ్లారు. హోటల్ యాజమాన్యం ఆ ఆటగాడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు సమాచారం. అయితే పరిస్థితిని పెద్ద వివాదంగా మారకుండా ఉండేందుకు జట్టు మేనేజర్ నవీద్ చీమా హోటల్ యాజమాన్యానికి ఆటగాడి తరపున క్షమాపణలు తెలిపినట్లు తెలుస్తోంది. అనంతరం జట్టు అంతర్గతంగా ఈ వ్యవహారాన్ని పరిష్కరించి, ఆ ఆటగాడిపై జరిమానా విధించినట్లు నివేదిక పేర్కొంది. ఇప్పటివరకు ఆ ఆటగాడి పేరు అధికారికంగా వెల్లడించలేదు. అయితే ఈ వ్యవహారం ఇక్కడితో ముగిసిపోలేదని సమాచారం. జట్టు పాకిస్తాన్‌కు తిరిగి వెళ్లిన తర్వాత ఈ విషయంపై మరింత విచారణ జరిగే అవకాశముందని నివేదిక చెబుతోంది. పాకిస్తాన్ క్రికెట్ బోర్డు క్రమశిక్షణ కమిటీ ముందు ఆ ఆటగాడిని హాజరు కావాలని పిలిచే అవకాశం ఉందని కూడా తెలుస్తోంది. ఆ తర్వాత అవసరమైతే అదనపు శిక్షలు కూడా విధించే అవకాశం ఉందని కథనం సూచించింది. ఈ వివాదం వెలుగులోకి రావడం కూడా పాకిస్తాన్ జట్టు టోర్నమెంట్‌లో నిరాశాజనక ప్రదర్శన చేసిన వెంటనే కావడం గమనార్హం. టీ20 వరల్డ్‌కప్‌లో పాకిస్తాన్ జట్టు సెమీఫైనల్‌కు అర్హత సాధించలేకపోయింది. సూపర్-8 దశలో తమ చివరి మ్యాచ్‌లో శ్రీలంకపై ఐదు పరుగుల తేడాతో గెలిచినా, నెట్ రన్‌రేట్ కారణంగా పాకిస్తాన్ సెమీఫైనల్ రేసు నుంచి తప్పుకుంది. టోర్నమెంట్ మొత్తం సమయంలో జట్టు స్థిరమైన ప్రదర్శన ఇవ్వలేకపోవడం వల్ల ఇప్పటికే విమర్శలు ఎదుర్కొంటోంది.

## భారత్ అతడిని తప్పకుండా ఆడించాలి

టీ20 ప్రపంచకప్ 2026లో కీలక సమరానికి వేళైంది. గురువారం రాత్రి భారత్, ఇంగ్లాండ్ మధ్య రెండో సెమీఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ ముంబైలోని వాంఖడే క్రికెట్ స్టేడియంలో భారత కాలమానం ప్రకారం రాత్రి 7 గంటలకు జరగనుంది. ఈ నేపథ్యంలో టీమిండియా తుది జట్టు గురించి ఇంగ్లాండ్ మాజీ క్రికెట్ మైకెల్ వాన్.. కీలక వ్యాఖ్యలు చేశాడు. వాంఖడేలో భారత్.. కుల్‌దీప్ యాదవ్‌ను తుది జట్టులోకి తీసుకోవాలని సూచించాడు.'నేనైతే ఇంగ్లాండ్‌తో జరిగే సెమీఫైనల్ మ్యాచ్‌లో కుల్‌దీప్ యాదవ్‌ను ఆడిస్తాను. అతడి బౌలింగ్‌లో ఆడటానికి ఇంగ్లాండ్ బ్యాటర్లు ఇబ్బంది పడుతుంటారు. లోయర్ ఆర్డర్‌లో తిలక్



వర్మ, శివమ్ దూబెను ఆడించడం అవసరమా? ఆ ఇద్దరిలో ఒకరికి బదులుగా.. కుల్‌దీప్ యాదవ్‌ను భారత్ తుది జట్టులోకి తీసుకోవాలి. అయితే ఈ టోర్నీలో అతడికి ఇప్పటివరకు పెద్దగా అవకాశాలు రాలేదు. మరి ప్రస్తుతం అతడు ఫామ్‌లో ఉన్నాడా? లేదో నాకు తెలియదు. కానీ ఇంగ్లాండ్‌తో మ్యాచ్‌లో అతడిని ఆడిస్తే బాగుంటుంది' అని మైకెల్ వాన్ వ్యాఖ్యానించాడు. ఇక ఇదే సమయంలో టీమిండియా హెడ్‌కోచ్‌గా గౌతమ్ గంభీర్.. వ్యూహాల గురించి సైతం వాన్ మాట్లాడాడు. 'గంభీర్ తుది జట్టులో ఎక్కువగా బ్యాటర్లకు ప్రాధాన్యం ఇస్తాడు. ముఖ్యంగా టీ20ల్లో 7, 8, 9 స్థానాల వరకు బ్యాటర్లు ఉండేలా చూసుకుంటాడు. కాబట్టి కుల్‌దీప్‌ను ఆడిస్తారని నేను అనుకోవడం లేదు,' అని మైకెల్ వాన్ అభిప్రాయపడ్డాడు. ఇక ఇప్పటికే టీ20 ప్రపంచకప్ 2026లో న్యూజిలాండ్ ఫైనల్ చేరింది. బుధవారం ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్ లో ఘన విజయం సాధించింది. ఫిన్ అలెన్ విధ్వంసంతో 170పరుగుల లక్ష్యాన్ని 12.5 ఓవర్లలోనే ఛేదించింది. భారత్, ఇంగ్లాండ్ మ్యాచ్‌లో గెలిచే జట్టు మార్చి 8న న్యూజిలాండ్ ఫైనల్‌లో తలపడనుంది.

## నా తప్పిదం వల్లే, ఓడిపోయాం.. తప్పు ఒప్పుకున్న హ్యారీ బ్రూక్

టీ20 వరల్డ్ కప్ సెమీ ఫైనల్ లో భారత్ చేతిలో ఓడిపోవడంపై ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ స్పందించారు. తన తప్పిదం వల్లే ఈ మ్యాచ్ ఓడిపోయామని ఎమోషనల్ అయ్యారు. భారత బ్యాటర్లు అద్భుతంగా ఆడినట్లు మ్యాచ్ పూర్తయిన తర్వాత ప్రెస్ మీట్ లో వెల్లడించారు హ్యారీ బ్రూక్. భారత ఓపెనర్ సంజు శాంసన్ క్యాచ్ వదిలివేయడం తాను చేసిన అతి పెద్ద తప్పిదమని రియలైజ్ అయ్యారు. అదే తమ ఓటమికి కారణమైందని ఎమోషనల్ అయ్యారు హ్యారీ బ్రూక్. ఇక తమ జట్టు కుర్రాడు జాకబ్ బెథెల్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడినట్లు కొనియాడాడు. అతను ఎంతటి గొప్ప ఆటగాడు మరోసారి ప్రపంచానికి తెలిసిందని.. తన సత్తాను అందరికీ చూపించాడని వెల్లడించారు. 250 పరుగుల భారీ లక్ష్యం ఉన్నప్పటికీ, తమ జట్టు చివరి వరకు పోరాడిందని స్పష్టం చేశారు. మేము ఓడిపోయినప్పటికీ, తమ జట్టు చూపించిన ధైర్యం చూసి గర్వపడుతున్నానని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు హ్యారీ బ్రూక్. ఇది ఇలా ఉండగా భారత బ్యాటింగ్ సమయంలో సంజు ఇచ్చిన సింపుల్ క్యాచ్ ను నేలపాలు చేశాడు



హ్యారీ బ్రూక్. దీంతో ఈ మ్యాచ్ లో సంజు చెలరేగి ఆడిన సంగతి తెలిసిందే. కాగా ఈ సెమీ ఫైనల్ మ్యాచ్ లో 7 పరుగుల తేడాతో విజయం సాధించిన భారత జట్టు, ఫైనల్స్ లో అడుగు పెట్టింది.

## అభిషేక్ శర్మ ఫైనల్‌లో విజృంభిస్తాడేమో..



ప్రస్తుత టీ20 వరల్డ్‌కప్ 2026లో విఫలమవుతున్న అభిషేక్ శర్మకు సంజుశాంసన్ మద్దతుగా నిలిచాడు. క్రికెట్‌లో ఫామ్ కోల్పోవడం సాధారణమేనన్నాడు. తనదైన రోజున అభిషేక్ విజృంభిస్తాడని, అది వరల్డ్ కప్ ఫైనల్స్ అవుతుందేమో ఎవరికి తెలుసన్నాడు. 'మా డ్రెస్సింగ్ రూమ్ వాతావరణం బాగుంటుంది. మాకు అభిషేక్ శర్మ ద విపరీతమైన నమ్మకం ఉంది. మేమంతా అతడికి మద్దతుగా నిలుస్తున్నాం. ప్రతి క్రికెటర్ కెరీర్‌లో ఎత్తుపల్లాలు ఉంటాయి. ఈ ఫార్మాట్లో ఒకటి, రెండు మంచి షాట్లు కొడితే.. అంతా కుదురుకుంటుంది. మాకు అతడి ద ఇంకా నమ్మకముంది. తనదైన రోజున అతడు విధ్వంసం సృష్టిస్తాడు. ఎవరికి తెలుసు.. అది టీ20 ప్రపంచకప్ ఫైనలే అవుతుందేమో' అని సంజు శాంసన్ అన్నాడు. అలాగే అతడు న్యూజిలాండ్ సిరీస్‌లో తన వైఫల్యం గురించి కూడా మాట్లాడాడు. 'నాకు అది చాలా ఛాలెంజింగ్‌గా అనిపించింది. కచ్చితంగా ఫామ్ అందిపుచ్చుకొని మళ్లీ దేశానికి ప్రాతినిధ్యం వహించాలనుకున్నాను. నిజానికి నేను న్యూజిలాండ్ సిరీస్‌లో కాస్త ఎక్కువ ప్రయత్నించాననిపించింది. టీ20 క్రికెట్ చాలా విచిత్రమైంది.

# వుదయం సినిమా

## కాంతారావుకు జాతీయ పురస్కారం రావడం ఆనందకరం : రాజేంద్రప్రసాద్



భారత కల్చరల్ అకాడమి, తెలుగు ఫిలిం టెలివిషన్ వెల్ఫేర్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదిన ప్రసాద్ ల్యాబ్ లో నటప్రపూర్ణ కత్తి కాంతారావు గారి 103వ జన్మదినోత్సవాలు జరుపుతున్నారు. ఈ సందర్భంగా నటకిరీటి, పద్మశ్రీ డా. రాజేంద్ర ప్రసాద్ గారికి కత్తి కాంతారావు స్మారక జాతీయ పురస్కారాన్ని అందిస్తున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు నాగబలిడి సురేష్ కుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా మంత్రివర్యులు శ్రీధర్ బాబు, బీజేపీ రాష్ట అధ్యక్షులు రామచంద్రగారు, తెలంగాణ ఎఫ్డిసి కమిషనర్ శ్రీమతి ప్రియాంకల తో పాటు రాజకీయ, సినీ, పారిశ్రామిక వేత్తలు హాజరయ్యారు. తెలుగువారి గుండెల్లో నారదుడిగా, జనప్రద కథానాయకుడిగా ప్రఖ్యాతుడైన కాంతారావు గారు జాతీయ పురస్కారం అందుకోవడం తనకు ఆనందంగా ఉందని రాజేంద్ర ప్రసాద్ తెలియజేశారు.



## 19న ధురంధర్ ది రివెంజ్

కొన్ని వారాలుగా కొనసాగుతున్న అభిమానుల ఉత్సాహం మధ్య రణ్‌వీర్ సింగ్ నటిస్తున్న భారీ చిత్రం ధురంధర్ ది రివెంజ్ అఫీషియల్ పోస్టర్‌ను జియో స్టూడియోస్, B62 స్టూడియోస్ విడుదల చేశాయి.

ఈ పోస్టర్‌లో ట్రైలర్ మార్చి 7 ఉదయం 11:01 గంటలకు విడుదల కానుందని ప్రకటించారు. అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ట్రైలర్ కోసం ఇప్పటికే భారీ ఎక్స్‌పెక్టేషన్స్ నెలకొన్నాయి.

ఈ చిత్రంలో రణవీర్ సింగ్ జస్కిరత్ సింగ్ రంగీ, హమ్జా రెండు విభిన్న అవతారాల్లో కనిపించనున్నారు. ఈ కథలో ఈసారి సంఘర్షణ మరింత వ్యక్తిగతంగా మారబోతుందని పోస్టర్ సూచిస్తోంది.

ధురంధర్ పార్ట్ 1 భారత్‌తో పాటు అంతర్జాతీయ మార్కెట్లలో కూడా రికార్డు స్థాయి వసూళ్లు సాధించింది. ముఖ్యంగా నార్త్ అమెరికా, కెనడా, యుకే, ఆస్ట్రేలియా వంటి మార్కెట్లలో భారీ విజయాన్ని అందుకుంది. "ధురంధర్: ది రివెంజ్" మరోసారి అంచనాలను మించి రికార్డ్ క్రియేట్ చేస్తుందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.

జియో స్టూడియోస్ సమర్పణలో, బి62 స్టూడియోస్ నిర్మాణంలో, దర్శకుడు ఆదిత్య ధార్ తెరకెక్కించిన ఈ చిత్రం ఒక హైఆక్టేన్ స్పై-యాక్షన్ థ్రిల్లర్. ఈ చిత్రానికి జ్యోతి దేశ్‌పాండే, లోకేష్ ధర్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.

హిందీ, తమిళ, తెలుగు, మలయాళం, కన్నడ భాషల్లో విడుదల కానున్న ఈ చిత్రం 2026 మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. గుడి పాడ్వా, ఉగాది పండుగల సందర్భంలో ఈద్‌కు ముందుగా విడుదలవుతూ భారీ ఓపెనింగ్ సాధించేందుకు సిద్ధమవుతోంది.



## భోగి నుంచి పోస్టర్ రిలీజ్



చార్మింగ్ స్టార్ శర్వా, బ్లాక్ బస్టర్ మేకర్ సంపత్ నందితో కలిసి భారీ పాన్‌ఇండియా పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి' సినిమా చేస్తున్నారు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్ పై కెకె రాధామోహన్ ఎపిక్ స్కేల్‌లో నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని లక్ష్మీ రాధామోహన్ సమర్పిస్తున్నారు. ఈ చిత్రం శర్వా కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన వెంచర్‌లలో ఒకటిగా రూపొందుతోంది. ఇటీవలే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. శర్వాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, మేకర్స్ ఈరోజు ఒక ప్రత్యేక పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో శర్వా పూర్తిగా మాసీ, ఇంటెన్స్ అవతార్‌లో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. రగ్గడ్ జుట్టు, గడ్డంతో శర్వా రా, రెబెలియస్ లుక్‌లో కనిపిస్తున్నారు. పెదవుల మధ్య బీడి పెట్టుకుని, దాని నుంచి నెమ్మదిగా బయటకు వస్తున్న పొగ ఆయన పాత్రలోని అటిట్యూడ్‌ను మరింత హైలైట్ చేస్తోంది. చెమటతో తడిసిన ముఖం, రఫ్ టెక్చర్ పాత్రలోని గ్రిటీ రియలిజాన్ని చూపిస్తోంది. ఇంటెన్స్ ఎక్స్‌ప్రెషన్ ఫియర్స్, రాజీ పడని వ్యక్తిత్వాన్ని ప్రజెంట్ చేస్తోంది.

"ఎ బ్లడ్ ఫెస్ట్" అనే ట్యాగ్‌లైన్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా కొనసాగుతోంది. ఈ చిత్రంలో శర్వానంద్ ఇప్పటివరకు కనిపించని రస్టిక్, ఇంటెన్స్ పాత్రలో కనిపించనున్నారు. ఆయన మేకోవర్ ఇప్పటికే టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది.

డైరెక్టర్ సంపత్ నంది ఈ చిత్రాన్ని 1960ల కాలంలో ఉత్తర తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం నేపథ్యంలో తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో నిర్మించిన భారీ సెట్లో హైఆక్టేన్ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నారు. ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి కథానాయికలుగా నటిస్తున్నారు.

ఈ చిత్రానికి టాప్ టెక్నికల్ టీం పని చేస్తోంది. ఆర్ట్ డైరెక్టర్ కిరణ్ కుమార్ మన్నె, సినిమాటోగ్రఫీ కిషోర్ కుమార్ అరోకియా నిర్వహిస్తుండగా, బ్లాక్‌బస్టర్ కంపోజర్ భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని అందిస్తున్నారు.

ఈ చిత్రాన్ని ఆగస్టు 28న రక్షా బంధన్ సందర్భంగా తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషలలో ఒకేసారి గ్రాండ్ పాన్‌ఇండియా రిలీజ్ కానుంది.

## ఈ వయసులో కూడా..

సినిమా ఇండస్ట్రీలో హీరోలు కొనసాగించిన స్థాయిలో హీరోయిన్లు కెరీర్ను ముందుకు సాగించలేరు, ఇది అనేకమంది విషయంలో ప్రూవ్ అయింది. కొంతమంది బ్యూటీలు మాత్రం చాలా సంవత్సరాల పాటు అద్భుతమైన స్థాయిలో స్టార్ హీరోయిన్గా కెరియర్ను కొనసాగిస్తారు. అలాంటి వారిలో బాలీవుడ్ బ్యూటీ కరీనా కపూర్ ఒకరు. ఈమె అనేక సంవత్సరాల క్రితం ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది.

ఎంట్రీ ఇచ్చిన కొత్తలోనే అనేక విజయాలను అందుకొని హిందీ సినీ పరిశ్రమలో స్టార్ హీరోయిన్ స్థాయికి చేరుకుంది. ఆ తర్వాత ఈమె వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం లేని రేంజ్లో కెరియర్ను ముందుకు సాగించింది. ఈమధ్య కాలంలో ఈమె సినిమాల సంఖ్య తగ్గినా కూడా క్రేజ్ మాత్రం పెద్దగా తగ్గలేదు. ప్రస్తుతం ఈ బ్యూటీ వయస్సు 45 సంవత్సరాలు. ఇప్పటికీ కూడా కరీనా తన అందాలతో ప్రేక్షకులను అలరిస్తుంది. సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉంటూ తనకు సంబంధించిన హాట్ ఫోటోలను కూడా పోస్ట్ చేస్తుంది. అందులో చాలా వరకు వైరల్ అవుతున్నాయి. ఇలా 45 ఏళ్ల వయసులో కూడా అదిరిపోయే రేంజ్లో అందాన్ని మెయింటైన్ చేయడం మాత్రమే కాకుండా ఆ అందాలతో కుర్రకారును ఈ బాలీవుడ్ బ్యూటీ ఫిదా చేస్తుంది.

## టెక్లా మూవీ గ్రాండ్ గా లాంచ్

ఐశ్వర్యా రజినీకాంత్ దర్శకత్వంలో కన్నన్ రవి గ్రూప్ బ్యానర్‌పై నిర్మాత కన్నన్ రవి నిర్మిస్తున్న 'టెక్లా' చిత్ర ప్రారంభ వేడుక చెన్నైలో ఈరోజు (మార్చి 6, 2026) ఘనంగా జరిగింది. ఈ చిత్రంలో జై, సురాజ్ వెంజరమూడు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రంలో ఆనంద్ రాజ్, జి.ఎం. సుందర్, జార్జ్ మారియన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. యువన్ శంకర్ రాజా ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. నిర్మాత కన్నన్ రవి ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, దీపక్ రవి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

ఇటీవల విడుదలైన ఈ చిత్ర ఇంట్రో వీడియోకు మంచి స్పందన వచ్చింది. చెన్నైలోని ఒక స్టార్ హోటల్‌లో అధికారికంగా సినిమా ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు నామ్ తమిళర్ కచ్చి చీఫ్ కోఆర్డినేటర్ సీమన్, లతా రజినీకాంత్, ప్రముఖ నిర్మాత ఆర్.బి. చౌదరి, దర్శకుడు బాలా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తమిళ సినీ పరిశ్రమకు చెందిన పలువురు నిర్మాతలు, నటులు, టెక్నీషియన్లు, డిస్ట్రిబ్యూటర్లు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.




## పెద్ది నుంచి స్పెషల్ పోస్టర్ రిలీజ్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పాన్‌ఇండియా యాక్షన్ డ్రామా పెద్ది పోస్ట్‌ప్రొడక్షన్, ప్రమోషనల్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. బుచ్చి బాబు సనా దర్శకత్వంలో, వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలకు సిద్ధమవుతోంది.

ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన హీరోయిన్‌గా నటిస్తున్న జాన్వీ కపూర్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఒక ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో ఆమె సంప్రదాయ శైలిలో కనిపిస్తూ కూడా గ్లామరస్‌గా ఆకట్టుకుంటున్నారు. సినిమాలో ఆమె అచ్చియమ్మ అనే పల్లెటూరి అమ్మాయిగా కనిపించనున్నారు.

పోస్టర్‌లో మెరూన్ కలర్ ఎంబ్రాయిడరీ బ్లౌజ్, మ్యాచింగ్ లెహంగా ధరించి ఆమె స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. మెడలో లేయర్డ్ నెక్లెస్‌లు, చేతికి బ్రేస్‌లెట్, ఎరుపు రంగు రౌండ్ సన్‌గ్లాసెస్ ఆమె లుక్‌కు ప్రత్యేక ఆకర్షణను అందిస్తున్నాయి. లూజ్ హెయిర్, కాన్ఫిడెంట్ పోజ్‌తో ట్రెడిషనల్ చార్మ్‌కు మోడర్న్ టచ్‌ను జోడించారు.

ఇదే సందర్భంగా చిత్రబృందం జాన్వీ కపూర్‌కు స్పెషల్ బర్త్‌డే ట్రిబ్యూట్ వీడియోను కూడా విడుదల చేసింది. ఇందులో ఆమె ఆన్‌స్క్రీన్ ఎలిగెన్స్‌తో పాటు ఆఫ్‌స్క్రీన్ చార్మ్‌ను చూపించే బీహైండ్ ది సీన్స్ మూమెంట్స్ ఉన్నాయి. వీడియోలో జాన్వీ సంప్రదాయ లుక్స్‌లో మెగాఫోన్ పట్టుకుని, వింటేజ్ మైక్ ముందు పాట పాడుతున్నట్లు కనిపిస్తారు. అలాగే దర్శకుడు బుచ్చి బాబు సనా, హీరో రామ్ చరణ్‌తో ఆమె మాట్లాడుతున్న మూమెంట్స్ ఆకట్టుకున్నాయి.



## నూతన దంపతులకు సీఎం శుభాకాంక్షలు

తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఈరోజు సినీ నటుడు విజయ్ దేవరకొండ నివాసాన్ని సందర్శించారు. ఇటీవల వివాహ బంధంతో ఒక్కటైన విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న దంపతులకు సీఎం శుభాకాంక్షలు తెలిపారు. రిసెప్షన్ కార్యక్రమం సమయంలో ఢిల్లీలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఈరోజు ప్రత్యేకంగా విజయ్ దేవరకొండ నివాసానికి వెళ్లి కొత్త జంటను ఆశీర్వదించారు. వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన దంపతులతో పాటు వారి కుటుంబ సభ్యులతో ముఖ్యమంత్రి మర్యాదపూర్వకంగా ముచ్చటించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులతో కలిసి ఫోటోలు దిగారు.

## శ్రీనివాస మంగాపురం

### మూడో కీలక షెడ్యూల్ పూర్తి



RX 100, మంగళవారం చిత్రాలలో ప్రేక్షకులు, విమర్శకుల ప్రశంసలు అందుకున్న దర్శకుడు అజయ్ భూపతి, ప్రస్తుతం 'శ్రీనివాస మంగాపురం' ప్రాజెక్ట్‌కి దర్శకత్వం వహిస్తున్నారు. సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు సోదరుడి కుమారుడు జయ కృష్ణ ఘట్టమనేని ఈ సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు. రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని ఈ చిత్రంలో హీరోయిన్ గా నటిస్తున్నారు. కలెక్షన్ కింగ్ మోహన్ బాబు ఈ చిత్రంలో కీలక పాత్రలో కనిపించనున్నారు.

అగ్ర నిర్మాత అశ్విని దత్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. నిర్మాత పి కిరణ్ నిర్మిస్తున్న శ్రీనివాస మంగాపురం ఇప్పటికే విడుదలైన టైటిల్ రివీల్, ఆకట్టుకునే ఫస్ట్ లుక్ పోస్టర్లు ప్రేక్షకుల్ల ఆసక్తిని రేకెత్తించాయి. ఇటీవల చిత్రబృందం తిరుపతిలో జరిగిన కీలకమైన మూడో షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. ఈ షెడ్యూల్‌లో కృష్ణ ఘట్టమనేని, రాషా తడాని తదితర ప్రధాన తారాగణంపై ముఖ్య సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ షెడ్యూల్ పూర్తవడంతో సినిమా షూటింగ్ దాదాపు 60 శాతం పూర్తయింది. ప్రస్తుతం చిత్ర నిర్మాణం వేగంగా కొనసాగుతోంది. మేకర్స్ భారీ స్థాయిలో ప్రాజెక్ట్ ను రూపొందిస్తున్నారు.

టాప్ టెక్నికల్ టీమ్ ఈ చిత్రానికి పని చేస్తున్నారు. సంగీతాన్ని జివి ప్రకాశ్ కుమార్ సమకూరుస్తుండగా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ జయకృష్ణ ISC, ఎడిటింగ్ బాధ్యతలను మాధవ్ కుమార్ గుల్లపాటి నిర్వహిస్తుండగా, ప్రొడక్షన్ డిజైనర్ సాహి సురేష్. హైఇంటెన్సిటీ యాక్షన్ సన్నివేశాలకు రియల్ సతీష్ కొరియోగ్రఫీ అందిస్తున్నారు.

## వృషకర్మ బ్లాక్ బస్టర్

### డైరెక్టర్ సుకుమార్ ప్రశంసలు



యువ సామ్రాట్ నాగ చైతన్య, 'విరూపాక్ష' ఫేం కార్తీక్ దండుతో కలిసి నెవర్ బిఫోర్ మిథికల్ థ్రిల్లర్ 'వృషకర్మ'తో డిఫరెంట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర (SVCC), సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్ పై, బాపినీడు ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన BTS వీడియో, అద్భుతమైన ఫస్ట్ లుక్ క్యూరియాసిటీ పెంచాయి. తాజాగా విడుదలైన ఫస్ట్ గ్లింప్స్ అంచనాలను మరింత పెంచింది. బ్లాక్ బస్టర్ డైరెక్టర్ సుకుమార్, హీరో నాగ చైతన్య, దర్శకుడు కార్తీక్ దండు 'వృషకర్మ' గ్లింప్స్ పై ప్రశంసలు కురిపించారు.

సుకుమార్ మాట్లాడుతూ.. "కార్తీక్ మొదట కథ చెప్పినప్పుడు, నన్ను చాలా ఆకట్టుకుంది. అప్పుడే మేము దీన్ని నిర్మించాలని నిర్ణయించుకున్నాము. బాపినీడు, నేను కలిసి సినిమా ప్రొడ్యూస్ చేయాలని డిసైడ్ అయ్యాం. ముందుగా, నేను కార్తీక్ గురించి చెప్పాలి. తను ఇండస్ట్రీకి దొరికిన బెస్ట్ టెక్నీషియన్. అతను కథ చెప్పినప్పుడు విజువల్స్ ఇంత అద్భుతంగా వస్తాయని నేను కూడా ఊహించలేదు, అద్భుతంగా చేశాడు. అజినీస్ విరూపాక్షకు చాలా హెల్ప్ అయ్యాడు, ఈ చిత్రాన్ని కూడా అతను ఎంతగా ఎలివేట్ చేస్తాడో నాకు తెలుసు. కార్తీక్‌లోని ఒక గొప్ప లక్షణం ఏమిటంటే, అతను బెస్ట్ టెక్నికల్ టీంని ఎంచుకుంటాడు. డీవోపీ రఘుల్ ఈ ప్రాజెక్ట్‌లో చేరడంతో సినిమా కలర్ మారిపోయింది. ప్రోడక్ట్ విషయంలో చాలా హ్యాపీగా పాజిటివ్ గా ఉన్నాను. ముఖ్యంగా నాగ చైతన్య మొదటి నుంచి ఇన్వాల్ అవుతూ సినిమా ఇంత అద్భుతంగా రావడంలో పెద్ద పాత్ర పోషించారు. ప్రోడక్ట్ చాలా బాగా వచ్చింది. చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నాము. తప్పకుండా మీరందరూ ఎంజాయ్ చేస్తారు'.

## ఉమెన్స్ క్రికెట్ లీగ్ లోగో ఆవిష్కరణ




బెస్ట్ విషెస్ అందించిన టి. జి. విశ్వ ప్రసాద్, కె. ఎల్. దామోదర్ ప్రసాద్

మహిళలు క్రీడల్లో మరింతగా పాల్గొనేలా ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఉమెన్స్ క్రికెట్ లీగ్ అధికారిక లోగో ఆవిష్కరణకు ముఖ్య అతిథి గా ప్రముఖ సినీ నిర్మాత, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ వ్యవస్థాపకులు టి.జి. విశ్వ ప్రసాద్, సినీ నిర్మాత కె.ఎల్. దామోదర్ ప్రసాద్, ఉమెన్స్ క్రికెట్ లీగ్ డైరెక్టర్ & అలా మొదలైంది సినిమా ఫేమ్ స్నిగ్ధా తో పాటు ప్రత్యేక అతిథులుగా బిగ్ బాస్ ఫేమ్ శ్రీ సత్య, కమ్యూనిటీ కనెక్ట్ స్పోర్ట్స్ డైరెక్టర్ సందీప్ వర్మ, బిగ్ బాస్ ఫేమ్ అర్జున్ కళ్యాణ్ పాల్గొని కలసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం హైదరాబాద్ లోని గచ్చిబౌలిలో లా వీ ఎన్ రోజ్ వేదికగా జరిగింది. ఉమెన్స్ క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు మార్చి 7 మరియు మార్చి 8, 2026 తేదీలలో సాయంత్రం 6:00 గంటలకు తెల్లాపూర్‌లోని ప్రైమ్ అరినా లో నిర్వహించబడనున్నాయి. ఈ లీగ్‌లో సినీ రంగం, కార్పొరేట్ రంగం, గృహిణులు మరియు ఇతర సమాజాల నుంచి వచ్చిన 6 ఫ్రాంచైజీలకు చెందిన మొత్తం 96 మంది మహిళలు పాల్గొననున్నారు.

సినీ నిర్మాత విశ్వప్రసాద్ మాట్లాడుతూ ఉమెన్స్ క్రికెట్ అనేది మునుపటి వరకు పెద్ద ప్రాచుర్యం లేదు కానీ మగవారితో దీటుగా నేడు మెన్స్ క్రికెట్ తో పాటు ఉమెన్స్ క్రికెట్ కూడా అదే విధంగా ఆదరణ పొందుతుంది. ఎంతోమంది ప్రజలు వీక్షిస్తున్నారు. క్రికెట్ అనేది ఒకటే కాకుండా మహిళలు అన్ని రంగాలలో అన్ని విధమైన స్పోర్ట్స్ లో ప్రత్యేక గుర్తింపుతో పాటు మంచి ప్రతిభ కనబరుస్తున్నారని వాళ్ళ బలం మరింత నిరూపించుకుంటూ అన్ని రకాల స్పోర్ట్స్ లో ఇంకా ఎక్కువమంది రావాలని తెలిపారు.

నిర్మాత కె. ఎల్. దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ.. "మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. మహిళల క్రికెట్ కు ప్రస్తుతం లభిస్తున్న ఆదరణ అందరికీ తెలిసిందే. ఉమెన్స్ క్రికెట్ లీగ్ మరింత ముందుకు వెళ్ళాల"ని కోరుకుంటున్నాను. లీగ్ డైరెక్టర్ స్నిగ్ధా మాట్లాడుతూ, ఈ లీగ్ ద్వారా అనేక మంది మహిళలు ముందుకు వచ్చి క్రీడల్లో చురుకుగా పాల్గొనాలని, తమ సామర్థ్యంపై నమ్మకం పెంచుకోవాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ మహిళా క్రికెట్ ఉత్సవాన్ని విజయవంతం చేయడానికి ప్రముఖులు మరియు మహిళా క్రీడలకు మద్దతు ఇచ్చే వారందరినీ నిర్వాహకులు ఆహ్వానించారు.

Printed, Published & Owned by SIRIKONDA MARIA, Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda,RTC X Roads, Hyderabad - 500020, Telangana.
Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: TELTEL/2000/00272. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.